# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:14 సంచిక:10 164 అక్టోబర్ 2024 హైదరాబాద్

* మన కాలపు యోధ
* దళిత జాతీయవాద దృక్పథం
* చారిత్రక పోరాటానికి దక్కిన ఫలితం
* తెలంగాణ ఉక్కు మిషన్! జై కిషన్!!
* తెలంగాణలో గ్రంథమాలలు
* డా.ఎన్.గోపి కవిత్వంలో "స్మృతి"



UGC CARE LISTED JOURNAL

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

అక్టోబర్ 2024
సంచిక : 10
సంపుటి : 14

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి
**ప్రొఫెసర్ గణేష్**
ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

## సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి**, జర్నలిస్టు
**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డిటిపి, లే ఔట్ :** స్నేహ
**కవర్ డిజైన్ :** క్రాంతి



రచనలు పంపాల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
**మెయిల్:nadusthunnatelangana@gmail.com**
**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

హైదరాబాద్
హస్తినా
నగరమేదైనా
అగ్రహారాలను
అధీకృత పీఠాలను
బద్దలుకొట్టిన
మనకాలపు యోధ

కమండలాన్ని
కాలాన్ని
ఉచ్చపోయించిన
వీల్‌ఛైర్ ధారి

**31 అక్టోబర్, 2024**


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

మనకాలపు యోధ — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 5

**సామాజికం**

దళిత జాతీయవాద దృక్పథం — **డా॥ గోపని చంద్రయ్య** — 7

చారిత్రాత్మక పోరాటానికి దక్కిన ఫలితం — **డా.సుమన్ దామెర, సిలపాక వెంకటాద్రి, ఈర్ల కమలాకర్** — 14

**నడుస్తున్న కాలం**

కోటొక్కపూల పండుగ బతుకమ్మ — ఎస్.**పరమేశ** — 20

**తొవ్వ ముచ్చట**

తెలంగాణ ఉక్కు మిషన్–జై కిషన్ — **డా॥ కల్యాడపు రమేష్** — 23

**విమర్శ**

తెలంగాణలో గ్రంథమాలలు — **డా॥ మల్లెగోడ గంగాప్రసాద్** — 32

**పరిశోధన**

డా॥ఎన్.గోపి కవిత్వంలో 'స్మృతి' — **డా.సుంకర గోపాలయ్య** — 35

గూడ అంజయ్య కథలు - విశ్లేషణ — **గరిశందుల సరిత** — 40

**పల్లె సుద్దులు**

పల్లెల్ల పండుగ లొల్లి — **రవి కుర్మకోరె** — 44

**పుస్తక సమీక్ష**

యూనివర్సిటీ 'రామచిలుకల'కు గుణపాఠ్యాంశం — **డా॥ చంద్రయ్య శివన్న** — 46

**పరిశోధన పరిచయం**

వరంగల్ జిల్లా జానపద గేయకథల అధ్యయనం — **డా॥ ధారవత్ సంతోష్‌కుమార్** — 49

*సవరణ:* నడుస్తున్న తెలంగాణ అక్టోబర్ సంచికలో బూర్ల వెంకటేశ్వర్లు రాసిన 'తెలంగాణ ప్రజా భాషోద్ధారకుడు 'నలిమెల' అనే వ్యాసంలోని నాలుగో పేరాలో 2022 తెలంగాణ రచయితల వేదిక 'ఆవిర్భావ సభ' అని వచ్చింది. దానిని 'ప్రథమ మహాసభ'గా మార్చుకొని చదువుకోగలరని పాఠకులకు విజ్ఞప్తి.

-సంపాదకులు

# మన కాలపు యోధ

ప్రొఫెసర్ చింతకింది కాశీం

యోధులు అరుదుగా తయారవుతారు. సమాజ సంక్షోభాల నుంచి, వైరి సంవాదం నుంచి, ప్రగతిదాయక ఆచరణ నుంచి నూతన మానవులు రూపొందుతారు. ఆయా సామాజిక సందర్భాలే ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్‌ను, భూమిపుత్రులను నిర్మాణం చేస్తాయి. ఉత్పత్తి సంబంధాలలో మార్పు కోసం ఉత్పత్తి శక్తులు అవిశ్రాంతంగా పెనుగులాడుతాయి. ఈ నేపథ్యంలో ఘనీభవించిన ఉత్పత్తి సంబంధాలు కదలబారుతాయి. సామాజిక సమూహాలు చైతన్యం పొందుతాయి. వ్యక్తీకరణ వైయక్తిక స్థాయి నుంచి సమష్టిగా మారుతుంది. కనుక సామాన్యులు అసమాన్యులుగా మారుతారు. సమాజంలో జరిగే ప్రతీచలనం ఉత్పత్తి శక్తులను ముందుకు తోస్తుంది. భారతీయ సమాజంలోనైతే అసమ సామాజిక నిర్మాణం మీద మొదట అసమ్మతి మొదలవుతుంది. అది మెల్లగా రాజకీయార్థిక ఆచరణగా రూపుదిద్దుకుంటుంది. ఆ క్రమంలో భరించలేని సామాజిక ఆధిపత్యం మీద చొరవతో కూడిన తిరుగుబాటు ప్రారంభమవుతుంది. అంతకు మునుపే విసిరివేయబడినట్లు ఉండే సమూహాలు నిదానంగా సమీకరించబడుతాయి. నిర్మాణమవుతాయి. తమ నిర్మాణం నుంచే నాయకత్వం రూపొందుతుంది. అయితే సామాజిక అస్తిత్వాలు వ్యక్తుల ఆలోచనాస్రవంతిని విశేషంగా ప్రభావితం చేస్తాయి. తమ చుట్టూ ఉండే స్థితిగతులు మనిషి ఆచరణ మీద పొదచూపుతాయి. కుటుంబం, విద్య, సామాజిక హెూదా, భూమి, సంస్కృతి, శారీరక నిర్మాణం మొదలైన వ్యవస్థాగత, వ్యక్తిగత అంశాలే వీరులను, యోధులను తయారుచేస్తాయి. అలా శారీరక సవాళ్లను అధిగమించి ఈ అర్థశతాబ్దంలో దేశాన్ని విశేషంగా ప్రభావితం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబ. ఆయననే మనకాలపు యోధ.

సాయి 1967లో సన్నవిల్లి గ్రామం, అమలాపురం తాలూకా, తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. తండ్రి సత్యనారాయణ, తల్లి సూర్యకాంతమ్మ. సామాజిక నిర్మాణంలో వాళ్లు కాపులు. కాపులు అంటే కాచేవారని, భూమికి కాపలాదారులని అర్థం. సత్యనారాయణ రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఎద్దులు, నాగలి ఆయన జీవితంతో పెనవేసుకొని ఉండేవి. కుటుంబం కోసం ఒక ఆవు, దాని పాడితో జీవితం సాగుతుండేది. సత్యనారాయణకు మంచి రైతుగా పేరుండేది. ఒడుపుగా వ్యవసాయం చేసి ఆ రోజుల్లోనే ఎకరానికి ముప్పై బస్తాలు పండించేవాడు. భూమిని నమ్ముకున్న భూమిపుత్రుడు. వ్యవసాయమే జీవితంగా బతికే కుటుంబంలో సాయి మొదటి సంతానం. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు చాలా చురుకైన బాలుడు. ఇంట్లోనైనా, బయటైనా అతివేగంగా కదులుతుండేవాడు. అనుకోకుండా ఐదేళ్ల ప్రాయంలో కాళ్లు చచ్చుపడటం మొదలయింది. తన శరీరంలో ఈ మార్పు ఎందుకొస్తుందో తెలియని అమాయకత్వంలో సాయి ఉండేవాడు. తమ కళ్ల ముందే చురుకుగా ఆడుకున్న బిడ్డ అలా అచేతనుడు కావటం తల్లిదండ్రులకు దుఃఖభరితమే. ఆర్థికంగా వెసులుబాటు లేని కుటుంబం దిక్కుతోచని విషాదంలోకి నెట్టబడింది. అమలాపురంలో ఉన్న డాక్టర్లకు చూయించారు. కానీ వ్యాధి నిర్ధారణ కాలేదు. పోలియో జబ్బు గురించిన అవేర్‌నెస్ ఆనాడు ప్రజలకు లేదు, వైద్య శాస్త్రంలో కూడా దాని గురించిన సంపూర్ణ అవగాహన లేదు. డాక్టర్ల సూచన మేరకు సాయిని విశాఖ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరీక్షించిన డాక్టర్లు సాయికి పోలియో సోకిందని నిర్ధారించారు. సొంతూరు వదిలి ఎరగని తల్లిదండ్రులకు మొదటిసారి విశాఖకు వచ్చి తెలుసుకున్న వార్త తమ బిడ్డకు సోకిన భయంకరమైన వ్యాధి గురించి.

తమ కళ్ల ముందే ఆడుతూ, పాడుతూ పరుగెత్తిన సాయి పాకటం మొదలుపెట్టాడు. తల్లి సూర్యకాంతమ్మ బిడ్డను చూసి శోకసంద్రమయింది. స్కూల్‌కు వెళ్లి చదువుకునే వయస్సులో సాయి చేతులతో పాకుతూ తల్లి చుట్టూ తిరిగేవాడు. ఇంటికి సమీపంలో ఒక శివాలయం ఉండేది. ఆ గుడిలో పూజారి కొందరు పిల్లలను చేరదీసి అక్షరాలు నేర్పిస్తుండేవాడు. అలా సాయి కూడా పూజారిని చేరుకున్నాడు. మనుషులను ఆదరించే లక్షణం శైవానికి ఉంటుంది. అందుకే కావచ్చు విస్మరణకు గురైన పిల్లలకు విద్యను అందించటం కంటే మించిన శివపూజ లేదని ఆ పూజారి భావించి ఉంటాడు. అతడే సాయికి మొదటి గురువు. ఈ సమయంలో సాయి కుటుంబం మరో సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. సాయి తండ్రి సత్యనారాయణను మోసం చేసి సమీప బంధువులు తమ జీవనాధారమైన రెండెకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇక చేసేదేమిలేక సత్యనారాయణ కుటుంబాన్ని తీసుకొని సమీపంలో ఉన్న అమలాపురం పట్టణానికి చేరుకున్నాడు. అద్దెకు ఇల్లు తీసుకొని గుమస్తాగా ఉద్యోగంలో చేరాడు. కొన్నాళ్ల తర్వాత కొందరు బంధువుల సహాయంతో అమలాపురంలో ఇంటి జాగ కొనుక్కొని గుడిసె నిర్మాణం చేసుకున్నారు. సాయి బాల్యం సన్నవిల్లి గ్రామం నుంచి అమలాపురానికి చేరుకున్నది.

ఇంటి పక్కనే ఉన్న సెయింట్ జాన్ పాఠశాలకు భూమి మీద పాకుతూ వెళ్లేవాడు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆ పాఠశాలలోనే చదువుకున్నాడు. క్రైస్తవ పాఠశాల అంటే ఎంతో కొంత మనుషుల పట్లనెనరు చూయించే ఉపాధ్యాయులు

ఉంటారు. ఆ పాఠశాలను పర్యవేక్షించే ఫాదర్ సాయిని అక్కున చేర్చుకున్నాడు. సాయి మనో వికాసానికి కావలసిన పునాదిని ఆ ఫాదర్ రూపొందించాడు. సాయి తల్లి సూర్యకాంతమ్మ అపూర్వమైన ప్రేమాస్పదురాలు. మొక్కలను, పక్షులను, మనుషులను ప్రేమించే కరుణామయురాలు. తన బిడ్డను ఆదరణతో చూచే మిషనరీ పాఠశాల, దాని వసతి గృహానికి అప్పుడప్పుడు సూర్యకాంతమ్మ తన పెరడులో పండించిన కూరగాయలను, ఆకుకూరలను తన చిన్న కొడుకు రాందేవ్‌తో పంపిస్తూ ఉండేది. తన మాతృప్రేమను ముగ్గురు తన పిల్లలతో పాటు పాఠశాలలో ఉండే విద్యార్థులందరికీ పంచిపెట్టింది.

కాలం గడుస్తుండగా సాయికి తన శరీర పరిమితులు అనుభవంలోకి రాసాగాయి. వాటిని అధిగమించి అందరి పిల్లల వలె ఆడాలని, పాడాలని, పరుగెత్తాలని తోస్తూ ఉండింది. తన శారీరకవైకల్యాన్ని జయించడానికి కావలసిన వైద్యం ఇండియాలో లేకపోవటం వలన, ఆ వైద్యం సోషలిస్టు రష్యాలో ఉందని తెలుసుకొని స్వయంగా సాయి అక్కడి డాక్టర్లకు లేఖరాసాడు. కానీ వాళ్లు సాయిని రష్యా రమ్మని కోరారు. అక్కడికి వెళ్లే ఎలాంటి స్థోమత ఆయనకు లేదు. కనుక ఒక మిషనరీ హాస్పటల్‌కు రష్యా, అమెరికా నుంచి డాక్టర్లు వస్తున్నారని తెలుసుకొని సాయి వాళ్లను కలుసుకున్నాడు. ఆ డాక్టర్లు సాయికి పదవ తరగతిలోపే నాలుగు ఆపరేషన్లు చేసారు. కానీ వ్యాధి నయం కాలేదు. ఇక సాయి జీవితంలో పోలియో భాగమయింది. కొన్నిసార్లు వాళ్ల నాన్న సైకిల్ మీద, మరికొన్నిసార్లు తమ్ముడు రాందేవ్ సైకిల్ మీద పాఠశాలకు వెళ్లేవాడు. పాఠశాల విద్య తర్వాత ఎస్‌కెబిఆర్ కళాశాలలో ఇంటర్(1982), డిగ్రీ(1984) చదువుకున్నాడు. స్నేహితుల సహాయంతో కాలేజీకి వెళ్లి వచ్చేవాడు.

అమలాపురంలో డిగ్రీ పూర్తి చేసుకొని ఎం.ఏ(ఇంగ్లీష్) చదువు కోసం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో (1987)లో చేరాడు. అమలాపురం పట్టణాన్ని వదిలి సాయి మరో ప్రాంతానికి రావటం ఇదే మొదలు. విశ్వవిద్యాలయంలో చేరటం వలన ఆయన ప్రపంచం విశాలమయింది. ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే అధ్యయనం ఉత్తమ మార్గమని సాయికి తెలిసింది. కనుక ఆయన ఎక్కువ సమయం లైబ్రరీలో గడిపేవాడు. ముఖ్యంగా ఆఫ్రికన్ సాహిత్యాన్ని విస్తృతంగా చదివాడు. ఆ క్రమంలోనే గూగి సాహిత్యం పరిచయం అయింది. సమాజంలో బుద్ధిజీవులు ఎవరి పక్షం ఉండాలో గూగీని అధ్యయనం చేసి సాయి నేర్చుకున్నాడు. ఆయన యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్‌లో చదువుతుండిన రోజులలో మండల్ కమీషన్ ఉద్యమం(1990) ఎజెండా మీదికి వచ్చింది. సాహిత్యం ద్వారా రాజకీయార్థిక విషయాలను అర్థం చేసుకున్న సాయి సామాజిక అంశాల పట్ల తన ఆసక్తిని పెంచుకున్నాడు. కనుక బీసీ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని తనకు తోచిన పద్ధతిలో ప్రశ్నిస్తూ రాజకీయాచరణలోకి సాయి అడుగుపెట్టాడు. నూతన ఆర్థిక సంస్కరణల ప్రవేశం, మండల్ కమీషన్ రాజకీయాలు, బాబ్రీమసీద్ కూల్చివేత, అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలు వెంట వెంట వచ్చాయి. ముప్పిరి గొల్పిన ఈ నేపథ్యంలో సాయి తన కార్యాచరణను మొదలుపెట్టాడు. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో డిప్లమా ఇన్ ఇంగ్లీష్ టీచింగ్ కోర్సులో చేరాడు. ఇక్కడే ఒక ఆంగ్ల అధ్యాపకుడు పరిచయమయ్యాడు. అప్పటికే ఆయనకు విప్లవ రాజకీయాలతో పరిచయం ఉండటం వలన సాయికి విప్లవ రాజకీయాల స్నేహం దొరికింది.

సాయి ఇఫ్లూలో చదువుతున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి(1990-92)గా ఉన్నాడు. ఆయన విద్యారంగాన్ని ప్రైవేటీకరించే విధానపరమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆయా ప్రధానాంశాలలో ఒకటి. ఆయన ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా విద్యార్థి యువజన ఉద్యమం ప్రారంభమయింది. ఈ ఉద్యమానికి వామపక్ష, విప్లవ విద్యార్థి సంఘాలు నాయకత్వం వహించాయి. రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తే ప్రజలు స్వచ్ఛంగా పాల్గొని సంపూర్ణ బంద్‌ను పాటించారు. దీనిని గమనించిన నాటి ప్రధాని పీవీ నర్సింహారావు, జనార్ధన్‌రెడ్డి చేత రాజీనామా చేయించాడు. ఈ పోరాటంలో సాయి చురుకుగా పాల్గొన్నాడు.

5, 6 మే 1990లో వరంగల్‌లో రైతుకూలీ సంఘం మహాసభలు జరిగాయి. ఈ సభలను ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీ నిర్వహించింది. ఫలితంగా విప్లవోద్యమ ప్రభావం రాష్ట్రమంతా విస్తరించింది. ఈ ప్రభంజనాన్ని చూసి దడిసిన ప్రభుత్వం పీపుల్స్‌వార్ పార్టీ, దాని అనుబంధ సంస్థల మీద నిషేధాన్ని విధించింది. ఎన్‌కౌంటర్లు ప్రారంభమయ్యాయి. విప్లవోద్యమ నాయకులను కొందరిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. జైల్లో ఖైదీలకు సరైన వసతులు లేక మురికికూపాలుగా మారిపోయాయి. ఖైదీని సంస్కరించేది పోయి శిక్షించే పద్ధతులు అక్కడ అమలవుతుండినవి. ఆ నేపథ్యంలో జైల్లో ఉన్న విప్లవోద్యమ నాయకులు ఖైదీలందరిని ఏకంచేసి జైలు పోరాటానికి పిలుపునిచ్చారు. బ్రిటిష్ కాలం నాటి జైలు మాన్యువల్‌ను మార్చాలని, రాజ్యాంగబద్ధ హక్కులన్నీ ఖైదీలకు ఉండాలనే డిమాండ్స్‌తో జైలు లోపల ఖైదీలు పోరాటాన్ని ప్రారంభించారు. ఈ పోరాటానికి మద్దతుగా జైలు బయట ఒక సంఘీభావ కమిటి ఏర్పడి పనిచేసింది. హైదరాబాద్‌లోని సచివాలయం ముందు శిబిరం ఏర్పాటు చేసి నలభై రోజులకు పైగా ధర్నాలు నిర్వహించారు. సంఘీభావ కమిటీకి సాయి, పవన్‌కుమార్ నాయకత్వం వహించారు. ఈ పోరాట ఫలితంగా జైలులో ఎన్నో సంస్కరణలు జరిగాయి. కొత్త జైలు మాన్యువల్ రూపొందించబడింది.

*1996లో అఖిలభారత ప్రజాప్రతిఘటన వేదిక(ఏఐపిఆర్ఎఫ్) ఏర్పడింది. ఈ సంస్థకు సాయిబాబా ఆల్ ఇండియా కమిటీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేసాడు. దేశంలో జాతుల సమస్య ప్రధాన చర్చనీయాంశంగా ఉండిన రోజుల్లో ఆ అంశం మీద ఢిల్లీలో సెమినార్ నిర్వహించాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జాతుల సమస్య మీద పని చేస్తుండిన మేధావులను, ఆలోచనాపరులను కూడగట్టి సదస్సు నిర్వహించడంలో సాయి ప్రధాన భూమికను పోషించాడు. ఈ క్రమంలో ఆయన అప్పటికే చేరి పనిచేస్తుండిన పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ ఉద్యోగాన్ని కూడా వదిలివేసాడు. తర్వాత 29, 30 డిసెంబర్ 1997లో రెండు రోజులపాటు తెలంగాణ అంశం మీద సదస్సు నిర్వహించి వరంగల్ డిక్లరేషన్‌ను వెలువరించడంలో సాయి కృషి మరువలేనిది. దేశంలో చిన్న రాష్ట్రాల ప్రకటన తర్వాత తెలంగాణ రాష్ట్ర డిమాండ్ తిరిగి ఎజెండా మీదికి వచ్చింది. దాని పట్ల స్పష్టమైన వైఖరిని ప్రకటిస్తూ 'ప్రత్యేక తెలంగాణ-ప్రజాస్వామిక ఆకాంక్షలు' పేరుతో విధానపత్రం ముందుకు వచ్చింది. ఆ తర్వాతనే మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నది.*

*2004కు ముందు బహుళజాతి కంపెనీల, వరల్డ్ బ్యాంక్ నిర్దేశిత కార్యక్రమాలు ప్రపంచ వ్యాపితంగా కొన్ని ఎన్‌జీవోలు కలిసి 'వరల్డ్ సోషల్ ఫోరం'గా ఏర్పడి నిర్వహించాయి. 2004లో ముంబాయిలో వారం రోజుల పాటు ఒక జాతర జరిగింది. పెట్టుబడిదారి అభివృద్ధి నమూనాకు అనుకూలమైన ప్రాతిపదికను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా వాళ్లు పనిచేసారు. అయితే ప్రపంచీకరణ ఒక అనివార్యక్రమమని, దానిని అంగీకరించాలని కాకపోతే దానికి మానవ ముఖాన్ని జోడించాలని వాళ్లు కోరుకున్నారు. కొందరు ప్రజాస్వామిక మేధావులు, ప్రగతివాదులు కూడా అందులో పాల్గొన్నారు. ఈ సందర్భంలో వరల్డ్ సోషల్ ఫోరంకు ప్రత్యామ్నాయంగా 'ముంబాయి రెసిస్టెన్స్ ఫోరం'(ఎం.ఆర్) పేరున నాలుగు రోజుల కార్యక్రమాలను సాయి ముందుండి నడిపించాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటమంటే అదొక జాతర కాదు, ప్రతిఘటనా పోరాటమని చెప్పటానికి ఎం.ఆర్ 2004ను నిర్వహించారు.*

*2000 సంవత్సరం నుంచి సాయి తన కార్యక్షేత్రాన్ని హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మార్చాడు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తూ వివిధ ప్రజా సమస్యల మీద పనిచేసాడు. రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్.డి.ఎఫ్)కు సాయి నాయకత్వం వహించాడు. ఢిల్లీ యూనివర్సిటీలో ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ పోరాటం నడిపాడు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో అధ్యాపకుల పోస్టుల భర్తీలో రోస్టర్ పాటించాలని యూనివర్సిటి అధికారుల మీద ఒత్తిడి పెట్టాడు. మధ్య భారతంలో ఆదివాసుల మీద జరుగుతున్న యుద్ధాన్ని విరమించాలని ప్రపంచ వ్యాపితంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి అసమ్మతిని వినిపించాడు. హిందూత్వ బ్రాహ్మణీయ భావజాలాన్ని ఎల్లెడలా విస్తరించే మేధో కృషి పట్ల జాగురూకతతో ఉండాలని విప్లవ, బహుజన సమూహాలను చైతన్యం చేసాడు.*

*ఢిల్లీ కేంద్రంగా సాయి చేస్తున్న ఈ కృషికి పరిమితులు విధించాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో ఆ రాష్ట్ర పోలీసులు ఆయన మీద ఊపా కేసు నమోదు చేసారు. మావోయిస్టులకు సహకరిస్తున్నాడని ఆరోపిస్తూ ఆయననొక అర్బన్ నక్సలైట్‌గా, మావోయిస్టులకు అర్బన్ కనెక్ట్‌గా ఆరోపించి చిత్రించారు. నాగపూర్ కోర్టు కూడా పూర్వాపరాలు పరిశీలించకుండా సాయికి జీవితఖైదు విధించింది. ఆయన శరీరం సరిగ్గా పనిచేయకపోయినా మెదడు మాత్రం చురుకుగా పనిచేస్తుందని అది చాలా ప్రమాదకరమని న్యాయమూర్తి వ్యాఖ్యానించాడు. ఆలోచించే మెదడు ఉండటం కూడా నేరమనే భావన ఆ తీర్పులో వ్యక్తమయింది. పదేళ్లు ఆయనను జైల్లో తీవ్రమైన వేదనకు గురిచేసారు. కనీస వైద్యం అందించలేదు. అండాసెల్‌లో నిర్బంధించి ప్రాథమిక హక్కులను నిరాకరించారు. అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం సవాళ్లను ఎదుర్కొంటున్న ఖైదీకి దక్కవలసిన ఏ హక్కును జైలు అధికారులు సాయికి కల్పించలేదు. ఆయన జైలులోనే మరణించాలని అధికారులు కోరుకున్నట్లు వారి ప్రవర్తన రుజువు చేస్తుంది. కానీ 2024న బాంబే హైకోర్టు సాయికి విధించిన జీవిత ఖైదును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. పదేళ్ల తర్వాత హైకోర్టులో న్యాయం జరిగింది. కానీ ఈ పదేళ్ల కాలంలో విలువైన ఆయన జీవితం, ఆరోగ్యం కోల్పోయాడు. వాటిని తిరిగి ఎవరిస్తారనే ప్రశ్న మనందరిని వేదిస్తూనే ఉంది. చివరికి జైలులో ధ్వంసమైన శరీర అవయవాలతో సాయి విడుదలయ్యాడు. చిన్న వైద్యానికి కూడా శరీరం సహరించక విడుదలైన ఆరునెలల కాలంలోనే సాయి అమరుడయ్యాడు. సాయి జీవిత సహచరి వసంత కూడా ఈ మొత్తం నిర్బంధంలో వేదనలో, ఆరాట పోరాటాలలో భాగమై ఇవ్వాళ ఒంటరిగా మిగిలింది. సాయి కోసం ఎదురుచూసిన తల్లి బిడ్డను కళ్లారా చూసుకోకుండా కన్నుమూసింది. అపురూపమైన మేధావి, సున్నిత మనస్కుడు, ప్రజల పట్ల ప్రేమ కలిగిన పౌరుడు, సమాజం సమానత్వ ప్రాతిపదిక మీద నిర్మాణం కావాలని కోరుకున్న స్వాప్నికుడు మనల్ని వదిలి వెళ్లాడు. కానీ మనముందు చాలా ప్రశ్నలను ఉంచిపోయాడు. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెదికే ప్రయత్నం మనం చేయగలిగితే సమాజంలో మనిషితనం మిగిలి ఉన్నట్లే.*

*(రాందేవ్‌కు కృతజ్ఞతలతో...)*

T

# దళిత జాతీయవాద దృక్పథం

డా॥గోపని చంద్రయ్య

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య సంగ్రామం ముఖ్యమైన ఘట్టం. సుమారు రెండు వందల సంవత్సరాలు భారత్‌ను పరిపాలించిన బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ఎంతోమంది అమరులైనారు. ఎన్నోరకాల త్యాగాలు చేసారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధులు భిన్నమైన భావజాలాలు, రాజకీయ పంథాల్లో తమ శక్తిని ధారపోసారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం జరుగుతున్న కాలంలో నాలుగు భిన్నమైన వాదనలు ప్రభావం చూపాయి. 1. కాంగ్రెస్, గాంధేయవాదం, 2. కమ్యూనిస్టులు, 3. ఆర్యసమాజ్, హిందూమహాసభ, 4. అంబేద్కర్‌వాదం. ఈ నాలుగు సమూహాల నుండి దళిత యోధులు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. అయితే చరిత్రలో దళితుల త్యాగాలు, వారి పాత్ర, స్వాతంత్రోద్యమంపై వారికున్న దృక్పథాలను చరిత్రకారులు విస్మరించారు. విస్మరణకు గురైన దళిత స్వాతంత్రోద్యమ నాయకుల జీవితాలు – పోరాటాలు తెలుగు రాష్ట్రంలో ఎన్నో వున్నాయి. అంతేగాక వారి ప్రత్యామ్నాయ జాతీయవాద దృక్పథం కూడా వున్నది. వీటిని క్షేత్రస్థాయి పరిశోధనతో విశ్లేషించేడమే ఈ వ్యాసం లక్ష్యం.

**బి.ఆర్. అంబేద్కర్, స్వాతంత్రోద్యమం, జాతీయవాదం**

బి.ఆర్. అంబేద్కర్ తన జీవిత కాలంలో అనేక అంశాలపై తన అభిప్రాయాలను పరిశోధన గ్రంథాలుగా వెలువరించారు. తాను నమ్మిన విలువల కోసం, నిరంతరం పాటుపడ్డాడు. తాను రాసిన 'భారతదేశంలో కులాల పుట్టుక', 'కుల నిర్మూలన', 'గాంధీ మరియు కాంగ్రెస్ అంటరాని వారికి ఏమి చేసింది?' అనే గ్రంథాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగి వున్నాయి. భారత దేశంలో దేశభక్తులను చూసి అంబేద్కర్ ఇలా అంటాడు.

"India is a peculiar country and her nationalists and patriots are a peculiar people. A patriot and a nationalist in India are one who sees with open eyes his fellowmen treated as being less than men. But his humanity does not rise in protests. He knows that men & women for no cause are denied their human rights. But it does not prick his civic sense to helpful action. He finds whole class of people. shut out from public employment. But it does not rouse his sense of justice and fair play. Hundreds of evil practices that injure man and society are perceived by him. But they do not sicken him with disgust. The patriot's one cry is power and more power for him and for his class. I am glad I do not belong to that class of patriots. I belong to that class which takes its stand on democracy and which seeks to destray monopoly in a very shape and form. Our aim is to realise in practice our ideal of one man, one value in all walks of life, political, economic and social. It is because representative government is one means to that end that the depressed classes attach to it as great a value and it is because of its value to us" (Ambedkar, Volume-2, PP 598-599).

బి.ఆర్. అంబేద్కర్ గాంధీ, కాంగ్రెస్‌లు అనుసరించిన జాతీయవాద ద్వంద్వ వైఖరిని ప్రశ్నించారు. గాంధీ స్వరాజ్య భావనతో బ్రిటీష్ వారి నుండి స్వాతంత్ర్యాన్ని కోరుకున్నాడు. అందుకు సహాయ నిరాకరణ, స్వదేశీ, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాలను నిర్మించాడు. అయితే గాంధీ కుల నిర్మూలన భావనకు, అణగారిన వర్గాల ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు డిమాండ్ చేసి బ్రిటిష్ వారి నుండి సంపాదించిన కమ్యూనల్ అవార్డ్‌కు వ్యతిరేకంగా గాంధీ ఆమరణ నిరాహార దీక్ష చేసి భయానక వాతావరణాన్ని సృష్టించాడు. ఈ పరిస్థితి మొత్తాన్ని అర్థం చేసుకున్న అంబేద్కర్, గాంధీని కాంగ్రెస్ అగ్రవర్ణాల ప్రతినిధిగా, ఆయన వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నాడని ఎండగట్టారు. కులవ్యవస్థ, జాతి, జాతీయత, జాతీయవాద భావనలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని అంబేద్కర్ అభిప్రాయ పడ్డారు. ఎందుకంటే కుల వ్యవస్థ మనుషులను విభజించి, వారి మధ్యన హెచ్చుతగ్గులను సృష్టిస్తుంది. అంటరానితనం లాంటి అమానుష వ్యవస్థను సమర్థిస్తుంది. ఇది ప్రధానంగా న్యాయం, సమానత్వం, సోదరభావం అనే విలువలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. అందుకనే గాంధీ మరియు హిందూత్వ దేశభక్తులు ప్రచారం చేసే సాంస్కృతిక జాతీయవాదం అణగారిన కులాల సంక్షేమానికి, సమానత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తుందని చెప్పారు.

కాంగ్రెస్ వాదులు అంబేద్కర్‌ను బ్రిటీష్ ఏజెంటుగా ప్రచారం చేశారు. మండల్ – మజీద్ ఉద్యమాల తర్వాత అనేక భావజాల చర్చలు జరిగాయి. అరుణ్‌శౌరి లాంటివారు "వర్‌షిపింగ్ ఫాల్స్ గాడ్స్" అనే పుస్తకాన్ని రాసి అంబేద్కర్ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనలేదని వాదించారు. ఇప్పటికీ సెక్యులరిస్టులుగా చెప్పుకునేవారు కూడా అంబేద్కర్ బ్రిటీష్‌వారికి మద్దతుగా ఉండేవారని వాదిస్తారు. చంద్రభాను ప్రసాద్ అన్నట్లు "బ్రిటీష్‌వారు చాలా ఆలస్యంగా వచ్చారు. చాలా త్వరగా వెళ్ళిపోయారు" అనే వాదనను మనం దళితుల కోణంలో చాలా లోతుగా అర్థం చేసుకోవాల్సి వుంది. మనువాద వ్యవస్థ అమలౌతున్న భారత దేశంలో బ్రిటీష్‌వారి రాక దళితుల జీవితంలో కొంత మార్పును తీసుకు వచ్చింది. పూలే, సావిత్రి బాయిపూలే, స్వామి అచ్చుతానంద, అయోతదాస్, వాన్‌గంకార్ లాంటి మొదటి తరం దళిత నాయకులు బ్రిటీష్‌వారితో నిరంతరం సంవాదం చేస్తూ దళితులకు హక్కులు, అవకాశాలు సంపాదించారు. అదే వెలుగులో బి.ఆర్. అంబేద్కర్ కుల నిర్మూలన, జాతీయవాద భావనకు పూలే, బుద్ధ మరియు అనేక మంది కుల నిర్మూలన వాదుల తాత్విక పునాదుల మీద ఆధునిక భారతదేశాన్ని నిర్మించాలని కోరుకున్నారు. కాంగ్రెస్, గాంధీ లాంటివారు భారతదేశ మట్టికి మాత్రమే స్వాతంత్ర్యాన్ని కోరుకున్నప్పుడు, అంబేద్కర్ ఈ దేశంలో వున్న ప్రతి మనిషికి ఒకే విలువ అనే స్వాతంత్ర్యాన్ని కోరుకున్నారు. అంబేద్కర్ ప్రభావం భారతదేశం మొత్తం వున్నది. ఉత్తర భారతదేశంలో స్వామి అచ్చుతానంద నిర్మించిన ఆది హిందూ ఉద్యమ నిర్మాణ పునాదులపై అంబేద్కర్ తన కార్యక్రమాలను ఉత్తర భారత దేశంలో కొనసాగించారు. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా అంబేద్కర్ ప్రభావం చాలా లోతుగ వున్నది. తెలుగు రాష్ట్రాల్లో అంబేద్కర్ ప్రభావం, కార్యక్రమాలు ఉధృతంగా కొనసాగాయి. అనేక మంది నాయకులు అంబేద్కర్ అనుచరులుగా 1930–1940 ప్రాంతంలో పెద్దఎత్తున వున్నారు. అంబేద్కర్ ఆలోచనలు ఇటు ఆంధ్రలో, అటు నిజాం రాష్ట్రంలో ప్రచారం చేసారు.

**హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్రోద్యమ దళిత యోధులు 1900-1950**

నిజాం పాలనలో వున్న ప్రాంతం కొన్ని జిల్లాలు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో కలిసి ఉండేది. నిజాం రాష్ట్రంలో దళితులు భిన్నమైన సామాజిక, రాజకీయ పంథాలను అనుసరించారు. నిజాం ప్రభుత్వం నియంతృత్వంతో రజాకార్ల నిర్బంధంలో పరిపాలన కొనసాగుతున్న సమయంలో స్వాతంత్రోద్యమ వెలుగులు వివిధ రూపాలలో వినిపించాయి. ప్రధానంగా కాంగ్రెస్ స్థాపన, ఆర్యసమాజ్ నిర్మాణం, ఆంధ్ర మహాసభ, గ్రంథాలయోద్యమం, స్వతంత్ర దళిత ఉద్యమం మొదలైన రాజకీయ పంథాలు నిజాంపాలనకు వ్యతిరేకంగా ప్రజా గొంతుకగా నిలిచాయి. దళిత నాయకత్వం ముఖ్యంగా భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, శ్యామ్‌సుందర్, బి.ఎస్ వెంకటరావు మొదలైనవారు భిన్నమైన వైఖరులు తీసుకున్నారు. భాగ్యరెడ్డి వర్మ హిందూ సంస్కరణ వాదిగా వివిధ సంఘాలను స్థాపించి దళితులు, మరీ ముఖ్యంగా మాల సామాజిక వర్గ అభివృద్ధికి పనిచేసారు. అరిగె రామస్వామి కాంగ్రెస్ హైదరాబాద్ యూనిట్ సంస్థాపకుల్లో ఒక్కరిగా వుంటూ గాంధేయ మార్గాన్ని ఎంచుకొని పనిచేశారు. శ్యామ్ సుందర్ లాంటివారు దళిత–ముస్లిమ్ ఐక్యతను కోరుకున్నారు. బి.ఎస్. వెంకటరావు హైదరాబాద్ అంబేద్కర్‌గా పేరు సంపాదించి అంబేద్కర్ మార్గంలో నడిచారు. ఉత్తర భారతదేశంలో స్వామి అచ్చుతానంద ఆది–హిందూ ఉద్యమాన్ని నిర్మించాడు. స్వామి అచ్చుతానంద అనుచరుడుగా, దక్షిణ భారతదేశ ప్రతినిధిగా ఉంటూ సమావేశాలు ఉత్తరాదిలో హాజరవుతూ నిజాం రాష్ట్రంలో ఆదిహిందూ ఉద్యమాన్ని భాగ్యరెడ్డి వర్మ నిర్మించాడు. 1906 నుండి జగన్ మిత్ర మండలి, మాన్యసంఘం వంటి సంస్థలను నిర్మించాడు. ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంస్థ ఈ క్రింది లక్ష్యాల కోసం పనిచేసింది.

(1) ఆది హిందువుల మధ్య పరస్పర సహకారం, సానుభూతిని పెంపొందింప చేయటం. ఇతర వర్గాల ప్రజలు వీరిపై బలవంతంగా రుద్దే పనులను తిరస్కరించటం, ఆది హిందువులని తప్ప వేరే రకంగా పిలవటానికి ఒప్పుకోకపోవడం. మద్రాస్ ప్రభుత్వం ఆది–ఆంధ్ర, ఆది–ద్రావిడ అని గుర్తించినట్లుగా ఇతర భాషా ప్రాంతంలో కూడా దీన్ని అమలు చేసేలా ప్రచారం చేయటం.

(2) ఆది–హిందువుల్లో వున్న మూఢాచారాలను తొలగించటం, వారి సామాజిక, నైతిక, మత, ఆర్థిక సాహిత్య పురోగతి మార్గం వేయటం. పుట్టుకతో వచ్చే హక్కుల కోసం, అధికారం కోసం ఉన్నత వ్యక్తిత్వం కోసం అవసరమైన చర్యలు తీసుకోవటం.

(3) ఆది–హిందువుల మూలాల గురించి పరిశోధనలు చేపట్టటం. వారిలో విజ్ఞాన, జిజ్ఞాసలను పెంపొందించడం కోసం, ప్రాచీన భారతదేశ చారిత్రక సాహిత్య ధార పేరు మీద పుస్తకాలు, కరపత్రాలు ముద్రించటంతో పాటు స్వంతంగా దినపత్రికలను ప్రారంభించాలి.

(4) నిజాం ఏలుబడిలోవున్న ఆది–హిందువుల కోసం ప్రత్యేకంగా సొసైటీలు, పాఠశాలలు, లైబ్రరీలు, భజన మండళ్ళు, మగ పిల్లలకు స్కౌట్ అసోసియేషన్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే వున్న సంస్థలకు సహాయం చేయాలి.

(5) అన్ని వర్గాల ప్రజల సహకారం, మద్దతుతో సరైన గుర్తింపు కోసం కృషి చేయాలి.

భాగ్యరెడ్డి వర్మ అనేక పాఠశాలలు కూడా నిర్వహించడం జరిగింది. ఇందులో దళితులు ముఖ్యంగా మాలలు చదువుకున్నారు. పాఠశాలల నిర్వహణకు జాతీయవాదులు, అగ్రవర్ణ సంస్కరణ వాదుల సహకారం పొందాడు. అరిగె రామస్వామి భాగ్యరెడ్డి వర్మకు ధీటుగా దళితులను నిర్మాణం చేసిన మరో దళిత నాయకుడు. రామస్వామి మొదటి నుండి "అచల బోధనకు" ప్రభావం అయిన వ్యక్తి. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని దళితులు ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చ లేవనెత్తేవారు. ఆంధ్ర మహాసభలో విభజన జరిగినప్పుడు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపిన వర్గం వైపు తన మద్దతు ప్రకటించారు. నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా జాతీయ భావాలను కాంగ్రెస్ వేదిక ద్వారా వెలిబుచ్చారు. మిగతా దళిత నాయకుల వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగట్టేవాడు. భాగ్యరెడ్డి వర్మ తన ఆలోచన, కార్యక్రమాల్లో మాల వర్గం వైపు పక్షపాతం వహిస్తూ మాదిగలను అసమానంగా చూస్తున్నప్పుడు బహిరంగంగానే భాగ్యరెడ్డి వైఖరిని ఎండగట్టాడు. మాదిగల కోసం సంఘాలను స్థాపించాడు. కాంగ్రెస్‌లో చురుకుగా పాల్గొనడం ద్వారా ముదిగొండ లక్ష్మయ్యకు మార్గదర్శిగా వుంటూ బాబు జగ్జీవన్‌రామ్‌తో సత్సంబంధాలు నడిపారు. అరిగె రామస్వామి వైఖరి అంబేద్కర్ ప్రతిపాదించిన ప్రత్యేక నియోజక వర్గాలు, మత మార్పిడి విషయాలపై వ్యతిరేక వాదనను వినిపించాడు. హైదరాబాద్ రాష్ట్రంలో అంబేద్కర్ వాదనకు ప్రతినిధిగా వున్న వ్యక్తి బి.ఎస్. వెంకటరావు. ఇతను నిజాం ప్రభుత్వంలో విద్యామంత్రిగా పనిచేసినప్పటికీ అంబేద్కర్ మార్గంలో నడిచారు. నిజాం దళితుల అభివృద్ధికి ఒక కోటి రూపాయలను కేటాయించడంలో, వాటిని ఉపయోగించడంలో బి.ఎస్. వెంకటరావు పాత్ర ముఖ్యమైనది. 1930–32 వరకు అంబేద్కర్ రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరు కావడానికి, తాను ప్రతిపాదించిన ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్‌కు మద్దతుగా అనేక కార్యక్రమాలు హైదరాబాద్ రాష్ట్రం మొత్తం నిర్వహించాడు. అంబేద్కర్ మత మార్పిడి ప్రకటన చేసినప్పుడు దళితులను ఏకం చేసి ఆర్యసమాజ్, కాంగ్రెస్, హిందూ మహాసభ నుండి వస్తున్న విమర్శలను గట్టిగా వ్యతిరేకించాడు.

హైదరాబాద్ రాష్ట్రంలో 1906 నుండే దళితుల స్వతంత్రమైన రాజకీయ చైతన్యాన్ని కలిగి వున్నారు. వివిధ సంఘాల నిర్మాణం వాటి లక్ష్యాలు, అవి చేసిన కార్యక్రమాలు దళిత చైతన్య ప్రవాహాన్ని తెలియజేస్తాయి. ఈ సంఘాలు కుల వివక్ష, అంటరానితనం, బ్రాహ్మణాధిపత్యం, ఆర్థిక, రాజకీయ అసమానతలను ఎండగట్టి కాంగ్రెస్, గాంధీ స్వరాజ్య భావన డొల్లతనాన్ని ప్రశ్నించాయి. భాగ్యరెడ్డి వర్మ ఆది–హిందూ అస్తిత్వంతో అనేక సంఘాలు, ప్రచురణ సంస్థ, ఆది–హిందూ భవన్, పాఠశాలలు, చివరకు ఆది–హిందూ జాతీయ జెండా ఆవిష్కరణ కూడా చేయడం జరిగింది. అంటే తెలుగు మరియు కాంగ్రెస్ జాతీయవాద దృక్పథానికి భిన్నంగా దళిత జాతీయవాద దృక్పథాన్ని నిర్మాణం చేశారు. అయితే భాగ్యరెడ్డి వర్మ చివరి వరకు ఒక హిందూ సంస్కరణవాదిగా ఉన్నారు. ఉత్తర భారతదేశంలో చమార్లు కేంద్రంగా స్వామి అచ్చుతానంద ఉద్యమం దేశంలో వున్న అనేకమంది దళిత నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ బి.ఆర్. అంబేద్కర్, రెట్టమల్ల శ్రీనివాస్‌ను రౌండ్ టేబుల్ సమావేశాలకు పంపారు. స్వామి అచ్చుతానంద ఆధ్వర్యంలో దేశం మొత్తం నుండి అంబేద్కర్‌కు మద్దతుగా అంబేద్కర్ మాత్రమే తమ ప్రతినిధిగా లండన్‌కు లేఖలు పంపడం జరిగింది. దీనితో అంబేద్కర్ ఒక జాతీయ నాయకుడుగా గుర్తించబడ్డాడు. తెలంగాణలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో కూడా దళితులు నిర్మాణం చేయబడ్డారు. ఆంధ్రమహాసభలో రెండు తరహా సభ్యులు ఉండేవారు. కమ్యూనిస్టులు నిర్మాణం చేసిన తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా దళితులు విస్తృతంగా పాల్గొన్నారు. సాయుధ దళాలకు అండగా ఉండి, తమ విముక్తిని కమ్యూనిస్టు ఉద్యమంలో చూసుకున్నారు. నల్గొండ నుండి ఉప్పల మల్సూరు లాంటి వ్యక్తులు మనకు ఆదర్శంగా కనబడతారు. తాను ఎం.ఎల్.ఎ. గా కొన్ని దఫాలు పనిచేసిన ఏమీ సంపాదించుకోకుండా సర్వం ప్రజల కోసం త్యాగం చేసారు. అయితే అతని పేరుతో పాటు చాలామంది దళితుల పేర్లు చరిత్రకు ఎక్కించబడలేదు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని దళితుల కోణంలో పరిశోధన చేయాల్సి వుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పిమ్మట నిజాం ప్రభువు భారతదేశంలో కలవడానికి సుముఖత చూపలేదు. ఇలాంటి సందర్భంలో అంబేద్కర్ తన అనుయాయులకు నిజాం వైఖరిని వ్యతిరేకించి భారత దేశంలో విలీనం కావడానికి సహకరించాలని ఆదేశించాడు. వెంటనే బి.ఎస్. వెంకట్రావు లాంటివారు తగిన చర్యలు తీసుకొని భారత ప్రభుత్వంతో సహకరించారు.

## మద్రాసు ఆంధ్రలో దళిత స్వాతంత్ర పోరాట యోధులు 1900-1947

మద్రాసు ఆంధ్రలో జాతీయోద్యమం జరుగుతున్న కాలంలో దళితులు వివిధ భావజాలాల ప్రభావానికి గురైనారు. బ్రిటీష్ ప్రభుత్వ విధానాలు, మద్రాసు రాష్ట్రంలో జరిగిన బ్రాహ్మణేతర ఉద్యమం, జస్టిస్ పార్టీ రాజకీయాలు మరీ ముఖ్యంగా క్రైస్తవ సంఘాల ప్రభావం ఎక్కువగా వున్నది. క్రైస్తవ సంఘాలు దళితులను దగ్గరకు తీసి వారికి విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మిక సమానత్వ రంగాలలో విస్తృతంగా పనిచేసాయి. దీన్ని తట్టుకోలేని కొంత మంది అగ్రవర్ణ జాతీయవాద సంస్కర్తలు దళితుల కోసం పనిచేయడం మొదలు పెట్టారు. ఉదాహరణకు గూడూరు రామచంద్రరావు, వేమూరి రామోజీరావు, నల్లపాటి హనుమంతరావు మొ॥వారు చేసిన కొన్ని సంస్కరణ కార్యక్రమాల ద్వారా దళితులలో కొందరు విద్యను అందుకొని రాజకీయంగా

సమీకరించబడ్డారు. అలా ముందుకు వచ్చిన వారిలో నరాలసెట్టి దేవేంద్రుడు, సుండ్రు వెంకయ్య, రాయుడు గంగయ్య, కుసుమ వెంకట్రామయ్య, ఉండ్రు సుబ్బారావు, వేముల కుర్మయ్య, జాలా రంగస్వామి, కుసుమ ధర్మన్న మొదలైనవారు.

1920 నాటి నుండి గాంధీ జాతీయ స్థాయిలో జాతీయోద్యమాన్ని విస్తృతం చేశారు. దీనితో జనసమీకరణ, దళితులకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించారు. గాంధీకి అంబేద్కర్ నుండి ఎదురౌతున్న సవాళ్ళకు బదులుగా గాంధీ హరిజనోద్ధరణ, అంటరానితనం నివారణ, దేవాలయాల ప్రవేశంపై దృష్టిపెట్టారు. క్షేత్రస్థాయిలో కూడా గాంధేయ వాదులు దళితుల సమస్యలపై సాహిత్యం రచించారు. ఉన్నవ లక్ష్మినారాయణ, ఎన్.జి.రంగ లాంటి వారు మాలపిల్ల, హరిజన నాయకుడు నవలలను రచించి ప్రచారం చేశారు. దళిత చైతన్యానికి ఆది-ఆంధ్ర మహాజన సభలు ప్రముఖ పాత్ర పోషించాయి. ఇవి వివిధ జాతీయవాద సంస్కర్తల సహకారంతో నిర్వహించినప్పటికీ దళితులకు సంబంధించిన అనేక సమస్యలపై చర్చ జరిగింది. ఈ క్రింది విధంగా సభలు జరిగాయి.

**ప్రావెన్షియల్ ఆది-ఆంధ్ర మహాజన సభల పట్టిక**

| క్ర.సం. | సం॥ | జరిగిన స్థలం | ఛైర్మన్ |
|---|---|---|---|
| 1 | 1917 | విజయవాడ | భాగ్యరెడ్డి వర్మ |
| 2. | 1921 | గుడివాడ | భాగ్యరెడ్డి వర్మ |
| 3. | 1922 | ఏలూరు | భాగ్యరెడ్డి వర్మ |
| 4. | 1924 | గుంటూరు | కుసుమ వెంకటరామయ్య |
| 5. | 1925 | అనంతపూర్ | భాగ్యరెడ్డి వర్మ |
| 6. | 1926 | వెంకటగిరి | నరాలశెట్టి దేవేంద్రుడు |
| 7. | 1928 | నర్సాపూర్ (ప.గో) | భాగ్యరెడ్డి వర్మ |
| 8. | 1929 | విజయవాడ | ఆదినారాయణ |
| 9. | 1930 | అనంతపూర్ | నరాలశెట్టి దేవేంద్రుడు |
| 10. | 1935 | రాజమండ్రి | కుసుమవెంకటరామయ్య |
| 11. | 1936 | విజయనగరం | వేముల కుర్మయ్య |
| 12. | 1938 | తాలనెవు(తూ.గో) | భాగ్యరెడ్డి వర్మ |

పై సమావేశాలు ఆది-ఆంధ్ర అస్తిత్వంపై బలమైన వాదనను వినిపించాయి. పంచమ పేరును గట్టిగా వ్యతిరేకించారు. ఈ ఆది-ఆంధ్ర అస్తిత్వం ద్వారా దళితులంతా ఈ దేశ మూలవాసులు, ఒకనాటి పరిపాలకులు అనే గౌరవ సూచనగా తమకు తాము ఆత్మగౌరవ ప్రకటన ఈ సమావేశాల ద్వారా చేసుకున్నారు. ఇదే తరహాలో దేశంలో వివిధ అస్తిత్వాలు వెలుగులోకి వచ్చాయి. ఆది-హిందూ అస్తిత్వం, ఆది-ద్రావిడ, ఆది-కర్ణాటక మొదలైనవి. అయితే గాంధీజి, కాంగ్రెస్ బలమైన ప్రభావంతో చాలా మంది దళిత నాయకులు 1940 దశకంలో కాంగ్రెస్ వైపు ఆంధ్ర ప్రాంతంలో మొగ్గు చూపారు. వేముల కుర్మయ్య లాంటివారు కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేసి మంత్రి పదవిని కూడా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుడిగా పేరున్న సర్దార్ నాగప్ప కూడా కాంగ్రెస్‌లో చేరి మద్రాస్ రాష్ట్ర శాసన సభకు 1937లో, 1946లో ఎంపికయ్యారు. నాగప్పగారు తన భార్య అమరావతి దేవితో సహా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు జీవితం కూడా గడిపారు. మరో జంట జాలా రంగస్వామి, జాలా మంగమ్మ కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొని ఖాదీ ప్రచారోద్యమంలో, అంటరానితనం నిర్మూలన ఉద్యమంలో పనిచేశారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నందుకు తమ ఉపాధ్యాయ వృత్తిని కూడా పోగొట్టుకోవాల్సి వచ్చింది. వీరు వివిధ సాహిత్య రచనలు కూడా చేశారు. కమ్యూనిస్టు, సోషలిస్టు ఉద్యమాలు, సంఘాల ద్వారా కూడా దళితులు ఉధృతంగా పాల్గొన్నారు.

కుసుమ ధర్మన స్వాతంత్రోద్యమ కాలంలో తన చరచనల ద్వారా వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా దళితుల్లో చైతన్యాన్ని రగిలించాడు. గాంధేయవాది గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన "మాకొద్ది తెల్ల దొరతనం" గేయానికి ప్రతిగా కుసుమ ధర్మన్న "మాకొద్దీ నల్లదొరతనం" అనే గేయాన్ని 1921లో రాసి దళితుల ప్రత్యామ్నాయ కులనిర్మూలన జాతీయ వాదాన్ని గొప్పగా వినిపించారు. ఇందులో ధర్మన్న ఇలా అంటారు.

పన్నెండు మాసాలు పాలేరు తనమున్న
పస్తూలు బడుచు బతుకాలండి
ఆలికూలిజేసి తీరాలండి
పిల్లగాడూ పశువుల గాయాలండి
పగలు రేయీ పాటుపడ్డానండి
కట్టగుడ్డా - కూడు గిట్టదండి
రోగమొస్తే నాగ దప్పదండి
అప్పు తీరదీ చిత్రమే మండి
కనికారము లేక కడుపు మాడ్చేరండి
మాకొద్ది నల్లదొరతనము - బాబు
మా కొద్ది నల్ల దొరతనము - దేవా
--------------------
స్వారాజ్యమనుచు సర్కారుతో పోరాడి
స్వాతంత్ర్యము అడుగుతారు
మమ్ము స్వాతంత్ర్యము తాకనీరు
కూడి - నూతిలో తోడుకో నీరు
గుళ్ళు గోప్రాలకు వెళ్ళనీరు
మాలలంటే తేను మయిలౌనంటారు
హక్కు మాలలడుగరాదంటారు

మాకు హక్కు లేదంటే – స్వారాజ్య మెక్కడ దక్కు?
మాకొద్ది నల్ల దొరతనము
(మాకొద్ది నల్లదొరతనము, పేజి–23)

కుసుమ ధర్మన్న కాంగ్రెస్, గాంధీ, అగ్రవర్ణ జాతీయ వాదులు దళితులపట్ల చూపిన ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. బ్రిటీష్ (తెల్లదొరల) నుండి స్వాతంత్రాన్ని డిమాండ్ చేసే అగ్రవర్ణ జాతీయవాదులు దళితులపట్ల అమానుషంగా ప్రవర్తించడం, కుల భేదాలు పాటించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ప్రకటిస్తాడు. కుసుమ ధర్మన్న వివిధ ప్రాంతాలలో వున్న దళిత నాయకులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. మద్రాస్ రాష్ట్రంలో ఎం.సి. రాజా, రెట్టమాల శ్రీనివాస్, నిజాం ప్రాంతం నుండి భాగ్యరెడ్డి వర్మ. ఈ సంబంధాలు విశాల దళిత ఉద్యమాల నిర్మాణానికి తోడ్పడ్డాయి.

1929లో గాంధీ ఆంధ్ర పర్యటన చేసినప్పుడు కృష్ణజిల్లాకు చెందిన ఈద వెంకయ్య అనే కార్యకర్త ఆది–ఆంధ్రుల తరపున ఒక వినతి పత్రాన్ని గాంధీకి సమర్పించాడు. ఈ పత్రంలో క్షేత్రస్థాయిలో అగ్రకులాలు పాటించే కుల అసమానతలు, జాతీయవాద నాయకులు పట్టించుకొని కొన్ని అంశాలను చర్చించారు. అవి ఇలా ఉన్నాయి.

"మహాత్మ మా పరిస్థితుల గురించి ప్రపంచములో మీరు ఎలుగెత్తి చాటుతున్నప్పటికీ ఎక్కడా ఏ మార్పు లేదు. సవర్ణ హిందువులు అంటరానితనమనే భూతాన్ని వదిలి వేయటం లేదు. ప్రతి దేశంలో కూడా సామాజిక, ఆర్థిక వ్యత్యాసాల రీత్యా ఎక్కువ తక్కువా అనే తేడాలు వున్నాయని మేము వింటూనే వున్నాం. కానీ ఇప్పుడు ఈ ప్రపంచంలో మతం పునాదిగానే ఏ రకమైన అన్యాయమైనా, వ్యాప్తిచెందుతోంది. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలతో దుర్భరమైన పరిస్థితులను అధిగమించవచ్చని మాకు బోధించారు. కానీ మాకు ఒకపూట తిండి, కట్టుకోడానికి బట్టలు కూడా దొరకలేదు. పశువులకంటే హీనంగా మా బతుకులు వున్నాయి. అత్మగౌరవం, స్వాతంత్ర్యం అనే అంశాల్ని మేమెలా అలవర్చుకోగలం? సామాన్య ప్రజల్ని ప్రక్కన పెట్టండి. మీ అనుచరులుగా చెప్పుకుంటూ – జాతీయవాద నాయకులుగా చెలామణి అయ్యేవారు కూడా తమ దైనందిన జీవితంలో అంటరానితనాన్ని వదలకుండా పాటిస్తూనే వున్నారు. ఇదే సాధ్యం కానప్పుడు దేశానికి స్వాతంత్ర్యాన్ని ఆశించడమంటే ఆకాశం నుంచి పూలు రాలుతాయనుకోవడమే అవుతుంది. సవర్ణ హిందువుల భవంతుల ప్రక్కనే కూలిపోయిన గుడిశెల్లో, చిరిగిన బట్టలతో మేము బతుకుతున్నాం. సుఖంగా తినడానికి వారికి అన్నీ వుంటాయి. కానీ మా కాలేకడుపులకి ఉప్పేసుకుని గంజితాగే పరిస్థితి కూడా లేదు. సమాజంలో సామాజిక, మత, నైతిక, ఆర్థిక సూత్రాల పేరుమీద ఇంత సహజమైన పరిస్థితులను అంగీకరించే చోట, తన రోజువారీ శ్రమతో మాత్రమే కడుపు నింపుకోగల అంటరానివాడికి ఏ హోదా వుంటుంది. బావుల నుంచి నీళ్ళు తోడుకోవటానికి మాకు అనుమతి వుండదు. ఇతర సవర్ణ హిందువుల్లాగా దేవుడి ముందు మా ఈ బాధల్ని చెప్పుకోవడానికి కూడా మమ్మల్ని గుడిలోకి రానివ్వరు. ఇంకా మేము చేయగలిగింది. పరమేశ్వరా మమ్మల్ని కాపాడు "అని మొరపెట్టుకోవడమే."

ఈ వినతిపత్రం పెద్ద ఎత్తున చర్చను ప్రారంభించింది. గాంధేయ వాదులు గ్రామాల్లో చేస్తున్న అఘాయిత్యాలు, కుల అసమానతలు బహిరంగంగ చర్చకు పెట్టింది. దీనికి జవాబు గాంధీ బృందం ప్రతిస్పందించవల్సిన అవసరం ఏర్పడ్డది. దేశ స్థాయిలో 1920 నుండి చివరికి 1930–40 వచ్చే నాటికి మెజార్టీ దళిత నాయకులు కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆంధ్ర ప్రాంతానికి అంబేద్కర్ పర్యటన బలమైన ప్రభావం చూపింది. 1944లో అంబేద్కర్ వైశ్రాయ్ కౌన్సిల్‌లో సభ్యునిగా వున్నప్పుడు, రాజమండ్రి, ఏలూరు, విశాఖపట్నం, అనకాపల్లి మొదలైన ప్రాంతాలు సందర్శించి అనేక మంది దళిత నాయకులను కలిశారు. అంబేద్కర్‌ను ఆంధ్రకు ఆహ్వానించిన ముఖ్య వ్యక్తులలో నందనార్ హరి ముఖ్యులు. వీరితో పాటు వివిధ సదస్సుల్లో, కుసుమ ధర్మన్న, కుసుమ వెంకట రామయ్య, పాము రామూర్తి లాంటివారు అంబేద్కర్‌తో ప్రయాణం చేశారు. వివిధ సదస్సుల్లో అంబేద్కర్ గాంధీ, కాంగ్రెస్ దళితుల పట్ల చూపిస్తున్న వివక్షను ఎండగట్టారు. దళితులకు "బ్రిటీష్ వారు మన దేశం విడిచి ఎప్పుడు వెళతారు" అనే ప్రశ్న దళితులకు తక్షణ లక్ష్యం కాదని, దళితులకు కావాల్సిన సమాన ప్రాతినిధ్యం, అత్మగౌరవం, కుల వివక్ష నుండి విముక్తి అనే అంశాలు తక్షణ ఎజెండాగా ఉండాలని, కాంగ్రెస్ జాతీయోద్యమ మాయలో పడొద్దని హితబోధ చేశారు. ఈ స్పూర్తిని వివిధ రూపాల్లో స్వాతంత్ర్యం అనంతరం కొనసాగించారు.

### బ్రిటీష్, బ్రాహ్మణ భావజాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన దళిత కుల నిర్మూలన జాతీయవాదం

సమకాలీన భారతదేశ రాజకీయాలలో ప్రధానంగా బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున జాతీయవాదంపై చర్చ జరుగుతున్నది. హిందూ, హిందీ, హిందూత్వ అనే భావన ద్వారా బ్రాహ్మణ ఆధిపత్య మనువాద జాతీయవాదాన్ని వినిపిస్తున్నారు. హిందూత్వ భావజాలం ద్వారా సనాతన బ్రాహ్మణాధిపత్యం కోరుకునే మనుస్మృతి, రామాయణం, వేదాలు, మహాభారతం, భారతీయ జాతీయ వాదానికి పునాదులుగా ప్రచారం చేస్తున్నారు. ఈ భావజాలం ద్వారా ప్రస్తుత రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేయడం, రాజ్యాంగం మార్చాలనే కుట్రలు మనం నిత్యం చూస్తున్నాము. ఎవరైతే స్వాతంత్రోద్యమంలో పాల్గొనడానికి విముఖత చూపించిన వారే ఇప్పుడు హిందూత్వ జాతీయవాదాన్ని ఎత్తుకున్నారు. వారికి అనుగుణంగా చరిత్రను మార్చడం, రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ఈ తప్పుడు వాదనలు ఎండగట్టడానికి దళిత స్వాతంత్రోద్యమ

నాయకుల దృక్పథాలపై వారి త్యాగాలు, జీవితాలపై విస్తృతంగా పరిశోధన జరగాలి. పూలే, సావిత్రి బాయిపూలే, పెరియార్, అంబేద్కర్, స్వామి అచ్చుతానంద, మంగురామ్, అయోతదాస్ ప్రతిపాదించిన కుల నిర్మూలన జాతీయ వాదాన్ని పరిశోధకులు, పౌరసమాజం ప్రజా ప్రతినిధులు ప్రచారం చేయాలి. అప్పుడు మాత్రమే జాతీయ వాదానికి మనుషులు, మానవీయ విలువలు, ప్రజాస్వామిక ఆలోచనలు కేంద్ర బిందువులవుతాయి. అప్పుడు మాత్రమే మతతత్వ మెజార్టీవాద జాతీయవాదాన్ని ఎదుర్కోగలము.

**ముగింపు**

భారత స్వాతంత్రోద్యమంలో దళితులు కీలకపాత్ర పోషించారు. ఆనాడు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న దళిత నాయకత్వం పీడన, అసమానతలు, కుల అణచివేత నుండి విముక్తి కావాలని కోరుకున్నారు. స్వాతంత్రోద్యమ కాలంలోనే భారతదేశం మొత్తం దళితులు ఒక ప్రత్యామ్నాయ జాతీయ భావాలను కుల నిర్మూలన దృక్పథంతో ప్రచారం చేశారు. అంబేద్కర్ ఈ భావాలకు కేంద్ర బిందువు అయ్యారు. స్వామి అచ్చుతానంద, పండిత అయోతదాస్, వాల్‌గాంకర్, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, హరిచంద్ ఠాకూర్, గురుచంద్ ఠాకూర్ మొదలైన వారు ఇటు బ్రిటీష్‌వారితో దళితుల అభ్యున్నతి కొరకు కావాల్సిన అవకాశాలను సాధిస్తూనే బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించారు. బెంగాల్ ప్రావిన్స్, మద్రాసు ప్రావిన్స్, బాంబే ప్రావిన్స్‌ల్లో దళితులు కాంగ్రెస్, గాంధీ, హిందు మహాసభ జాతీయ వాదానికి భిన్నంగా కులనిర్మూలన జాతీయవాదాన్ని ప్రచారం చేశారు. అనేక సంస్థలు, నాయకులు "మాకొద్దీ నల్లదొరతనమంటూ'' అంతర్గత బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించారు. ఈ స్ఫూర్తి స్వాతంత్రోద్యమం అనంతరం ముఖ్యంగా భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ విలువల ఆధారంగా హిందూత్వ జాతీయవాదాన్ని ఎదుర్కోవడం జరుగుతుంది. అయితే కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పే సెక్యులర్ జాతీయవాదం కంటే బహుజన కులాలు నిర్మాణం చేస్తున్న కుల నిర్మూలనా, జాతీయవాదమే అన్ని విధాల భారతదేశ సమగ్రతను కాపాడగలదు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే శక్తి, జంబుద్వీప నాగరికతకు ప్రతినిధిగా నిలిచే దృక్పథం దళిత జాతీయవాదం మరియు కులనిర్మూలన జాతీయవాదంలోనే ఉన్నాయి. అవి నేటి అవసరం.

(నోట్ : ఈ వ్యాసం ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. న్యూఢిల్లీ రిసెర్చి ప్రాజెక్టులో భాగంగా రాసింది. ఆర్థిక సహకారం అందించిన ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. కు ధన్యవాదాలు.)

**ఆధార గ్రంథాలు**

1. ఇనుకొండ తిరుమలి (2008) "తిరగబడ్డ తెలంగాణ" హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
2. ఎస్.వరుణ్ కుమార్ (సంకలనం, 2017) "మూల భారతీయుల ఉద్యమ ప్రస్థానం", సమాంతర ప్రచురణలు.
3. ఎండ్లూరి సుధాకర్ (2007) "జాషువా సాహితం:దృక్పథం–పరిణామం" మానస మనోజ్ఞ ప్రచురణలు, రాజమండ్రి.
4.. ఎండ్లూరి (2009) "తెలుగునాట దళిత ఉద్యమం" సమాంతర ప్రచురణలు, హైదరాబాద్.
5. ఎం.బి.గౌతమ్ (2009) "భాగ్యోదయం" సమాంతర ప్రచురణలు, హైదరాబాద్.
6. గుత్తికొండ సుబ్బరావు, డా॥జి.వి.పూర్ణచందు (సంకలనం, 2016) "స్వాతంత్ర సంగ్రామం: కథలు–గాథలు" విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ.
7. జంగం చిన్నయ్య (2021) "ఆధునిక భారతదేశ నిర్మాణంలో దళితులు" హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
8. పి.ఆర్.వెంకటస్వామి (2003) "మా విముక్తి పోరాటం" డా॥ అంబేద్కర్ పబ్లికేషన్స్ సొసైటీ, హైదరాబాద్.
9. బ్రజ్‌రంజన్ మణి (2018) ''మడివిప్పిన చరిత్ర'' హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
10. బి.విజయ భారతి (2017) "బోయి భీమన్న" సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ.
11. యాగంటి చిన్నారావు (2008) "ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర" హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
12. వకుళాభరణం రామకృష్ణ (2003) "ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు" హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
13. సంగిశెట్టి శ్రీనివాస్ (2024) "తెలంగాణ దళితోద్యమ చరిత్ర" తెలంగాణ ప్రచురణలు, హైదరాబాద్
14. సంగిశెట్టి శ్రీనివాస్ (2024) "దళితోద్యమ వేగుచుక్క భాగ్యరెడ్డి వర్మ" తెలంగాణ రిసెర్చ్ & రెఫరాల్ సెంటర్, హైదరాబాద్.
15. సామిడి జగన్ రెడ్డి (సంకలనం, 2017) "ఆది ఆంధ్ర ఉద్యమం: భాగ్యరెడ్డి పాత్ర'' సమాంతర పబ్లికేషన్స్, హైదరాబాద్.
16. స్వామి ధర్మాతీర్థ (2000) "హిందూ సామ్రాజ్యవాద చరిత్ర", హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్
17. సి.వి. (2015) "దళిత ఉద్యమ వైతాళికుడు", కుసుమ ధర్మన్న కవీంద్రుడు" ప్రజాశక్తి బుక్‌హౌజ్.
18. శ్యాంప్రసాద్ (సంకలనం, 2015) ''తెలుగునాట సమరసతా స్వరాలు'' సామాజిక సమరసతా వేదిక, ఆంధ్రప్రదేశ్.

(1) B.R.Ambedkar (1989) "What congress and Gandhi have done to the untouchables", Government of Maharastra, Bombay, Volume No.9.

(2) N.Chandra Bhanu Murthy (2016) "Identity, autonomy and emancipation: The agendas of the Adi-Andhra movement & South India, 1917-30, The India Economic and social History review, 52, 2(2016) 225-248

★ రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, అలహాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

# చారిత్రాత్మక పోరాటానికి దక్కిన ఫలితం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు

డా.సుమన్ దామెర, సిలపాక వెంకటాద్రి, ఈర్ల కమలాకర్

**1 ఆగస్టు,** 2024న, సుప్రీంకోర్టు, ఎస్సీ కులాల రిజర్వేషన్లలో వర్గీకరణకు సంబంధించి, దీర్ఘకాలంగా కొనసాగుతున్న డిమాండ్‌పై ఒక చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ తీర్పు భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను గణనీయంగా పునర్వ్యవస్థీకరించనుంది. స్వాతంత్ర్యం తర్వాత, రిజర్వేషన్ల ప్రయోజనాలు ఎస్సీలలోని కేవలం కొన్ని కులాలకు మాత్రమే ఎక్కువగా లభించాయి. ఫలితంగా అలా లబ్ధిపొందినవాళ్ళు వివిధ రాష్ట్రాలలో ఆర్థిక, రాజకీయరంగాలలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. అందువల్ల, ఈ తీర్పు సామాజిక న్యాయసూత్రాన్ని కాపాడడంతో పాటు రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వ భావనను కూడా బలపరుస్తుంది. కాబట్టి, ఈ తీర్పు కేవలం చట్టపరమైన విజయమేకాకుండా సమాజంలో గుర్తింపు, వివిధరంగాల్లో సమాన అవకాశాలకోసం పోరాడుతున్న అట్టడుగుకులాల జీవితాలలో నూతన ఆశలను రేకెతిస్తుంది.

ఈ వర్గీకరణ తీర్పు ప్రభావం, గణనీయంగా ఉండబోతుంది. ఇది అత్యంత వెనకబడినకులాలను తమ హక్కులకోసం నిలబడేలా చేస్తుంది. వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ ప్రాతినిధ్యంలో సమాన అవకాశాలకోసం చట్టపరమైన మద్దతును అందిస్తుంది. ఈ తీర్పు తమ హక్కులను బలంగా వ్యక్తపరచి, వాటిని సాధించుకోవడంకోసం మరింత ప్రభావవంతంగా పోరాడేలా అత్యంత వెనకబడిన కులాలకు ఒక గొప్ప ప్రేరణనిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. నిజానికి రాజకీయంగా, ఈ తీర్పు కొన్ని ముఖ్యమైన మార్పులకు దారితీస్తుంది. ఇది సమాన ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేస్తుంది. ఎస్సీలోని అన్నికులాలు తమకు రావలసిన ప్రయోజనాలను, హక్కులను పొందేందుకు పోరాడేలా ప్రోత్సహిస్తుంది. ఇది అత్యంత వెనుకబడినకులాల గళాలు వినిపించే, వాళ్ళ డిమాండ్లను పరిగణనలోకి తీసుకునే ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తుంది.

భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ, చారిత్రక అన్యాయాలను నిర్మూలించడానికి, వెనుకబడినకులాలు సమానత్వాన్ని సాధించడానికి సృష్టించబడింది. ఇది విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయశక్తికి మెరుగైన అవకాశాలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. రాజకీయ శాస్త్రవేత్త సుధాపాయి (2011:357) అభిప్రాయం ప్రకారం, "షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ)కోసం 'అఫర్మేటివ్ యాక్షన్' మూడు రకాల ప్రాధాన్యపూర్వక అంశాలను లక్ష్యంగా పెట్టుకుంది. మొదటిది, కులవ్యవస్థ, సాంస్కృతిక వేర్పాటు కారణంగా ఎదుర్కొంటున్న సామాజిక, మత సంబంధిత అణచివేతలను నిర్మూలించడం. రెండవది, విద్యారంగం, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీల్లో (73వ రాజ్యాంగ సవరణ తర్వాత) వెనకబడినకులాలకు రిజర్వేషన్ల రూపంలో సీట్లను, పదవులను కేటాయించడం. అలాగే వారి అవకాశాలను మెరుగుపరిచే ఇతర సంక్షేమాలకి చర్యలను తీసుకోవడం. మూడవది, చట్టంద్వారా అన్యాయాలు, దోపిడీలనుండి రక్షణను కల్పించడం. ఈ విధంగా 'అఫర్మేటివ్ యాక్షన్' అనేది ఎస్సీలపై జరుగుతున్న చారిత్రక అన్యాయాలను సరిదిద్దేందుకు బహుముఖ దృక్పథాన్ని కలిగి ఉంది" అని ఈ గమనిక సూచిస్తుంది

ఆర్టికల్ 15(4) సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడినకులాలు, ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు(ఎస్టీ)వంటి కులాల అభివృద్ధికోసం రాష్ట్రానికి ప్రత్యేక అవకాశాలు కల్పించే అధికారం ఇస్తుంది. ఆర్టికల్ 16(4) తక్కువగా ప్రాతినిధ్యం ఉన్న కులాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ అందించడంద్వారా, ప్రజాసేవల్లో వారి భాగస్వామ్యాన్ని నిర్ధారిస్తుంది. ఆర్టికల్ 330, 332 ఎస్సీ, ఎస్టీలకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో రిజర్వు స్థానాలను కల్పిస్తుంది. ఆర్టికల్ 243D ప్రతి పంచాయతీలో రిజర్వు స్థానాలద్వారా స్థానికపరిపాలనలో కూడా ఈ ప్రాతినిధ్యాన్ని విస్తరిస్తుంది. అదనంగా, ఆర్టికల్ 335 పబ్లిక్ సర్వీస్ పాత్రలకోసం ఎస్సీ, ఎస్టీలను పరిగణనలోకి తీసుకోవడంద్వారా పరిపాలనా సామర్థ్యాన్ని కాపాడాలనే అంశాన్ని పేర్కొంది. పైవిధంగా పేర్కొన్న రాజ్యాంగ హక్కులద్వారా చారిత్రక

అన్యాయాలను సరిదిద్దడం, న్యాయాన్ని ప్రోత్సహించడం అనేది రిజర్వేషన్ వ్యవస్థ లక్ష్యాలకు మద్దతునిస్తూ, రాజ్యాంగ సూత్రాలైన న్యాయం, సమానత్వంపట్ల నిబద్ధతలను ప్రతిబింబిస్తాయి. అయితే, అనేక సంవత్సరాలుగా ఈ ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలవల్ల ఒకటి, రెండు కులాలకు మాత్రమే అధికమొత్తంలో ప్రయోజనం చేకూరింది. ఎస్సీ కులాల్లోని అత్యధికకులాలు ఇంకా కడు పేదరికాన్ని, తీవ్రమైన వివక్షతను నిత్యం ఎదుర్కొంటున్నాయి.

ఈ రిజర్వేషన్ విధానంవల్ల షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న అన్ని కులాలకు సమానమైన అవకాశాలు, ప్రయోజనాలు చేకూరలేదు. దీని ఫలితంగా ఈ కులాల మధ్య విద్య, ఉద్యోగ, ఆర్థికపరమైన అసమానతలు చోటుచేసుకున్నాయి. ఈ అసమానతలు కాలక్రమేణ కులాలమధ్య పోటీ, ఘర్షణలకు దారితీస్తున్నాయి. ఇటువంటి ఆధిపత్యం, అసమానతల కారణంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని మాదిగలు, తమిళనాడులో అరుంధతియార్, చక్కిలియన్, పంజాబ్‌లో వాల్మీకి, మజ్హబివంటి కులాలు రిజర్వేషన్ విధానంద్వారా తాము ఎటువంటి ప్రయోజనం పొందలేదని నిరసనలు వ్యక్తంచేస్తూ, ఉద్యమాలు మొదలయ్యాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ ఉద్యమాలకు ప్రతిస్పందిస్తూ వివిధ కమిటీలను, కమీషన్లను ఏర్పాటుచేశాయి. అలా ఏర్పడ్డ అన్ని కమిటీలు, కమీషన్లు "ఎస్సీలలోని కులాల మధ్య విద్య, ఉద్యోగపరమైన హెచ్చుతగ్గులు, అసమానతలు ఉన్నాయని" గణాంకాలతో సహా తమ నివేదికలలో పొందుపర్చాయి. అంతేకాకుండా కేవలం కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ అభివృద్ధి ఫలాలను అందుకున్నాయని, మిగతా మెజారిటి కులాలు అత్యంత వెనకబడి, అన్ని రంగాలలో వారు అన్యాయానికి, అణచివేతకు గురవుతున్నారని ఆ నివేదికలో పేర్కొన్నారు.

### ఎస్సీలలో రిజర్వేషన్ల వర్గీకరణ – చర్చ

1965లో, భారత ప్రభుత్వం బి. ఎన్ లోకూర్ ఆధ్వర్యంలో ఒక సలహా కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ అనేక అసమానతలను గుర్తించి, అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించడానికి షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) జాబితాలను సుస్పష్టంగా, శాస్త్రీయంగా సవరించాల్సిన అవసరం ఉందని తేల్చింది. లోకూర్ కమిటీ సిఫార్సులను ఉషా మెహ్రా కమిషన్ (2008: 75) ఇలా పేర్కొంది: " మాలలు జనాభాపరంగా తక్కువగా ఉన్నప్పటికి, ఇప్పటివరకు 15% రిజర్వేషన్ ఫలాలు మొత్తం (సింహభాగం) మాలలకు లభించాయి. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల జాబితానుండి 'మాల'లను తొలగించాల్సిన అవసరం ఉంది" అని సూచించారు. కానీ, ఇప్పటివరకు ఈ వర్గాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితానుండి తొలగించలేదు. ఫలితంగా వారు ఉద్యోగ, విద్యారంగాల్లో మరిన్ని ఉన్నతస్థానాలను ఆక్రమించుకొని, ఆర్థికంగా, రాజకీయంగా రాష్ట్రంలోని ఆధిపత్య వర్గాలతో సమానంగా ఉన్నారు.

### భారతదేశంలో వర్గీకరణను అమలు చేసిన రాష్ట్రాలు

బి.ఎన్ లోకూర్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అనేక రాష్ట్రాలలో వర్గీకరణ డిమాండ్ మొదలైంది. అందులో భాగంగా మొదటిసారి 1975లో పంజాబ్ ప్రభుత్వం అంతర్గత వర్గీకరణ అవసరాన్ని గుర్తించి, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేసి, దాదాపు 30సంవత్సరాలపాటు ఎటువంటి ఆటంకం లేకుండా అమలు చేసింది. పంజాబ్ లో అమలు చేస్తున్న వర్గీకరణకు కొనసాగింపుగా, 1990 దశకంలో హర్యానా ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు పరిచింది.

### వర్గీకరణ కొరకు వివిధ రాష్ట్రాల డిమాండ్

1990వ దశకం నుంచి, భారతదేశంలో అత్యంత అట్టడుగున ఉన్న దళిత కులాల మధ్య పెద్దయెత్తున ప్రజాస్వామ్య పోరాటాలు చోటు చేసుకున్నాయి. ఇవి ఎక్కువగా సామాజిక గుర్తింపు, న్యాయ సమ్మతమైన వనరుల పునర్వినియోగానికిగాను జరిగాయి. ముఖ్యమైన ఉద్యమాలు తెలుగుప్రాంతా(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)ల్లో మాదిగలు, మహారాష్ట్రలో మాంగులు (మాతంగులు), తమిళనాడులో అరుంధతీయులు, కర్ణాటకలో మాదిగలు, ఉత్తర భారతదేశంలో భంగీలు/వాల్మీకుల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాలు అనేకం ఉన్నాయి.

### ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

1980వ దశకం ప్రారంభంలో, మాదిగ సమాజం ఎస్సీ రిజర్వేషన్లలో మాలల ఆధిపత్యంపై తమ తిరుగుబాటును వ్యక్తపరచడం మొదలైంది. తరతరాలుగా మాలలు ఈ ప్రయోజనాలనుంచి అధికంగా లబ్ధిపొందుతూ, మాదిగ, ఇతర ఉపకులాల విద్య, ఉద్యోగ అవకాశాలను కొల్లగొడుతున్నారు. ఆధిపత్యం, అసమానతలకు వ్యతిరేకంగా మాదిగలు బలమైన ఉద్యమానికి నాంది పలికారు. మార్పు, సమానత్వం, సామాజికన్యాయ నినాదంతో ప్రజలంతా సంఘటితమయ్యారు. ఉద్యమానికి బలమైన పునాదులు వేశారు.

ఈ ఉద్యమం 1994 జూలై 7న, 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' (MRPS) స్థాపనతో విస్తృతంగా ఊపందుకుంది. దీనికి మందకృష్ణ మాదిగ నాయకత్వం వహించారు. ఎమ్మార్పిఎస్ మాదిగ సమాజానికి, ఆ మాటకొస్తే మొత్తం

పౌరసమాజానికి ఒక నూతన ఆశాకిరణంగా మారింది. న్యాయమైన ప్రాతినిధ్యం, హక్కులకోసం మాదిగ, మాదిగ ఉపకులాల పోరాటాన్ని ప్రతిబింబించింది.

**కర్ణాటక**

కర్ణాటకలో హొలేయకులం స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి వనరులను, హక్కులను అధికంగా ఉపయోగించుకుంటూ ఆధిపత్యకులంగా ఎదిగింది. రాష్ట్రంలో వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాలలో వారి ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో, మాదిగ సమాజం అత్యంత అణగారిన కులాలలో ఒకటిగా ఉంది. వనరులు, హక్కుల సమాన పంపిణీకోసం ఎన్నో ఏళ్లుగా నిరంతరం పోరాడుతుంది. దాంతోపాటు వర్గీకరణ పోరాటానికి కర్ణాటకలోని వెనకబడ్డ ప్రజలు తమ ఆసక్తిని, పోరాటతత్వాన్ని కనబరిచారు. ముఖ్యంగా ఇక్కడ ఎంతగానో వెనకబడ్డ మాదిగలు ఎస్సీ రిజర్వేషన్లలో, విద్య, ఉద్యోగ అవకాశాలులాంటి తమ న్యాయమైన వాటాను పొందేందుకు వర్గీకరణ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ వర్గీకరణ పోరాటం మాదిగ సమాజం ఎదుర్కొంటున్న అసమానతలను పరిష్కరించడం, ఎస్సీ కేటగిరీలోని వివిధ ఉపకులాలమధ్య రిజర్వేషన్ల ఫలాలను సమానంగా పంపిణీ చేయడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది.

**తమిళనాడు**

తమిళనాడులో, పరాయర్, పల్లర్ కులాలు ఎస్సీల్లో ప్రధాన ఆధిపత్య కులాలు. ఇవి రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేస్తున్నాయి. అంతేకాకుండా వారు విధానాల రూపకల్పన చేయడంలో, సమాజపు గతి నియంత్రణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. కానీ, చక్కిలియార్, అరుంధతియార్ కులాలు అత్యంత వెనుకబడినకులాలుగా ఉన్నాయి. ఇవి ఆర్థిక, రాజకీయరంగాలలో తమ హక్కులను పొందడంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటూ నిరాదరణకు గురౌతున్నాయి. ఈ సమూహాలు వనరుల వాటా, వివిధ రంగాలలో తమ ప్రాతినిధ్యంకోసం నిత్యం పోరాడుతూనే, ఎస్సీలలో అంతర్గతంగా ఉన్న అసమానతలను స్పష్టంగా తెలియజేస్తున్నారు.

అరుంధతియార్ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను పరిష్కరించేందుకు 1994లో కోయంబత్తూరులో శ్రీ ఆతియామాన్ ఆధ్వర్యంలో "ఆది తమిజార్ పెరవై" (ATP) ను స్థాపించడం జరిగింది. ఈ ఉద్యమం చారిత్రాత్మకంగా అరుంధతియార్ సమాజం ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేత, అసమానతలను రూపుమాపి వారి అభివృద్ధికి ప్రయత్నిస్తోంది.

**వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రస్థాయి కమిషన్ల ఏర్పాటు**

1990లో హర్యానాలో 'జస్టిస్ గుర్నామ్ సింగ్ కమిషన్' ఏర్పాటు చేసారు. ఆ నివేదికలో ఎస్సీ జాబితాను బ్లాక్ 'A', బ్లాక్ 'B'గా విభజించింది. ఇందులో 36 కులాలు బ్లాక్ 'A'లో ఉండగా, ఎక్కువ ప్రయోజనాలు పొందిన చమార్ కులాన్ని బ్లాక్ 'B'లో ఉంచి, ఆ కమీషన్ ప్రతిపాదనల ఆధారంగా వర్గీకరణను అమలుపరిచారు. అదేవిధంగా 1997లో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన రామచంద్రరాజు కమీషన్ అత్యంత వెనుకబడినవారికి రిజర్వేషన్ ప్రయోజనాలు అందించడంలో భాగంగా ఎస్సీలను గ్రూప్ A, B, C, మరియు Dలుగా వర్గీకరించడానికి సిఫార్సు చేసింది. ఆ సిఫార్సు ఆధారంగా అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 సంవత్సరం నుండి, 2004 వరకు వర్గీకరణను అమలుచేసింది. అలాగే 2001 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సైతం హుకూంసింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. దాంతో ఈ కమిటీ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాల్సిన ఆవశ్యకతను తమ కమిటీ నివేదికలో స్పష్టంగా పేర్కొంది.

2003లో మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'లాహుజీ సాల్వే కమిషన్' ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాల్సిందిగా సిఫార్సు చేసింది. 2005లో కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జస్టిస్ ఏ.జె. సదాశివ కమిషన్' 101 కులాలను నాలుగు వర్గాలుగా విభజించాలని, ప్రతి వర్గానికి తమ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించింది. 2007 బీహార్‌లో 'మహాదళిత్ కమిషన్' అత్యంత వెనకబడ్డ దాదాపు 18 కులాలను ప్రత్యేకంగా గుర్తించింది. 2008లో తమిళనాడులో 'జస్టిస్ తిరు.ఎం.ఎస్. జనార్దనం కమిటీ' అరుంధతియార్ సమాజానికి రిజర్వేషన్లలో ప్రత్యేక హక్కులను కల్పించాలని సిఫార్సు చేస్తూ, ఎస్సీలలోని సమస్యలను పరిష్కరించడానికి లక్ష్యంగా పెట్టుకున్న విధానాల అవసరాన్ని వెల్లడించింది.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ రిజర్వేషన్ల అసమాన పంపకం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ రిజర్వేషన్ ఫలాల పంపిణీ అసమానంగా జరగడం అందరికి తెలిసిందే. దీనివల్ల వివిధ ఎస్సీ ఉపకులాలమధ్య పెద్దమొత్తంలో వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. మాలలు, రాష్ట్రంలో ప్రధాన ఎస్సీ కులంగా, విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యంవంటి రంగాల్లో పెద్దమొత్తంలో రిజర్వేషన్

ప్రయోజనాలు పొందారు. వీరు ఆర్థికంగా, రాజకీయంగా ఇతర ఎస్సీ కులాలతో, వర్గాలతో పోలిస్తే, మెరుగైన సాధికారితను, ఆధిపత్యకులాలతో పోల్చదగ్గ సారూప్యతను సాధించుకున్నారు.

ఇదిలా ఉంటే, మిగతా 59 ఎస్సీ కులాలు రిజర్వేషన్ ఫలాలు సమానంగా పొందలేకపోయాయి. ఫలితంగా ఆ కులాల్లో అభివృద్ధి కుంటుపడింది. దాంతో ఎస్సీ కులాల్లోని అంతర్గత వర్గీకరణకోసం పెరిగిన డిమాండ్, ఎస్సీ కులాల్లో ఉన్న అట్టడుగు వర్గాలకు సరైన అవకాశాలు అందించేందుకు వర్గీకరణ జరగడమే ఉత్తమంగా భావించడం జరిగింది.

1970 దశకం ప్రారంభంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలలో విద్య, ఉద్యోగం, రాజకీయ అసమానతలను మొదటగా మాదిగ విద్యావంతులు గుర్తించారు. రిజర్వేషన్ ప్రయోజనాల అసమానపంపిణీ గురించి అవగాహన కలిగి, చాలామంది విద్యావంతులైన మాదిగ ఉద్యోగులు తమ ఆవేదనను, ఆందోళనలను వ్యక్తంచేశారు.

ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణకోసం ఉద్యమం, తీవ్రరూపం దాల్చింది. 1972లో అప్పటి మంత్రి టీ.ఎన్ సదాలక్ష్మి ఈ సమస్యను ముఖ్యమంత్రి జలగం వెంగళ్ రావుకు అందించారు. మాలల ఆధిపత్యం కారణంగా మాదిగ, మాదిగ ఉపకులాలు ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను అందుకోలేక పోతున్నాయని గణాంకాలతో సహా తెలియజేశారు.

## MRPS ఉద్యమ ప్రస్తానం, ప్రభావం

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణే లక్ష్యంగా మొదటితరం ఉద్యమకారుల పోరాటానికి కొనసాగింపుగా, వర్గీకరణ డిమాండ్, దానికోసం చేయాల్సిన పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా 1994 జులై 7న 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఆవిర్భవించింది. కేవలం 20 మంది యువకులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మందకృష్ణ నేతృత్వంలో మొదలైన ఎమ్మార్పిఎస్ 'దండోరా ఉద్యమం'గా ప్రారంభమై అన్ని గ్రామాలకు విస్తృతంగా పాకి, లక్షలమంది మద్దతును కూడగట్టుకుంది. ఈ దండోరా ఉద్యమానికి చిహ్నంగా మాదిగల సాంస్కృతిక వాయిద్యమైన డప్పును ఉపయోగించారు. ఈ డప్పు ధ్వని ప్రజలను అలరించడమేకాదు, అన్యాయాన్ని, దోపిడీని ధిక్కరించి ప్రజలను చైతన్యవంతులను చేస్తుంది. తిరుగుబాటుకు ప్రతీకాత్మకమైన డప్పును, మాదిగ సమాజం ఎదుర్కొంటున్న అన్యాయాలను వెలుగులోకి తెచ్చేందుకు తమ లక్ష్యాన్ని ప్రతిబింబించే సాధనంగా చాటింపు వేయడంకోసం ఉపయోగించారు. ఎమ్మార్పిఎస్ తన ఉద్యమాన్ని సామాజికన్యాయంకోసం చైతన్యవంతమైన పోరాటంగా రూపొందింది. వెనుకబడ్డజాతుల రిజర్వేషన్ ప్రయోజనాల అసమానపంపకంపై దృష్టిసారించి, ఆ అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చి, తమ సమాజం తాలూకు పోరాటాలను ప్రజలముందు పెట్టింది. రాష్ట్రంలోని 15 శాతం ఎస్సీ కోటాను 60 ఇతర ఎస్సీ కులాలకు సమానంగా పంచాలని ఎమ్మార్పిఎస్ దండోరా చాటింపు వేసింది.

ఈ సందర్భంగా హక్కుల నేత డా. బాలగోపాల్ ఎమ్మార్పిఎస్ ఉద్యమం, రిజర్వేషన్ వర్గీకరణ ఆవశ్యకతను వ్యక్తంచేస్తూ ఇలా అన్నారు "మాదిగ ఉద్యమం ఒక శక్తివంతమైన భావనను వ్యక్తంచేసింది. అందులోని సభ్యులు 'మాదిగ' అనే పేరును గర్వంగా స్వీకరించేందుకు ప్రోత్సహించడం జరిగింది. ఇది మొదట్లో కృష్ణమాదిగ, కృపాకర్ మాదిగవంటి నాయకుల పేర్ల చివరన చూడవచ్చు. అప్పటివరకు ఎక్కువగా ఒకరిని తిట్టడానికో, నిందించడానికో వాడబడిన కులం పేరును సగర్వంగా తమ పేరు చివరన పెట్టుకోవడం ద్వారా కొత్త ఒరవడిని సృష్టించారు. ఎమ్మార్పిఎస్ స్థాపన అనంతరం జరిగిన ఈ పరిణామంవల్ల సమాజంలో సాధారణంగా కృష్ణశాస్త్రి లేదా కృష్ణారెడ్డి వంటి సామాజికంగా ఆమోదయోగ్యమైన కులం పేర్లకు అలవాటుపడిన సమాజం, తమ అసమ్మతిని ప్రదర్శించారు. సాహసోపేతమైన ఈ ముందడుగు ఎందుకు కొన్ని కులంపేర్లకు మాత్రమే గౌరవం ఉందో, మిగతా కులాల పేర్లకు గౌరవం లేదో' అన్న ప్రశ్నలు సమాజంలో చర్చనీయాంశం అయ్యాయి. ఇది గాఢంగా ముడిపడిన ఉన్నత కులాల, కులవ్యవస్థ వైఖరులను సవాలు చేస్తూ, సమాజపు పక్షపాతాలపై అవసరమైన చర్చకు ప్రేరేపించింది."

ఎమ్మార్పిఎస్ మొదలుపెట్టిన ఈ వర్గీకరణ ఉద్యమం రోజురోజుకి తీవ్రరూపం దాల్చడం, దానికి ప్రతిస్పందనగా ఈ అసమానతలను గుర్తించడానికి అప్పటి రాష్ట్రప్రభుత్వం రామచంద్రరాజు కమీషన్ ను ఏర్పాటుచేసింది. ఈ సిఫార్సు ప్రకారం అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను చేసి, 2000 సంవత్సరంనుండి, 2004వరకు విజయవంతంగా అమలుపరిచింది.

**పట్టిక 1: 2000 సంవత్సరం నుండి 2004 వరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు ముందు, అమలు తర్వాత APPSC ద్వారా నిర్వహించిన నియమాకాల వివరాల పట్టిక (% శాతంలో)**

| సంవత్సరం | మొత్తం ఉద్యోగాలు | మాదిగ, మాదిగ ఉపకులాలు పొందిన ఉద్యోగాలు | మాలలు పొందిన ఉద్యోగాలు | ఇతర ఎస్సీ కులాలు పొందిన ఉద్యోగాలు |
|---|---|---|---|---|
| 1999-2000 (వర్గీకరణకు ముందు) | 111 | 12 (11) | 99 (90) | Nil |
| 2000-01(వర్గీకరణ అమలులో) | 147 | 68 (46) | 54 (37) | 25 (17) |
| 2001-02 (వర్గీకరణ అమలులో) | 331 | 169 (51) | 124 (37) | 38 (11) |
| 2002-03(వర్గీకరణ అమలులో) | 33 | 18 (55) | 9 (27) | 6 (18) |
| 2003-04(వర్గీకరణ అమలులో) | 148 | 66 (45) | 52 (35) | 30 (20) |
| 2004-05(వర్గీకరణ రద్దు అయ్యాక ) | 162 | 30 (19) | 130 (80) | 2 (1) |

*సేకరణ : ఉషా మెహార కమీషన్ నివేదిక 2008*

పై పట్టిక ఆధారంగా 1999-2000 నుంచి 2004-2005 వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) నిర్వహించిన నియామక ప్రక్రియను, ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాల (SC) వర్గీకరణ ప్రభావాన్ని సూచిస్తుంది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కాకముందు 1999-2000 సంవత్సరం మాలలు 90% పోస్టులను ఆక్రమించగా, మాదిగలు కేవలం 11% మాత్రమే సాధించారు, ఇతర SCలకు ఏ అవకాశాలు లభించలేదు. అయితే, 2000-2001లో వర్గీకరణ అమలవుతున్న సందర్భంలో మాదిగలవాటా గణనీయంగా 46% శాతం కాగా, మాలలు 37% శాతం అవకాశాలను పొందారు. ఇతర SCలకు 17%శాతం అవకాశాలు లభించాయి. ఈ పరంపర 2000-2004 వరకు కొనసాగింది. వర్గీకరణ అమలు జరిగిన ఈ కాలంలో (2000-2004) ఎస్సీ కులాలు తమ జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ అవకాశాలు పొందారు. అయితే అప్పటివరకు తమ దామాషాకంటే అధిక అవకాశాలు పొందిన మాలలకు ఇది మింగుడు పడని అంశంగా మారి, తమ గుత్తాధిపత్యానికి గండిపడుతుందని భావించారు. దాంతో దీనిని సవాలుచేస్తూ కోర్టును ఆశ్రయించి, తమ పలుకుబడి, అధికారాన్ని ఉపయోగించి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను కొట్టివేయించారు. 2004లో వచ్చిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను అప్పటి సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ కొట్టివేయడంతో ఎమ్మార్పిఎస్ తన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసింది.

**వర్గీకరణపై చారిత్రక తీర్పు**

2023 అక్టోబర్ 12న, భారత సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి డి. వై. చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేసింది, ఈ ధర్మాసనం పంజాబ్ వర్సెస్ దవిందర్ సింగ్ కేసును పరిశీలించడానికి నియమించబడింది. ఈ కేసు షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)కులాల్లో వర్గీకరణ సమస్య ప్రధాన కేంద్రంగా ఉంది. ఈ కేసు విచారణ 2024 జనవరి 17న ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించిన కేసులను కలిపి విచారణ చేపట్టారు.

ఈ ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ప్రధానంగా రెండు కీలక విషయాలను పరిశీలించింది: (1) రిజర్వ్ కులాలమధ్య వర్గీకరణ అనుమతించాలా లేదా?, (2) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వర్సెస్ ఈ.వి. చినయ్య తీర్పు చెల్లుబాటు, ఇది ఆర్టికల్ 341 కింద పేర్కొన్న 'షెడ్యూల్డ్ కులాలు' (ఎస్సీ) ఒకే సమానమైన వర్గంగా ఉంటాయనీ, వాటిని మరోసారి వర్గీకరించరాదని నొక్కి చెప్పింది.

2024 జనవరి 17నుండి ప్రారంభమై, మూడు రోజుల విస్తృతవాదనలు ముగిసిన తర్వాత ధర్మాసనం తన తుది తీర్పును రిజర్వ్ చేసింది. అలా రిజర్వ్ చేసిన తీర్పును 1 ఆగస్ట్, 2024 రోజున ఉదయం తమ తుదితీర్పుగా వెలువరించారు. ఇది రిజర్వేషన్ వ్యవస్థలో వర్గీకరణకు అనుమతి ఇస్తుంది. ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం, 6-1 మెజారిటీ తీర్పుతో, 2004లో ఇచ్చిన ఈ.వి. చినయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేసు తీర్పును రద్దుచేసింది.

**సుప్రీంకోర్టు తీర్పు ప్రధాన అంశాలు:**

**1. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్టికల్స్ 14 మరియు 341లను ఉల్లంఘించదు**

ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో పొందుపరచబడిన సమానత్వసూత్రాన్ని ఉల్లంఘించదని

సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదేవిధంగా, ఈ వర్గీకరణను ఆర్టికల్ 341(2) కింద అనుమతించతగినదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దీనిప్రకారం ఎస్సీల జాబితాను ప్రకటించడానికి రాష్ట్రపతికి అధికారం కల్పిస్తుంది.

**2. రాష్ట్రాల వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీలను వర్గీకరించవచ్చు**

ఈ తీర్పు రాష్ట్రాలకు, ఎస్సీలను వెనుకబడినతనం ఆధారంగా వర్గీకరించడానికి అనుమతిస్తుంది. తద్వారా రిజర్వేషన్ ఫలాలను, ప్రయోజనాలను మరింత సమర్థవంతంగా విస్తరించవచ్చు. అయితే, ఈ వర్గీకరణ పూర్తిగా పరిమాణాత్మక/ ప్రయోగాత్మక గణాంకాల ఆధారంగా ఉండాలని కోర్టు స్పష్టంచేసింది.

**3. క్రీమీలేయర్‌ను మినహాయించాలని సూచన**

అధికారులు క్రీమీలేయర్ సూత్రాన్ని ఎస్సీలకూ వర్తింపచేయాలని బెంచ్ సూచించింది. క్రీమీలేయర్ అంటే, అభివృద్ధిచెందిన వర్గాలను రిజర్వేషన్ ప్రయోజనాలనుంచి మినహాయించడంద్వారా అత్యంత అణగారిన కులాలవారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఈ తీర్పులో పేర్కొంది.

**4. ఈ.వి.చిన్నయ్య తీర్పు తిరస్కరణ**

సుప్రీంకోర్టు ఈ తీర్పుతోపాటు ఈ.వి.చిన్నయ్య తీర్పును రద్దుచేసింది. ఇది ఎస్సీలను వర్గీకరించడం ఉన్నత విద్యలో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ల ప్రయోజనాలను అందించడంలో రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే అంశాన్ని జస్టిస్ ఈ. వి చిన్నయ్య నిషేధించింది. కోర్టు తాత్కాలిక వర్గీకరణను సరిగ్గా అమలుచేయకుండానే ఈ వర్గీకరణ నిబంధనలను ఉల్లంఘిస్తుందనే నిర్ధారణకు వచ్చిన ఈ పూర్వపు తీర్పును ప్రస్తుత ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసన న్యాయస్థానం తప్పుపట్టింది.

**రాష్ట్రాలు స్పందిస్తాయా లేక మరో ఉద్యమం అవసరమా?**

భారత సుప్రీంకోర్టు, చారిత్రాత్మకతీర్పులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలలో అత్యంత అణచివేతకు గురైన వారిని గుర్తిస్తూ, సామాజికన్యాయానికి మద్దతు తెలిపింది. గత 75 సంవత్సరాలలో రిజర్వేషన్ ప్రయోజనాలు ప్రధానంగా కొన్నికులాలకు మాత్రమే లబ్దిని చేకూర్చాయి. ఇది సమానత్వం, సామాజిక న్యాయసూత్రాన్ని బలహీనపరిచింది.

ఎస్సీలలోని కొన్నికులాలు ఆర్థిక, రాజకీయరంగాలలో పురోగతి సాధించినప్పటికీ, ఎక్కువ సంఖ్యలో ఎస్సీ వర్గాలు కుల ఆధారిత అణచివేతలో చిక్కుకుపోయి, తీవ్రమైన ఆర్థిక దుర్భలతతో, విద్యలో పరిమిత అవకాశాలతో పోరాడుతున్నాయి. విద్యావంతులైన దళితులలోని కొన్ని వర్గాలు చారిత్రాత్మకంగా విద్య, ఉద్యోగ అవకాశాలలో తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ఈ కారణంచేత విద్య, ఉద్యోగ అవకాశాలు తరతరాలుగా అణచివేతకు గురైన దళితులకు మరింత దూరం అయ్యాయి.

ఈ వివక్షను, అసమానత్వాన్ని రూపుమాపే దిశగా సుప్రీంకోర్టు తీర్పు వెనుకబడినకులాలను పరిగణలోకి తీసుకుని, వారు విద్య, ఉద్యోగ అవకాశాలకు ఎంత దూరంగా ఉన్నారో గుర్తించడంద్వారా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించడానికి త్వరితగతిన ఒక చట్టాన్ని తీసుకురావాలి. అయితే, ఈ చట్టం అమలుకు ఎక్కువ సమయం, సమీక్ష అవసరం లేదు. MRPSవంటి సంఘం జనాభా ఆధారంగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తోంది. అయితే మళ్ళీ జనాభా లెక్కలకోసం కాలయాపన చేయకుండా ఈ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ 2011 జనాబా లెక్కల ఆధారంగా అమలుచేయాడానికి ప్రభుత్వాలు భాధ్యత తీసుకోవాలి.

ఇప్పుడున్న అన్నిరాష్ట్రాల ముందున్న ప్రధాన సవాల్ ఏమిటంటే? రాష్ట్రాలు వర్గీకరణను అమలుచేస్తాయా? అయితే, అన్ని పార్టీలలో ఉన్న ఆధిపత్య దళితకులాలు, వాళ్ళ రాజకీయ, అధికార పలుకుబడిని ఉపయోగించి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకాకుండా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తారు. ఇలాంటి కుట్రలకు రాష్ట్రప్రభుత్వాలు తావివ్వకుండా సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని సమన్యాయం, సామాజిక న్యాయంకోసం ఎదురు చూస్తున్న అట్టడుగు దళితులకు న్యాయం అందించే దిశగా కార్యక్రమాలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు చర్యలు చేపడతాయా లేక, ఈ అట్టడుగుకులాల ప్రజలు ఈ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకై మరొక ఉద్యమాన్ని చేయాల్సిన నిస్సహాయతలోకి ప్రభుత్వాలు ఈ ప్రజలను నేడతాయా అనేది నేడు సమాజంలో ఉత్పన్నమవుతున్న అతిపెద్ద ప్రశ్న.

మూడు దశాబ్దాలుగా వర్గీకరణకోసం పోరాడిన మాదిగలు, త్యాగాలుచేసి, ప్రాణాలను కోల్పోయి, దేశానికి సామాజిక న్యాయపోరాటమార్గాన్ని చూపారు. ఇప్పుడు వర్గీకరణ చేసే బాధ్యత అన్ని రాష్ట్రాలపై ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుచేసి, అత్యంత అణచివేతకు గురైన సమాజాలకు వారిజనాభాకు అనుగుణంగా వారికి సమాన అభివృద్ధి అవకాశాలను అందించాల్సిన బాధ్యత ఉంది.

**రచయితలు: అసిస్టెంట్ ప్రొఫెసర్**
**మిజోరాం యూనివర్సిటీ.**
**పరిశోధక విద్యార్థులు,**
**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

# కోటొక్క పూల పండుగ బతుకమ్మ

ఎస్.పరమేశ

"తంగేడు పూవులఁ దాంబాలమునఁ
గుండ్రముగ నందముగఁ బేర్చి,
మురువు సూపు వివిధమ్ములగు
రంగులవి గునుగులఁ బేర్చి,
మందార, కట్ల, చేమంతుల నిడి,
బంతిపూవులు పోకబంతిపూవులు వింత
సొబగుల నీనఁగాఁ జూపరులకుఁ
బ్రకృతి సోయగమంతఁ బందువు సేయంగ
బ్రతుకమ్మ నడుమ గౌరమ్మనుంచి,
ధగధగలతోడి పట్టుపీతాంబరములఁ
గట్టుకొనియును మెఱయుచు ఘనముగాను
కనకదుర్గకు లక్ష్మికిఁ గడు ముదమున
వందనము సేసి, యర్చింత్రు పడతులంత!"

– మధురకవి గుండు మధుసూదన్,
శంకారాభరణం బ్లాగు

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మను శతాబ్దాలుగా తెలంగాణ నేల ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. వందల ఏళ్లుగా బతుకమ్మను తెలంగాణ ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు. బతుకమ్మ పండుగ చుట్టూ ఎన్నో చరిత్రలు, పురాణాలు మేళవిస్తారు. ఎన్నో చారిత్రక, సాంస్కృతిక పాటలు పాడుతారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉ ంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో బతుకమ్మ ఖండాంతరాలు దాటి ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయళ్లలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు కూడా ఈ సమయంలో ఒక పెద్ద ఆకర్షణ. సీతాఫలాన్ని పేదవాని ఆపిల్ అంటారనేది తెలిసినదే. అలాగే జొన్న పంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకో బడుతుంది. బతుకమ్మ సంబరాలు జరుపుకునే తొమ్మిది రోజుల ముందు నుంచే స్త్రీలు 'బొడ్డెమ్మ' (మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మ) ను చేసి ఆడి, పాడి నిమజ్జనం చేస్తారు.

తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మకు ప్రతిరోజూ ఒక ప్రత్యేకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువతీయువకులు పాల్గొంటారు. చివరి రోజును సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

**1. ఎంగిలి పూల బతుకమ్మ:** మహా అమావాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

**2. అటుకుల బతుకమ్మ:** ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**3. ముద్దపప్పు బతుకమ్మ:** ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

**4. నానేసిన బియ్యం బతుకమ్మ:** నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

**5. అట్ల బతుకమ్మ:** అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

**6. అలిగిన బతుకమ్మ:** ఈరోజు ఆశ్వీయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు. అందుకే దీనిని 'అర్రెం' అంటారు.

**7. వేపకాయల బతుకమ్మ:** బియ్యం పిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

**8. వెన్నముద్దల బతుకమ్మ:** నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

**9. సద్దుల బతుకమ్మ:** ఆశ్వీయుజ అష్టమి నాడు ఆదే రోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు. మొదటిరోజు బతుకమ్మను ఎంగిలిపువ్వు బతుకమ్మ అని, చివరి రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని అంటారు. ఈ రోజుల్లో ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుని ఈ పూల పండుగ జరుపుకోవటానికి తయారవుతారు. ఈ తొమ్మిది రోజులలో వీరు రోజూ బతుకమ్మలు చేసి, ప్రతీ సాయంత్రం వాటి చుట్టూ తిరుగుతూ ఆడుతారు. ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు.

బతుకమ్మ పండుగ చుట్టూ తెలంగాణ కవులు బోలెడు పద్యాలు అల్లుకున్నారు. కవుల కవిత్వంలో బతుకమ్మ మురిసిపోతుంది. తళుకులీనుతుంది. పరిమళిస్తుంది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెడుతుంది.

"పువ్వులను బేర్చి గుంద్రము
నవ్వులతో బూజ జేసి నలుగురి తోడన్
నవ్వులు బాడుచ దిరుగుచు
దవ్వుల చెరువుల నిడెదరు తానము సలుపన్!"

–వసంత కిశోర్, శంకరాభరణం బ్లాగు

సద్దుల బతుకమ్మ పండుగ అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్ళలోనికి పోయి తంగేడు, గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకుని వస్తారు. ఆ తరువాత ఇంటిల్లిపాదీ కూర్చుని ఆ పూలతో కోణాకారంలో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగుపూలు, తంగెడుపూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. బతుకమ్మ పేర్చడం అయిపోయిన తరువాత వాటిని ఇంటి ముందు వాకిట్లోగాని, దేవుని గుడిలోగాని, చౌరస్తాలోగాని ఉంచి స్త్రీలంతా దాని చుట్టు తిరుగుతూ, పాటలు పాడుతూ చెరువుల్లో తానము (నిమజ్జనం) చేస్తారు.

"గునుగు తంగేడు పూలెన్నొ యినుమడించ
గౌరి మాతను జేరిచి గౌరవమున
భర్త, పిల్లల సేమము బడయ గోరి
వనిత లెల్లరు బతుకమ్మ పండుగనుచు
సంబరంబుగఁ జేసెద రంబ పూజ
తాన మాడింత్రు చెరువులో తన్మయమున!"

– గుండా వేంకటసుబ్బ సహదేవుడు, శంకరాభరణం బ్లాగు

బతుకమ్మ పండుగ తెలంగాణా ప్రాంతానికే చెందడం మన గొప్ప సంస్కృతికి సాక్ష్యం. ఎవ్వరికైనా ఐదారుగురు కన్నా ఎక్కువమంది పిల్లలుంటే ఆ తల్లిని గౌరవించేవాళ్ళు. మానవజాతి పిల్లల వల్లనే కదా ఇన్ని వేలయేండ్లుగా మనగలిగింది. అందుకే తల్లికంత గౌరవం. అమ్మతనం మీద భక్తి. ఆ భక్తే అమ్మదేవతలను కల్పించింది. పూజించింది. అమ్మదేవతల పూజల్లో ఒక ఆరాధనా రూపమే మన బతుకమ్మ.

"ఆశ్వీజ శుద్ధమందున ధర స్త్రీలంత
తిరిగి పువ్వులు తెచ్చి తేజమలర
బతుకమ్మయని పేర్చి బ్రమ నొందగ నాడి
నదిలొ వేతురు శుద్ధ నవమి వరకు
నా సందు నీ సందు నానాడె పాసెనని
కుంటి రంగని పుండు గూసెననుచు
వైనము సిబ్బులన్ వదులు బదులందుకొని
యెవ్వరెవ్వరి చద్ది వారు గుడిచి
యేగుదురపుడు యిండ్లకున్ ఎలిమితోడ
ప్రేమదీరెను బతుకమ్మ పేరు మాసె
వినుడి మాయప్ప శిద్దప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప"

–వరకవి సిద్ధప్ప తత్త్వకవిత, పుట. 108

బతుకమ్మ వేడుకలో చుట్టూ తిరిగేప్పుడు కులాల ప్రసక్తి ఉండదు. ఆర్థిక అంతరాల ఊసు ఉండదు. కోలలు కలుపుతూ కొప్పులు దిద్దుతారు. ఆ గాజుల చప్పుళ్లు అందరివీ. చీకటిలో వెలిగే ఆ రంగుల పూలు ఊరందరివీ. అక్కడ పెద్ద బతుకమ్మ, చిన్న బతుకమ్మ అన్న తేడా ఉండదు. అన్ని బతుకమ్మలూ ఒకదాని పక్కన మరోటి అందంగా అమరిపోతాయి. ఈ సమైక్యతే బతుకమ్మను రాష్ట్ర పండుగగా మార్చింది. సబ్బండ వర్ణాల సంకేతంగా మలిచింది. ఒక జాతికి ప్రతీకగా నిలిపింది. అందుకే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవ పతాక. తెలంగాణ ప్రజల జీవనాడి. ఉద్యమ పథంలో వెలుగులు నింపిన అఖండ దీపం. బంగారు తెలంగాణకు రతనాల కిరీటం. బతుకమ్మ పండుగంటే ఒక ఉద్వేగం. బతుకమ్మ పండుగంటే ఒక ఉత్సాహం. బతుకమ్మ పండుగంటే కోటిపూల ఉత్సవం.

"బతుకమ్మను బూజింతురు
వెతలను నిక బాపు కొఱకు వెలదులు భక్తి
న్సతతము గాపాడుమ మతి
బతుకమ్మా! నీకునిడుదు వందన శతముల్"

– సుబ్బారావు, శంకరాభరణం బ్లాగు

జీవితంలోని వెతలను తీర్చుమని ఆ గౌరీ మాతను కొలవడమే బతుకమ్మ పండుగ. పిల్లా, పాపల్ని చల్లగ చూడుమని

స్త్రీలంతా చేరి మూకుమ్మడిగా ఆ పార్వతీదేవిని ఆట, పాటల ద్వారా ప్రార్థించడమే బతుకమ్మ పండుగ.

బతుకమ్మ పండుగగకు వాడే పూలలో ఒక్కో మొక్కలో ఒక్కో రకమైన విశిష్ట రసాయనాలు వేర్వేరు రకాల చీడలను అరికట్టడానికి దోహదం చేస్తాయి ఉదాహరణకు బంతి, చామంతి మొక్కల్లో ఉండే పైరేత్రిన్ అనే రసాయనం దోమకాటు, కొన్ని రకాల లార్వాలను నిర్మూలించగలదు. జిల్లేడు మొక్కలో ఉండే కాలోట్రోపిన్, ఉషారిన్, కాలో టాక్సిన్ అనే మూడు రసాయనాలు నత్తలను మరియు అనేక కీటకాలను నశింప చేస్తాయి. పంచ రంగుల పూలలో ఉండే లాంటడీన్ అనే రసాయన పదార్థం శనగ పచ్చ పురుగు యొక్క గుడ్డు పెట్టె సామర్థ్యాన్ని తగ్గించి వేయడమే కాక వివిధ దశలలో ఉన్న లార్వాలను చంపివేస్తుంది. తంగేడు, పట్టుకుచ్చు, గునుగు మొక్కల్లోని రసాయనాలు సుడిదోమ, ఎఱ్ఱనల్లి, పేనుబంకను సమర్థ వంతంగా అరికట్టడమే కాక భూమిలో నత్రజని యొక్క స్థాయిలను పెంచాతాయి. గడ్డిపూల మొక్కలలోని భాగాలు బాక్టీరియాను సమర్ధవంతంగా నిర్మూలించగలవు. ఇలా ఔషధ గుణాలున్న విశిష్ట పండుగ బతుకమ్మ.

"తంగెడు పూపచ్చదనము నీవేనని
పసుపు పారాణి కాపాడెదవని
గునుగుపూవుల తెల్లదనము నీవేనని
స్వచ్ఛమైన మనసునిచ్చెదవని
పోకపూవులలోని పోడిమి నీవని
గుణమైన మొగుడిని గూర్చెదవని
మందారపూలోని అందమే నీవని
పరువైన భవిత నేర్పడిచెదవని
పొలతులెల్లను గూడి నీ పూజచేసి
ఆర్తిదీరంగ పదముల నాడిపాడి
గౌరి రూపమ్ము మా బతుకమ్మ యనుచు
గారవింతురు నా తెలంగాణ నిండ"

–దోరవేటి, తంగేడు వనం. పుట. 141

తెలంగాణలోని ఆడపడుచులంతా బతుకమ్మ పండుగను ఎందుకు జరుపుకుంటారో? గౌరమ్మను ఎందుకు కొలుస్తారో వివరించే పద్యం ఇది. జీవితాన్ని పచ్చగా మలుస్తుందని, భార్యా పిల్లలను చల్లగా కాపాడుతుందని, గునుగుపూల వంటి తెల్లని మనసును ఇస్తుందని, మంచి మొగుడిని ప్రసాదిస్తుందని, కీర్తివంతమైన భవిష్యత్తును ప్రసాదిస్తుందని ప్రతియేట బతుకమ్మ పండుగను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకుంటారని కవి బతుకమ్మ పండుగ వెనకగల జీవిత తాత్త్వికతను చెప్పాడు. మా ఇంటి బతుకమ్మ గౌరి రూపము అని భావించి ఎంతో గౌరవిస్తారని తెలంగాణ కన్నెపిల్లల మనసుకు కదు హృద్యంగా కవిత్వీకరిస్తాడు కవి ఈ పద్యంలో.

"తలను పూవులు పేరు మొలను పూసల పేరు
తంగేడు పూరాసి తరుణులాన
ఆట పాటలతోను ఆడించి పాడించి
అలరించి పూజలన్ ఆందజేయు
వారలకెలమిపై వీర ధీరత్వమున్
ముత్తయిదువులుగాను మురియుచుండు
వరమిచ్చుచుంటిని ధరణిలో స్త్రీజాతి
సతిపతులు బిడ్డలందరున్ సంతసింప
పూజ చేయండి తంగేడు పూలతోడ
మన తెలంగాణ అభివృద్ధి ఘనతగాంచు"

–రామడుగు నరసింహాచార్యులు,
తంగెడు వనం. పుట. 266

తీరైన బతుకునిమ్మని తెలంగాణ పడుతులందరూ ఆ గౌరమ్మను పూజింపగా, వరమడుగుమని ఆ దుర్గాదేవి పలికింది. "అమ్మవో 'బతుకమ్మ' ఆర్తిని కనుగొంటి తంగేడు పూదోట తల్లడిల్ల, ముత్తయిదువుగ శ్రీలు మున్ముందు నన్గొల్వ... ఎవరు దేనిని కోర ఇష్టమై దీవించు ఆరాధ్య దేవత అభిలషించు" అని పడతులందరూ ప్రార్థించారు. పసుపు కుంకుమలతో, మంగళసూత్రాలతో నిండు నూరేళ్ళు జీవించుడని ఆ గౌరీమాత వరములిచ్చింది. అప్పటి నుంచి తెలంగాణ ప్రజలందరూ బతుకమ్మను కొలుస్తూనే ఉన్నారు. దినదినము తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతూనే ఉన్నది.

తెలంగాణలోని స్త్రీలందరూ అన్ని పండుగలను కడప లోపల జరుపుకుంటారు. బతుకమ్మ పండుగను మాత్రం స్త్రీలంతా కలిసి సామూహికంగా ఆరుబయట జరుపుకుంటారు. బతకమ్మ పండుగ ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, వర్ష రుతువులోని ప్రకృతి విపంచి రాగం, అక్టోబర్ మాసపు పూల సోయగం, నదుల జల కళ, ప్రజల ఉత్సాహ, ఉల్లాసాలు అన్నీ మేళవించి ఎంతో వసంత శోభను పంచుతాయి. నేల మీదికి కోటి చందమామలు దిగినట్లు, వేయి సింగిడీలు పూసినట్లు బతుకమ్మ పండుగ ప్రజలందరి జీవితాల్లోకి కొత్త వెన్నెలను తీసుకురావాలని ఆకాంక్షిద్దాం.

**ఆధార గ్రంథాలు:**


1. తంగేడు వనం, సం. మామిడి హరికృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, హైదరాబాద్ 2015
2. వరకవి సిద్ధప్ప తత్త్వకవిత, సం. సామిడి జగన్‌రెడ్డి, తెలంగాణ బుక్ ట్రస్ట్, హైదరాబాద్ 2016
3. శంకరాభరణం బ్లాగు, కంది శంకరయ్య, 2014.


★ **రచయిత:అధ్యాపకులు,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు

# తెలంగాణ ఉక్కు మిషన్-జై కిషన్

డా. కల్యాడపు రమేశ్

*దక్కన్, తెలంగాణ చరిత్రకు తన పరిశోధనతో కొత్త ఆకరాలను సమకూర్చిన తెలంగాణ చరిత్ర పరిశోధనాపథికుడు. తెలంగాణలో 'ఉక్కుదేవత నడయాడిన ఆనవాళ్లో'ను అన్వేషించిన సాహస పరిశోధకుడు. వేరెవరూ తొంగిచూడని నూతన పరిశోధనాదృక్కులుగల ఔత్సాహిక అన్వేషకుడు. ద్వితీయస్థాయి ఆకరాలంటే ఏమిటో తెలియని మౌలిక పరిశోధకుడు. నేటికీ క్షేత్రపరిశోధనలో సేకరించిన ప్రాథమిక సమాచారమంటేనే ఆయనకు ప్రాణప్రదం. అవే ఆయన పరిశోధనకు మూలధాతువు. తెలంగాణలో ఇనుము-ఉక్కు పరిశోధనకు పాదులు వేసిన మార్గదర్శి, చరిత్రకారుడు, రిటైర్డ్ అధ్యాపకుడు డా. జైకిషన్ గారితో నడుస్తున్న తెలంగాణ తరుపున డా. కల్యాడపు రమేశ్ జరిపిన ఇంటర్వ్యూ విశేషాల సమాహారం. ఉక్కు సంకల్పంలోకి మీ అందరికీ స్వాగతం.*

**మీ ఊరు, సామాజిక నేపథ్యాలను వివరించండి?**

మాది కరీంనగర్ జిల్లాలోని ఇల్లంతకుంట మండలం. దాచారం గ్రామం. నేను ఇక్కడ 04 ఫిబ్రవరి, 1955లో పుట్టాను. మా అమ్మ పేరు లక్ష్మీవెంకట నరసమ్మ. నాన్న పేరు శ్రీ పెరుంబూదూరు పాపయ్య. సహజంగా మా ఊరికి ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ అతిప్రాచీనమైనటువంటి 'పాటి' ఉంది. పాటి అంటే ప్రాచీన కాలంనాటి నివాస స్థలం. అక్కడ ఇనుము కరిగించిన ఆనవాళ్ల ఆధారంగా ఈ గ్రామం అతిప్రాచీనమైనదని చెప్పవచ్చు. నేను పుట్టింది శ్రీ చాత్తాద శ్రీవైష్ణవ పూజారి కులంలో. అందుకే గ్రామంలోని దేవాలయాలు మాకే ఉండేవి. మా తాతలనుండి ఈ దేవాలయంలో పూజారులుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మా నాన్న, తాతగార్లు వైద్యులు కావడంవల్ల సుమారు చుట్టుపక్కల ఒక 40 గ్రామాలకు ప్రసిద్ధ వైద్యులుగా పేరుగాంచారు. మా తాత చదువుకోవడం, మా నాన్న చదువుకోవడంవల్ల మా ఇంట్లో విద్యావాతావరణం ఉండేది. వైష్ణవ కుటుంబంలో సాధారణంగా స్త్రీలుగాని, పురుషులుగాని పూర్తి అవిద్యతో కాకుండా విద్యావంతులుగా ఉండేవారు. ఎక్కువ విద్యావంతులు కాకపోయినా సామాన్య విద్యకి ఎప్పుడూ వీరు దూరం కాలేదు.

మా అమ్మ చదువుకోకపోయినా కుటుంబపరంగా ఆ కాలంలో సామాన్యమైన అక్షరాభ్యాసానికి నోచుకోవడంవల్ల చాలా పుస్తకాలు చదవడం, అవగాహన చేసుకోవడం తన జీవితంలో తనకు తాను ఒక గొప్ప విద్యావాతావరణాన్ని ఏర్పాటు చేసుకొంది. బహుశా మా అందరికీ చదువు రావడానికి ప్రధాన కారణం మా అమ్మే. మా విద్యపట్ల ఎక్కువ అమ్మకే బాధ్యత ఉండేది. మమ్మల్ని అందరినీ చదివించడం, క్రమ పద్ధతిలో జీవితాన్ని సాగించడానికి కారణం కూడా అమ్మే. మా కుటుంబాల్లో అందరం చాలా సన్నిహితంగా కలిసి ఉండడం ప్రధానమైన అంశం.

**హ.హ.హ. అన్నీ మీ అమ్మే అంటున్నారు మరి మీ నాన్న పాత్ర ఏంటి?**

అవును. మా నాన్న హెల్త్ ఇన్స్పెక్టర్ ట్రైనింగ్ పూర్తిచేసి, నిజాంప్రభుత్వంలో 1940లో ఉద్యోగం చేరాడు. ట్రైనింగ్ కంటే ముందే ఆయన పెళ్లి జరిగింది. తరచూ మా నాన్న ఉద్యోగరీత్యా వివిధ గ్రామాలకు వెళ్లేవారు. మూడు, నాలుగు రోజుల వరకు వచ్చేవారు కాదు. కొన్నిసార్లు మా నాన్న ఎక్కడ పనిచేస్తే అక్కడికి కుటుంబం మొత్తం వెళ్ళేది. హైదరాబాదు, మహబూబ్‌నగర్, షాద్‌నగర్ నాకు తెలిసిన చిన్నప్పటి గ్రామాలు. అంతకుముందు ములుగు, నర్సంపేట తర్వాత వరంగల్, జగిత్యాల ఇలా చాలా ప్రాంతాల్లో ఆరోగ్యకేంద్రాలను స్థాపించడం అనేది మా నాన్నగారే ప్రభుత్వ ఉత్తర్వులతో నిర్వహించేవారు. అప్పటి ఆరోగ్యకేంద్రాలన్నీ ప్రభుత్వ ఆసుపత్రులుగా మారాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిజామాబాదు, శ్రీరామ్ సాగర్ ప్రాంతం, కామారెడ్డి, ఖమ్మం ఇలా తెలంగాణ అన్ని జిల్లాలలో పనిచేయడం జరిగింది. ఆరోగ్యకేంద్రాలలో మా నాన్న విస్తృతంగా పనిచేయడం జరిగింది. ఎక్కువగా తాను పనిచేసింది సిరిసిల్ల, జగిత్యాల ఇవి రెండే.

**మీ విద్య, ఉద్యోగం ఎలా మొదలయ్యాయి?**

సిరిసిల్లలో నా బాల్యం గడిచింది. అక్కడే ప్రాథమిక విద్యను పూర్తిచేసాను. ఆరోజుల్లో కొత్తకొత్తగా స్వాతంత్రం వచ్చిన




రోజులు కాబట్టి చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆనందంగా స్కూలు వాతావరణం ఉండేది. చిన్న చిన్న వాటికి పెద్ద పెద్ద ఉత్సవాలు చేసేది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలో స్టేజి నాటకాలు వేయడం. స్కూల్ డేను మూడు రోజుల వరకు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. 15 ఆగస్టు గాని, 26 జనవరి గాని ఇవి ఎంతో ఉత్సాహంగా జరిగేవి. ఆ రోజుల్లో మా నాన్నకి కులవ్యవస్థ అంటే ఒక వ్యతిరేకత ఉండేది. అందుకు నిదర్శనమే మమ్మల్ని హరిజనవాడ బడిలోనే ఒకటి, రెండు, మూడు తరగతి వరకు చదివించారు.

ఆ తర్వాత మమ్మల్ని గవర్నమెంట్ జేబీఎస్ స్కూల్ సిరిసిల్లలోకి మార్చారు. తర్వాత నాన్నకి జగిత్యాలకి బదిలీ అయ్యింది. అందువల్ల మా కుటుంబం మొత్తం జగిత్యాలకి మారాం. జగిత్యాల వెళ్ళినప్పుడు మల్టీ పర్పస్ హైస్కూల్లో నేను 6 నుండి 9వ తరగతి వరకు పూర్తిచేసుకున్నాను. దాదాపు నా ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్యవరకు కూడా ఇక్కడే జరిగింది. అక్కడ చదువుకున్న వాతావరణం చాలా అద్భుతమైనటువంటిది. ఇప్పటికీ మరిచిపోలేని సన్నివేశాలు అనేకంగా ఉన్నాయి. జగిత్యాల మల్టీపర్పస్ హై స్కూల్లో చేరినప్పుడు ముద్దు రామకృష్ణయ్య గారు హెడ్మాస్టరు. ఈయన ఒక లెజెండ్ ఇంగ్లాండ్‌లో ఎం.ఏ. ఎడ్యుకేషన్ చేసాడు. ఇండియాకు వచ్చిన తర్వాత స్కూలు అధ్యాపకుడిగానే కొనసాగుతానని పట్టుబట్టాడు. స్వాతంత్రం వచ్చిన రోజుల్లో ఇక్కడి స్కూల్లో ఆయన ప్రిన్సిపాల్‌గా చేరి దాదాపు 30 సంవత్సరాలు ఉద్యోగం చేశారు. నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు ఆయన పదవీ విరమణ జగిత్యాలలో జరిగింది.

నా 9వ, తరగతి పూర్తి కాగానే నాన్నకి హైదరాబాద్‌కు బదిలీ అయ్యింది. 1968లో హైదరాబాదు వచ్చిన తర్వాత గోషామహల్ హైస్కూల్లో 10వ తరగతిలో చేరాం. 1969లో తెలంగాణ ప్రత్యేక ఉద్యమం మొదలైంది. దాని కారణంగా అన్ని స్కూళ్ళు బహిష్కరించడం జరిగింది. చదువు లేకుండా దాదాపు జూన్‌లో జరగవలసిన వార్షిక పరీక్షలు నవంబర్ 1969లో పరీక్షలు జరిగాయి. అప్పుడే %జూజ% కి గుర్తింపు వచ్చింది. తర్వాత జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. జూనియర్ కాలేజీల ప్రారంభంతోనే ఉన్నత విద్యకి రెండు విభాగాలు వచ్చాయి. ఎస్ఎస్‌సి, ఇంటర్ ఆ తర్వాత డిగ్రీ ఉంది. మా ఇంటర్మీడియట్ కూడా అతి తక్కువకాలంలో పూర్తిచేశాం. జనవరి 1970లో చేరాం. 1971 నవంబర్‌లో రెండు సంవత్సరాల పరీక్షలు పూర్తయ్యాయి. ఇలా రెండు సంవత్సరాల చదువుని దాదాపు 17 నెలల్లోనే పూర్తి చేశాం. నేను కామర్స్ తీసుకున్నాను. ఈ ఉద్యమ ప్రభావం మా మీద బాగా ఉండింది. సిక్స్ పాయింట్ ఫార్ములా తోని ఆ ఉద్యమాన్ని ఆపడం, ఎన్నికలు రావడం ఇలా అన్ని సంఘటనలు రాజకీయంగా జరుగుతూపోయాయి. ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ లో నేను పాస్ కాలేకపోయాను. సప్లమెంటరీ రాసి పాసయ్యాను. నాకెందుకో చదువు వదిలేసి వ్యవసాయం చేద్దామని కోరిక ఎక్కువగా ఉండేది. నాన్నకేమో చదువుకోవాలని, నాకేమో వ్యవసాయం చేయాలని కోరిక. దేవాలయం ఉంది. భూమి ఉంది. వాటిని చూసుకోవచ్చు అని అనుకొన్నాను. అందుకోసమే కొద్దిరోజులు గుడి అయ్యగారు రంగాచార్యులు దగ్గర పౌరోహిత్యం నేర్చుకుందామని చేరాను.

రెండు సంవత్సరాలు ఆయన దగ్గర పూజావిధానం కొంత నేర్చుకొన్నాను. తర్వాత డిగ్రీలో చేరాను. కానీ ఎన్నడూ కాలేజీకి పోలేదు. ఈవినింగ్ కాలేజ్ డిగ్రీ నుండి స్వామి వివేకానంద డిగ్రీ కాలేజీకి మార్చుకోవడం, ఊళ్లోకి పోయి వ్యవసాయం చేద్దామని బలంగా అనుకోవడం ఇలా అన్నీ చిందరమందరగా జీవితం అయిపోయింది. జీవితం అంటే ఇది కాదు అని నాకు నచ్చచెప్పి, మా బావ ముషీరాబాద్ ఐటిఐలో డిస్టిక్ లెవెల్ ట్రైనింగ్ సెంటర్ (డిటిసి)లో అడ్మిషన్ ఇప్పించారు. అది అక్కరకు రాదు అని చెప్పను కానీ నా జీవితానికి చాలా అక్కరకు వచ్చింది. బ్యాంబు కర్రతో కుర్చీలు, ఆఫీస్ కుర్చీలు అల్లడం సులభంగా నేర్చుకున్నాను. దాంతో కొంత డబ్బులు కూడా సంపాదించుకొన్నాను. ఊరు నుండి వచ్చిన తర్వాత కొంత స్వయం సంపాదనతోనే ఈ వృత్తి విద్య చేసాను. అయినా మా నాన్నకి అసంతృప్తి. డిగ్రీ ముందు పూర్తిచేయి తర్వాత మాట్లాడతా అన్నారు. అప్పుడే ఉస్మానియా యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ ఎక్సెలెంట్ ఎగ్జామ్ పెట్టినారు. ఆ తర్వాత సంవత్సరం 1975 డిసెంబర్లో ఉన్నత విద్య పూర్తిచేసుకున్నాను. ఉస్మానియా పీజీ ఎంట్రన్స్ పరీక్షలు 1975 నుంచి ప్రారంభమయ్యాయి. నేను మూడు ప్రవేశ పరీక్షలు రాశాను. హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్. నాకు హిస్టరీలో మంచి ర్యాంకు వచ్చింది. అందుకే హిస్టరీలో చేరాను.

దీనికి ఒక కారణం ఉంది. మా నాన్న తరచూ హైదరాబాద్ వెళ్లి చదువుకో అంటున్న సందర్భం అది. మా ఊర్లో పరిచయమైనవారిలో లింగారెడ్డి, సుధాకర్ రెడ్డి నా జీవితానికి కొంత నూతన మార్గాన్ని చూపించారు. సుధాకర్ రెడ్డి స్పెషల్ బీఎస్సీ కంప్లీట్ చేసుకుని ఎమ్మెస్ లో జాయిన్ అయ్యారు. "కిషన్ బాగా చదువుతాడు అని మా ఇంట్లో చెప్పి, ఆయన నన్ను తీసుకొని హైదరాబాద్ వచ్చాడు. వాళ్ళ ఫైనల్ పరీక్షల కాలంలో ఉస్మానియా యూనివర్సిటీ బి-హాస్టల్లో ఉన్నాను. వాళ్ళ చదువు, నిరంతర కృషి, చూస్తుంటే నాకు ఎందుకో అట్లాగే చదవాలనిపించింది. సుధాకర్ రెడ్డితోపాటు సూర్య ప్రకాష్ రావు, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్లు ఇలా చాలామంది పరిచయమయ్యారు. వీరంతా పీజీ ఎంఎస్సీ ఫైనల్ ఇయర్ పరీక్షలకి ప్రిపేర్ అవుతున్నారు. వాళ్ళ సాంగత్యం ద్వారా నా జీవితంలో చాలా మార్పు వచ్చింది. అలా వాళ్లను చూస్తూ, వారి మధ్యలో ఉంటూ చదువుకోకుండా ఉంటే ఎలా వీళ్ళ మధ్యలో తిరగడం అని ఆలోచించి కష్టపడి చదవడం అలవర్చుకున్నాను. దాదాపు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయానికి అంకితమయ్యాననుకో. ఎం.ఏ లో ప్రథమస్థానంలో పాసయ్యాను. అప్పటికీ అప్పుడే ఉద్యోగం చేద్దామని ఆలోచన లేదు. ఎం.ఫిల్ చేద్దాం అని ఆలోచన ఉంది.

**మీరు చేసిన పురాతత్వ లోహశాస్త్ర పరిశోధన ప్రయాణం ఎలా సాగింది?**

నా జీవితంలో పురాతత్వ లోహశాస్త్ర పరిశోధన కేవలం ఎం.ఫిల్. పిహెచ్.డి. డిగ్రీలకే పరిమితం కాలేదు. అది నా శ్వాస. ఇప్పటికీ నా అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఇకపోతే, పిజీ తర్వాత పరిశోధన వైపు అడుగులు పడ్డాయి. చరిత్రశాఖలో ఆయుధాలపైన నా పరిశోధన. సాలార్జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఎం.ఎల్.ఏ. నిగం గారి గైడెన్స్ లో ఎంఫిల్ చేయడానికి పూనుకున్నాను. మా శాఖాధ్యక్షులు సరోజిని గారు దీనికి రూపకల్పన చేశారు. కొత్త అంశాల్లో పరిశోధన చేస్తే బాగుంటుందని నన్ను అక్కడికి పంపించారు. ఎం.ఎల్.ఏ. నిగం ఎక్కువ సమయం ఇవ్వకపోవడం వల్ల సబ్మిట్ చేయడం వీలు కాలేదు.

ఆ సమయంలోనే ఒరియంటల్ కళాశాల్లో తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ ఉద్యోగాలకి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 54 ఓరియంటల్ కళాశాలలో ఉద్యోగాలు అపాయింట్ చేసుకోవచ్చని చెప్పింది. దానితోటి నేను శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర ఓరియంటల్ డిగ్రీ కళాశాల, ధర్మపురిలో 02 అగస్టు, 1982న ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరనైతే చేరాను కానీ నాకు అంతవరకు ఉన్నటువంటి సామాజిక అవగాహన వేరు. కళాశాలలో చేరిన తర్వాత ఉన్నటువంటి వాతావరణం వేరు. సుమారు 100 విద్యార్థులు ఉండేవారు.

మరోవైపు ఎం.ఫిల్ సబ్మిషన్ అలాగే ఉండిపోయింది. 1990లో నాకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి లాస్ట్ లెటర్ వచ్చింది. మీరు ఎం.ఫిల్ సబ్మిట్ చేయకపోతే ఇప్పుడైన సబ్మిట్ చేసుకోండి లేదా అడ్మిషన్ రద్దు అవుతుందని ఆ లేఖ సారాంశం. వెంటనే హైదరాబాద్ కు వెళ్ళి హైదరాబాదులో నేను ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ వారిని కలిసి నా పరిస్థితి విన్నవించుకుంటే, వారు పర్యవేక్షకులైన ఎం.ఎల్.ఏ. నిగంగారితో మాట్లాడారు. అప్పుడు వారు 'పూర్తి చేపిస్తాను రమ్మని చెప్పండి' అని చెప్పారు. నేను వెళ్లిన తర్వాత అప్పటికే నేను రాసిన చాప్టర్స్ అన్ని ఇచ్చాను. వెంటనే దీన్ని టైప్ చేసి, మూడురోజుల్లో సమర్పిస్తే నీ ఎం.ఫిల్ పూర్తవుతుంది. లేదంటే నేను విదేశాలకు వెళ్తున్నాను. ఈ మూడు రోజుల్లో కాకపోతే కష్టమవుతుందన్నారు. రాత్రీపగలు కూర్చొని టైప్ చేయించుకొని 200 పేజీల నా ఎం.ఫిల్ డిసర్టేషన్ ఆయనకి సమర్పించాను.

అప్పుడు ఆయన సబ్మిషన్ చేయమన్నారు. ఉస్మానియా యునివర్సిటీలో సబ్మిట్ చేసి వెళ్ళాను. ఆరు నెలల తర్వాత అవార్డు అయింది. తర్వాత పిహెచ్.డి కి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను.

ఎం.ఫిల్, పిహెచ్.డి లు రెండూ చారిత్రక ఆయుధ రకాలు, యుద్ధపద్ధతులపైనే చేసాను. ఇవి రెండు కూడా లోహశాస్త్ర సంబంధమైనవే. పిహెచ్.డి పూర్తికాకముందే రెండు మూడు సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించాను. పిహెచ్.డి 2001లో సబ్మిట్ చేశాను. అప్పుడే నాకు లోహశాస్త్రం, లోహశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలు తెలిసాయి. నా మొదటి పరిశోధన పత్ర శీర్షిక '18, 19 శతాబ్దాలలో ఆంధ్రదేశంలో లోహ ఆయుధాల తయారీ'.



పరిశోధన చేసి నూతన అంశాన్ని పైకి తీసుకురావాలనే అభిలాష ఎక్కువగా ఉండేది. కాని నాకు సరైన దిశా నిర్దేశం లేక కొట్టుమిట్టాడుతూ అక్కడక్కడ పరిశోధన పత్రాలు సబ్మిట్ చేస్తూ వస్తున్నాను. అటువంటి పరిస్థితులలో 2005లో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన పత్ర సమర్పణ చేసాను. ఈ సదస్సులో HOD, R.L. Hangloo గారు అతికష్టంమీద నాకు అవకాశం ఇచ్చారు. దానితోనే విశిష్టమైన మార్పు నా జీవితంలో చోటుచేసుకుంది. ఈ సదస్సులో ఐఐటి కాన్పూర్ మెటలార్జి డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఆర్. బాలసుబ్రమణ్యం ఫిరంగులమీద మాట్లాడారు. నేనేమో 'ఐరన్ ప్రొడక్షన్ సెంటర్స్ ఇన్ సెంట్రల్ డెక్కన్' అనే పేరుతో పత్ర సమర్పణ చేశాను. నా పరిశోధనలో ఆయుధాలు, లోహాల గురించి చెప్పాను. ఆయుధాల తయారీ కేంద్రాల గురించి చెప్పాను. ఈ పరిశోధనకోసం కోనసముద్రంలో తయారయ్యే ఉక్కు కత్తుల ప్రదేశానికి వెళ్లాను. అక్కడ ఒక కత్తిని సేకరించాను. అక్కడ ఉక్కు తయారీ, కత్తి తయారీ గురించి తెలుసుకున్నాను. ఇనుముకి, ఉక్కుకి ఉన్న తేడా అప్పటికీ నాకు నిజంగా తెలియదు. పిహెచ్.డి లో దక్కన్ లోని ఆయుధాలు, ఫిరంగులగురించి పరిశోధన చేశాను. కానీ పరిశోధన కొనసాగించాలని ఆలోచనమాత్రం 2005లో జరిగిన కేంద్రీయ విశ్వవిద్యాలయం సెమినార్ లోనే కలిగింది. ఈ సదస్సు ఒకరకంగా నా భవిష్యత్తు ప్రణాళికకు కావాల్సిన భూమికను ఇచ్చింది.

ఆర్. బాలసుబ్రమణ్యం గారిని అందరూ బాల అంటారు. ఆయన కూడా బాల అని పిలవడానికి ప్రోత్సహిస్తాడు. 'నేను కూడా ఫిరంగులమీద పరిశోధన చేశాను' అని అనగానే ఆయన ఆశ్చర్యపోయాడు. వెంటనే ఐఐటికి వచ్చి నీవు చదివిన ఫిరంగులు, కోటలు గురించి మాట్లాడాలన్నారు. అదే సంవత్సరం ఐఐటి కాన్పూర్‌లో మాట్లాడడం జరిగింది. మాములు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న నన్ను ఐఐటిలో ఉపన్యాసానికి పిలవడం అనేది ఆయనకు పరిశోధనపట్ల ఉన్న అభిరుచిని తెలియజేస్తుంది. మొత్తం మీద ఆయనతో కలిసి మొట్టమొదటిసారిగా ఒక ప్రాజెక్టు చేయడానికి ముందుకు వచ్చాను. `Iron Cannons in Deccan Forts and Rust Analysis అనే పరిశోధన ప్రాజెక్టుని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీవారికి సబ్మిట్ చేసాం. దానికి ప్రాథమికంగా మాట్లాడడానికి రమ్మన్నారు. బాల వెళ్లి మాట్లాడిన తర్వాత మా పరిశోధన ప్రాజెక్టుకి అనుమతి లభించింది. 'ప్రాజెక్టు వచ్చింది కాని క్షేత్రపర్యటనలో చేసే పనులన్నీ (గాడిద పని) చేస్తానంటేనే నేను ఈ ప్రాజెక్టు కంటిన్యూ చేస్తాను' అన్నారు. 'సరే' అని ఒప్పుకున్నాను. మొదటిసారిగా ప్రాజెక్ట్ తీసుకొని పరిశోధనని ప్రారంభించాను. అదే సమయంలో ఇంకొక మాట అన్నారు. jai ! You are sitting on the hub of ancient Iron Industry ఇన్వెస్టిగేషన్ ఎందుకు చేయకూడదు అంటూ తెలంగాణ Iron ఉత్పత్తికి ఎంతో ప్రాముఖ్యత కల్గిందన్నారు. అనగానే నాకు తెలియదు అని చెప్పాను. తెలుసుకోవాలి తెలుసుకోవడమే పరిశోధన అని చెప్పారు.

**మీరు ఇనుము, ఉక్కుపై ప్రత్యేకమైన పరిశోధన సీరియస్ గా ఎప్పటి నుండి మొదలుపెట్టారు?**

2005 అక్టోబర్ నెలలో మొదటిసారిగా ఇనుము, ఉక్కు పరిశోధనకి ఉపక్రమించాను. బాల గారితో 'చిట్టెము, లోహం, లోహపు ముద్దలు, వాటిని కరిగించిన స్థలాలు, బట్టి (Furnace) నిర్మాణం, బట్టి కాల్చడం మొదలైనవి నాకు ఏ విశేషాలు తెలియదన్నాను'. దానికి వారు కాలక్రమంలో అన్ని తెలుసుకుంటావు. నిజంగానే నీకు ఆసక్తి ఉంటే చెయ్యి అన్నారు. అక్టోబర్ నుండి ఈ పని మొదలైంది. 2006 నుండి 2008

సుమారు 26 నెలలు ఫిరంగుల మీద ప్రాజెక్టు కంప్లీట్ చేశాను. ఐరన్ ఇండస్ట్రీ మీద ఇన్వెస్టిగేషన్ ప్రారంభించాను. ఇది నా సొంత డబ్బులతోని ప్రారంభించిన మహా యజ్ఞం. అప్పుడప్పుడే తెలంగాణ ఉద్యమం ప్రారంభమవుతుంది. 2001లో కేసీఆర్ తెలంగాణ సాధించి తీరాలి లేకపోతే మన బతుకులు ఇలాగే ఆరిపోతాయి అని చెప్పేవారు. తెలంగాణ చారిత్రక ఔన్నత్యాన్ని చాటాలని దృఢసంకల్పంతోని చాలా పుస్తకాలు, పరిశోధన పత్రాల్ని చదివి చరిత్రలో తెలంగాణకు ఉన్న గొప్పతనాన్ని తెలుసుకున్నాను. ఆ మార్గంలోనే ఉత్తర తెలంగాణ ఇనుము, ఉక్కు పరిశోధన ప్రారంభించాను. ఆదిలాబాద్, నిజామాబాదు, వరంగల్, మెదక్ జిల్లాలే కాకుండా పరిశోధనకోసం తెలంగాణలో సుమారు 4000 గ్రామాలు తిరిగి అనేక విశేషాలు సేకరించాను. దానికి ప్రతి క్షణం ఏ సందేహము వచ్చినా, బాలగారికి ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకునేవాడిని. క్షేత్రపర్యటనలో తీసిన ఫోటోలు పంపించి వాటి గురించి మాట్లాడితే అది చిట్టెము, ఇనుము, ఉక్కు అనేటువంటి విశేషాలు చెప్పేవారు.

**మీరు క్షేత్ర పర్యటనకు వెళ్ళే సమయంలో ఎలాంటి సరంజామాతో సిద్ధమయ్యేవారు?**

ఐరన్ ఇండస్ట్రీ మీద నా సొంత ప్రాజెక్టు ఖర్చులతోని పరిశోధన చేశాను. నేను పనిచేస్తున్న కళాశాల సాయంకాలం 4 నుండి 9 గంటల వరకు ఉండేది. దినమంతా సమయం ఉంటుంది కాబట్టి నాకు ద్విచక్ర వాహనం ఉండేది. మాతోపాటు క్షేత్రపర్యటనకు ఒక బ్యాగులో చిన్న సుత్తి, తాపీ, స్కేలు, కారు కొన్న తర్వాత రేంజింగ్ రాడులు, తవ్వడానికి చిన్న గడ్డపార, కెమెరా ఇలా యుద్ధానికి వెళ్తున్న వీరుడిలాగా వెళ్ళేవాణ్ణి. ఉదయం 6 గంటలకు బయలుదేరి ఒక మార్గంలో సాధ్యమైనటువంటి గ్రామాలు తిరిగి మెటీరియల్స్ అన్ని సేకరించుకొని వచ్చేవాళ్ళం. 2007లో చిన్న కారు కొనుక్కున్నాను. కారులోనే ఈస్టర్ కర్ణాటక, వెస్టర్న్ కర్ణాటక వెళ్లాను. అక్కడ ఉన్న ఫిరంగుల లిస్టు ఫోటోలు తీసుకొని వచ్చేవాడిని. ఉదయాన్నే బైక్, కార్ ఏదో ఒకటి తీసుకొని ఏదో ఒక ప్రాంతానికి వెళ్లాలి. అక్కడ ఉన్నటువంటి ఇనుము, ఉక్కు పరిశ్రమల గురించి తెలుసుకోవాలి. అలాగే ఇనుము, ఉక్కు పనిచేసే విశ్వకర్మ కుటుంబాలను కలిసి వాటి విశేషాలు రాసుకునేవాణ్ణి. అంతేగాక వారి సాంస్కృతిక జీవన విధానం గురించి కూడా అధ్యయనం చేసాను. ఇది 2005 నుంచి 2018 వరకు దాదాపు 15 సంవత్సరాలు నిరంతరం సాగింది.

ఏ ఒక్క సెలవు కూడా నా సొంత అవసరాలకు సొంత పండుగలకోసం వాడుకోలేదు. పరిశోధనకు మాత్రమే ప్రాముఖ్యమిచ్చి తిరిగాను. నాతోపాటు మా ఇంట్లో ఎప్పుడూ సుమారు 10 మంది విద్యార్థులు చదువుకునేవారు. వీరిలో ఉదయం 6 గంటలలోపు ఎవరు రెడీగా ఉంటే వారిని క్షేత్రపర్యటనకు తీసుకవెళ్ళేవాణ్ణి. ఇలా మా ఇంట్లో ఉండి చదువుకున్న విద్యార్థులకు పురాతత్వ లోహశాస్త్రం గురించి ప్రాథమిక అవగాహన ఉంది. కానీ తెలుగు కళాశాల కాబట్టి ఎక్కువగా తెలుగు సాహిత్య అధ్యయనానికి ఉత్సాహం చూపెట్టేవారు. కారణం చరిత్రకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లేకపోవడమే కావచ్చు.

**మీ పరిశోధన తెలంగాణ చరిత్ర నిర్మాణానికి ఎటువంటి దోహదం చేసింది?**

తెలంగాణ గురించి విశ్వవ్యాప్తంగా చెప్పాలని చాలా కృషిచేసాను. ప్రత్యేక తెలంగాణలో ఏమున్నది? తెలంగాణ ప్రజలకు ఏమీ తెలియదన్న సందర్భాలు ఉన్నాయి. మా పరిశోధనలో పరిశ్రమలు, మన పూర్వీకులు ఎంత గొప్పవారో చెప్పడం జరిగింది.

ముఖ్యంగా ప్రపంచాన్ని శాసించి ఒక నూతన సామాజిక విప్లవాన్ని, సాంస్కృత విప్లవాన్ని తెచ్చి రెండవ నాగరికతని ప్రవేశపెట్టింది లోహం. ఆ లోహం తెలంగాణలోనే తయారయిందని ఘంటాపథంగా చెప్పగలిగాను. ఇక్కడి నుండి ఇనుము, ఉక్కు పరిశ్రమ ప్రపంచమంతా విస్తృతంగా వ్యాప్తి చెందిందని చాటగల్గాను. ఇక్కడ జరిగిన ఉక్కు ఉత్పత్తి ప్రపంచంలో ఎక్కడా జరగలేదని నిరూపించాలని ఆత్రుతతో 2008లో పుస్తక రచనకి పూనుకున్నాను. అప్పటివరకే 15 పరిశోధన పత్రాలు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీవారి మేగజైన్లో ప్రచురించాను. వాటన్నింటినీ ఉటంకిస్తూ 2009లో పుస్తకాన్ని తెలంగాణ జాగృతి తరపున ముద్రించాను. ఈ పుస్తకానికి శ్రీమతి కల్వకుంట్ల కవిత ఆర్థికసాయం చేసారు.

ఆ సమయంలోనే లండన్ లో జరుగుతున్నటువంటి 'వరల్డ్ ఆఫ్ ఐరన్ కాన్ఫరెన్స్' సదస్సుకి నా పేపర్ సెలక్ట్ అయింది. లండన్ వెళ్లి రావడానికి ఆర్థిక సాయం, దారి ఖర్చులు కవితగారే ఇచ్చారు. తిరిగిరాగానే అమెరికా చికాగో నగరంలో ఇనుము, ఉక్కు పరిశ్రమ భౌతిక ఆనవాళ్ల గురించి నేను ఒక పరిశోధన పత్రాన్ని అక్కడ సౌత్ ఏషియన్ స్టడీస్ లో సమర్పించాను. ఈ రెండు దేశాల పర్యటన నాకు ఉత్సాహం, నూతన ఆలోచనలు కలిగించింది. ఇంగ్లాండులో ఎక్సిటర్ విశ్వవిద్యాలయం పరిశోధనకు తీసుకున్న (UKIERI) "యునైటెడ్ కింగ్డమ్ ఇండియా ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఇన్సియేటివ్"

ప్రాజెక్ట్ లో ఎక్సిటర్ యూనివర్సిటీ పరిశోధకురాలు ప్రొఫెసర్ జిల్ జులెఫ్, ప్రొఫెసర్ శారద శ్రీనివాసన్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ బెంగళూరువారు పరిచయమయ్యారు. వారిద్దరూ కలిసి ఈ ప్రాజెక్టు చేయడానికి సంకల్పించారు. అప్పుడే తెలంగాణ ప్రాంతాన్ని పరిశోధన పత్రంద్వారా వరల్డ్ ఆఫ్ ఐరన్ కాన్ఫరెన్స్‌లో ప్రజెంట్ చేశాను. వారు చాలా ఆకర్షతులై జిల్ 'మాతోపాటు ప్రాజెక్టులో చేరమని' అడిగారు. నన్ను కో-ఇన్వెస్టిగేటర్ గా అపాయింట్ చేస్తే నేను చేస్తానని చెప్పాను.

దురదృష్టవశాత్తు 09 డిసెంబర్, 2009నాడు నా మిత్రుడు, నా శ్రేయోభిలాషి పరిశోధనకు కారకులైనటువంటి ప్రొఫెసర్ ఆర్. బాలసుబ్రమణ్యంగారు ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళారు. ఇది నా జీవితంలో అత్యంత బాధాకరమైనటువంటి సంఘటన. నేను ఒక నిర్దిష్టమైనటువంటి పరిశోధనస్థాయికి ఎదగడానికి కారణమైన బాలసుబ్రహ్మణ్యం గారు పోవడం అనేది నా జీవితంలో ఒక పెద్ద విఘాతమని చెప్పుకుంటాను. ఆయన చూపిన అభిమానం ఎంతో గొప్పది. నిరంతరం పరిశోధన చేయాలని, విశ్రమించవద్దని సూచించిన మార్గం నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. దాదాపు ప్రతిరోజూ అర్ధరాత్రి ఫోన్ చేసి మాట్లాడేవారు. ఒకసారి నేను నిద్రపోవాలనుకున్న సమయంలో ఆయన ఫోన్ చేసి పరిశోధకులు పడుకునే సమయం ఇదేనా అని గద్దించేంత పనిచేసారు. పరిశోధకులు ఎప్పుడూ మూడు గంటల తర్వాతనే పడుకోవాలి అన్నారు.

**కనుమరుగవుతున్న 'కమ్మరి' సంస్కృతి గురించి మీరు అధ్యయనంలో కనుకొన్న విషయాలు చెప్పండి?**

లోహంతో ముడిపడి ఉన్న తెలంగాణా ప్రాంత ప్రజల సంబంధ బాంధవ్యాలని వీరి సాంస్కృతిక మూలాల్లో చూడవచ్చు. ప్రతి వృత్తివారి ప్రత్యేక సాంస్కృతిక జీవనం, ఆచారాలు, అలవాట్లు, దేవీదేవతలు, పూజావ్రతాలతో ముడిపడి ఉంది. తెలంగాణ ప్రాంతంలో విశ్వకర్మ కులస్తుల సంస్కృతీసాంప్రదాయాల ద్వారా ఇనుము, ఉక్కు తయారీకి వారికి ఉన్న సంబంధాన్ని గమనించవచ్చు. లోహంపై వారు సాధించిన విజయాల్ని శాశ్వతంగా నిలుపుకున్నారు. వీరికి సంబంధించిన ఆధారాల్లో ప్రధానమైంది ప్రత్యేకమైన దేవీ దేవతలు, పూజావిధానం, సాంస్కృతిక జీవన విధానం.

ప్రపంచంలో మొట్టమొదటి సాంకేతిక విజ్ఞానాన్ని సాధించుకున్నవారు విశ్వకర్మ కులస్తులు అనేది నా అభిప్రాయం. మానవ జీవితానికి అవసరమైన ఆయుధాలు, పనిముట్లు, వంటపాత్రలు, నివాస గృహాలు ఆభరణాలు, దేవాలయాలు, అందమైన విగ్రహాలతో కూడిన శిల్ప నైపుణ్యం ఇచ్చింది వీరే. వీరి సంస్కృతికి సంబంధించిన ప్రముఖమైన మతాచారం మమ్మాయి దేవత పూజ. విశ్వకర్మ కులస్తులంతా ఒక పటిష్టమైన సాంకేతిక శక్తిగా ఏర్పడి లోహ ఉత్పత్తికి, వస్తూత్పత్తికి దేశ ఆర్థిక పటిష్టతకు, సమాజ పరిరక్షణకు అవసరమైన ఆయుధాల్ని తయారుచేసి అతి గౌరవప్రదమైన స్థానంలో ఉండేవారు. విశ్వకర్మ కులస్తులని పంచాణం లేదా పంచానన్నంవారని అంటారు. 'విశ్వబ్రాహ్మణులు అనేవారు విశ్వకర్మలు, విశ్వబ్రాహ్మలుగా పిలవబడుతున్నారు. విశ్వకర్మ పంచముఖ బ్రహ్మ. "విశ్వకర్మకు ఐదు ముఖాలు ఉంటాయి. ఇవి విశ్వకర్మ కులస్తుల్ని పంచాలి, పంచ బ్రాహ్మల ఐదు వృత్తుల్ని సూచిస్తాయి. 18వ శతాబ్దం వరకు వృత్తిపరంగా వీరిని ప్రత్యేకమైన ఐదు కులాలుగానే గుర్తించారు.

ఇంతకుముందు చర్చించినట్టు ఇనుము కరిగించేవారికి ఇనుము, ఉక్కుతో పనిచేసేవారికి మధ్యగల తేడాను ప్రత్యేకంగా గుర్తించాలి. ముద్ద ఇనుము తయారీదారులు ముడి ఇనుము సేకరణ, బొగ్గుతయారీ, బట్టి నిర్మాణం, ఇనుము కరిగించడం కడ్డీలుగా సాగదీయడం వంటివి చేసేవారు. ఇక ఇనుప వస్తువుల తయారీ ఉక్కు వస్తువుల తయారీని గ్రామ కమ్మర్ల నిర్వహించేవారు. ముద్ద కమ్మర్లు ఎక్కడైతే వారికి కావలసిన ముడి లోహం లభిస్తుందో ఆ ప్రదేశాల్లోనే పని చేపడతారు. సాధారణంగా ఈ పని గ్రామాలకు దూరంగా ఉండి నిరంతరంగా తీరిక లేకుండా ఇనుము ఉత్పత్తి చేయడంవల్ల వీరి సేవలు అంతగా గుర్తింపు పొందలేదు. కమ్మరివారు గ్రామాల్లోనూ, నగరాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలకు చేరువగా ఉండి సమాజానికి అవసరమైన అనేక పనిముట్లను తయారుచేసి, ప్రజలకు అందించడం వల్ల వీరికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభించింది.

ఈ ఐదు కులాల్ని సమగ్రంగా విశ్వకర్మలు అని అంటారు. తెలంగాణాలోని అనేక గ్రామాల్లో విశ్వకర్మల జీవన సంస్కృతి విశిష్టమైనది. ముఖ్యంగా ఉక్కు తయారయ్యే అన్ని గ్రామాల్లో మమ్మాయి దేవత ఆలయం కనపడుతుంది. ఈ దేవత లోహపు పనివారి దేవత. మమ్మాయి దేవతకి గుళ్ళు కట్టి నిత్యపూజలు జరిపి, పండుగలు, ఉత్సవాలు నిర్వహించి వారి ప్రత్యేకతని చాటుకుంటారు.

**'మమ్మాయి దేవతనే ఉక్కు దేవత' అని మీరు చేసిన ప్రతిపాదన విశేషాలేంటి?**

మమ్మాయి దేవతనే ఉక్కు దేవతగా చెప్పడానికి బలమైన ఆధారంగా ఈ దేవత చేతిలో ఉక్కు ముద్ద ఉండడం గమనించదగిన విషయం. కాని నిఘంటువులలో మమ్మాయి

అంటే ఒక 'లేహ్య' విశేషం అని బ్రౌన్, సూర్యరాయాంధ్ర నిఘంటువు, శబ్ద రత్నాకరం మొదలైన నిఘంటువులలో తెలుపబడింది. ఈ నిఘంటువులన్నీ కూడా కోస్తాంధ్ర, రాయలసీమవారిచే కూర్చబడటంచేత తెలంగాణ ప్రాంతపు వాడుక పదాలకి ఇందులో తావులేదు. అందువల్ల మమ్మాయి అనే పదాన్ని ఈ ప్రాంతంలో భిన్నార్థాల్లో వాడటం కనిపిస్తుంది. మమ్మాయి కమ్మరి పనివారి దేవత, ప్రస్తుతకాలంలో విశ్వకర్మ కులాల దేవత. మమ్మాయి అనే పదంలో మమ్మ లేదా అమ్మా అంటే తల్లి అని అర్థం. 'అయి' లేదా 'అయస్' అంటే ఇనుము. ప్రాకృత, సంస్కృత భాషల్లో 'అయిస్' అంటే ఇనుమే. 'మమ్మాయి' లోహదేవత. ఈ దేవతకి పూజలు చేసి ఉక్కు తయారి ప్రారంభించేవారని తెలుస్తుంది. ఇక్కడి గ్రామీణ భాషలో 'మమ్మాయి వండుత' అనే మాట సాధారణంగా ఎక్కువగా మరిగిస్తాను, ఉడికిస్తాను అనే అర్థంలో వాడుతారు. ఎవరిమీదనైన కోపం వచ్చినప్పుడు "మమ్మాయి వండుత చూడు" అని అనడం ఈ ప్రాంతంలో వినిపిస్తుంది. కాచు, మరిగించు, ఉడికించు అనే అర్థాలు ఇందులో 'ధ్వనిస్తున్నాయి. ముఖ్యంగా ఈ దేవాలయాలన్నీ ఉక్కు తయారైన గ్రామాల్లోనే ఉన్నాయి. ఉక్కు ఉగ్గు గురించి ఇంతకుముందే తెలిపాను. 'అయో' లేదా 'అయ' పదాలకు పాలీ లేదా ప్రాకృత భాషల్లో ఇనుము అని అర్థం. 'అయ' అంటే బంగారంతో కలిసిన ఐదు లోహాల మిశ్రమం అని అవి 'అయో' ఇనుము, 'లోహం' రాగి, "తిపుటిన్, 'సీసం' సీసము, 'సజ్జ' వెండి అని తెలుపబడింది.

**తెలంగాణలో మమ్మాయి దేవాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?**

దాదాపు తెలంగాణవ్యాప్తంగానూ మమ్మాయి దేవాలయాలున్నాయి. ఉప్పులూరు, కమ్మరిపల్లి మండలం, ఇబ్రహీంపట్నంలోను, చిన్నకల్వల, కల్వల మమ్మాయి దేవాలయం, కరీంనగర్ పెద్దకల్వల గ్రామాల మధ్యలో, నిజామబాద్ జిల్లాలో బాల్కొండ, ఉప్పులూరు, కోనాపురం, కోనసముందర్ గ్రామాల్లో ఉన్నాయి. ప్రధాన ఉక్కు ఉత్పత్తి కేంద్రమైన కోనసముద్రంలో రెండు చిన్న మమ్మాయి, పెద్ద మమ్మాయి దేవాలయాలు ఉండటం విశేషం. కల్వల గ్రామాల మధ్య హుసేనియా వాగు ఒడ్డున 16 స్తంభాల మమ్మాయి దేవాలయం తొలి చాళుక్య దేవాలయ శిల్పరీతిలో నిర్మించబడింది. ఈ దేవాలయానికి 'మహామాయి' దేవాలయం అని పేరు పెట్టారు. ఈ దేవాలయ పూజారి కంసాలి కులానికి చెందినవాడు. 'మహామాయి' 'దుర్గ' దేవతగా ప్రచారం చేసి సాంప్రదాయ హిందూ దేవతల ప్రక్కన చేర్చడం జరిగింది. కానీ ఇక్కడ జరిగే పండుగలు, ఉత్సవాలు, పూజలు అన్ని విశ్వకర్మ కుల సంప్రదాయంలోనే జరుగుతాయి. ప్రధానంగా ఈ మమ్మాయి ఆలయాల్లో ఉత్సవాలు తెలుగు సంవత్సరాది ఉగాది నుండి జరుపుతారు. అంటే చైత్ర శుద్ధ పాడ్యమి నుండి చైత్ర శుద్ధ సప్తమి వరకు గానీ ఏకాదశి వరకు గానీ జరుపుతారు.

**మీ పరిశోధనకు ఆదర్శమూర్తులు, మార్గదర్శకులు ఎవరు?**

ఈ పరిశోధనరంగంలో పనిచేయాలనే సంకల్పానికి ప్రధాన కారకుడు ఏ.ఎల్. భాష్యం గారు. వీరు 1978లో హైదరాబాదులో జరిగిన చరిత్ర కాంగ్రెస్ కి వచ్చారు. విదేశీ అతిథుల బాధ్యత నాకు ఇచ్చారు. వీరిని కలిసిన తర్వాత చరిత్రపట్ల చాలా ప్రభావితుణ్ణి అయ్యాను. ఆయనతోని సన్నిహితంగా ఉంటూ ఆయన్ని చాలా ప్రాంతాలకు తీసుకెళ్ళాను. ఆయన నన్ను ప్రధానమైన మిత్రుడిగా భావించారు. 1978 నుండి దాదాపు 1986లో భాష్యం గారు చనిపోయే వరకు ప్రతి సంవత్సరం ఆయన గ్రీటింగ్స్ పంపిస్తూనే ఉన్నారు. ఇంకొక ముఖ్య సంఘటన ఏంటంటే, 1979లో విశాఖపట్నం ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కి వచ్చినప్పుడు వారు హైదరాబాద్ కూడా వచ్చారు. అప్పుడూ ఆయన్ని కలిసాను.

అప్పుడు ఆయన నన్ను 'నువ్వు గొప్ప పరిశోధకుడివి అవుతావని' ఆశీర్వదించారు. నేను అప్పుడు నవ్వుకున్నాను. నాకు ఇంగ్లీషు రాదు. మరి ఏ భాష రాదు. నేను పరిశోధకుడిని అవడం అనేది వింత మాటగా అనిపించింది. నువ్వు చేస్తావు అంటూ నమ్మకంగా పలికారు. ఆయన తర్వాత విశేషమైనటువంటి ప్రభావాన్ని చూపెట్టినది ప్రొఫెసర్ ఆర్. బాలసుబ్రమణ్యం గారు. ఇంతకుముందే బాల గురించి చెప్పాను. ఇకపోతే మూడవ వ్యక్తి కాల్పకం డైరెక్టర్ బల్దేవ్ రాజ్. ఆయన ఎవరో నాకు తెలియదు. ఆయనను ఎప్పుడు చూడలేదు. 2009లో బిగినింగ్ అండ్ యూజస్ మెటల్స్ (BHUMA) కాన్ఫరెన్స్ కి ఆయన వచ్చారు. నేను అందులో ఒక పత్ర సమర్పణ చేశాను. అక్కడ ఆయన పరిచయం అయ్యారు. 'ఇంగ్లాండ్ కి మీరు ఒక్కరే వెళ్లి వచ్చారు. కాబట్టి మీ బోర్డింగ్ పాసులు, దారి ఖర్చుల టికెట్స్ పంపిస్తే, నేను పనిచేసే సంస్థ తరఫున మీకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించగలను' అని ఆయన అన్నారు. ఇండియన్ నేషనల్ అకాడమీ ఇంజనీర్స్ అనే ఒక సంస్థలో ఆయన ప్రెసిడెంట్ గా ఉన్నారు. దాని నుండి నాకు 30 వేల రూపాయలు వచ్చాయి. ఆ చెక్ మీద సంతకం చేసిన తెల్లవారే ఆయన నాతో ఫోన్లో మాట్లాడి, 'నీవు చాలా గొప్ప పని చేస్తున్నావ్. మేము మీకు చాలా సింపుల్ అమౌంట్ ఇస్తున్నాం. ప్రయాణ ఖర్చులు తప్ప ఏమీ ఇవ్వలేకపోతున్నాం. ఇకనుంచి నీవు ఎక్కడికి వెళ్ళినా, మా

ఐ.ఎన్.ఏ. తరపున నీకు డబ్బులు ఇప్పిస్తానని' మాట ఇచ్చారు. నా పరిశోధన ప్రయాణంలో నాకు ఈ ముగ్గురే మార్గదర్శకులుగా ఉన్నారు. మొదటి పరిశోధనకి ఆదర్శమూర్తి అయిన సుధాకర్ రెడ్డి, హెచ్.ఎస్.వి. సూర్య ప్రకాష్ రావు పాండిచ్చేరి యూనివర్సిటీలో పనిచేసే కెమిస్ట్రీ ప్రొఫెసర్ గా రిటైర్డ్ అయ్యారు. సుధాకర్ రెడ్డి మిచిగాన్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్ గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వీరిద్దరూ నాకు ఆదర్శమూర్తులు.

**మీరు తెలంగాణ నేపథ్యంలో మీరు చేసిన పరిశోధనలు, ప్రాజెక్టుల వివరాలు చెప్పండి**

నేను UKIRI ప్రాజెక్టును ధర్మపురి కేంద్రంగా చేసాను. దీంట్లో ముఖ్యంగా ఒక ఆరుగురు బ్రిటిష్ వాళ్ళని, ఆరుగురు బెంగళూరువాళ్ళని, ఆరుగురు మా విద్యార్థులను కలుపుకొని 45 రోజులపాటు తెలంగాణవ్యాప్తంగా క్షేత్ర పరిశోధన చేసాం. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఈ ప్రాంతాల్లో క్షేత్ర పరిశోధన చేసాం. సేకరించిన సమాచారంతో ఒక్కో విద్యార్థి పూర్తి పరిశోధన చేసి, పిహెచ్.డి సంపాదించుకున్నారు. ఒకరు ఎతినోగ్రఫీ స్టడీ ద్వారా ఇక్కడ సాంస్కృతిక జీవన విధానంపై, మరొకరు పరిశ్రమలో పనిచేస్తున్నవారి జీవన విధానంపై రెండు పరిశోధనలు జరిగాయి. ఈ రెండూ తెలంగాణకు పురాతత్వ లోహ అధ్యయనానికి చాలా దోహదం చేశాయి. మేఘనా దేశాయి అనే ముంబాయి పరిశోధకురాలు సైప్రస్ దేశంలో పిహెచ్.డి కి తెలంగాణ ఉక్కు పరిశ్రమనే తీసుకున్నారు. నేను ఆమెకు ఇచ్చిన గైడెన్స్ తో ఇప్పుడు తన పరిశోధన పూర్తిచేసింది. సైప్రస్ ఇన్స్టిట్యూటాస్ మెటల్స్ డైరెక్టర్ తిలో రెహమాన్ గారు తనకు పర్యవేక్షకులుగా ఉండి, తెలంగాణ ప్రాంతానికి 2020-2024 మధ్యకాలంలో రెండుసార్లు సందర్శించి, ఉక్కు పరిశ్రమ అనవాల్లను పరిశీలించారు. పరిశోధకులకు, ఈ రంగంలో తెలంగాణ ఒక గని లాంటిది. అనేక శాసనాలు, దేవాలయాలు, రాతప్రతులు, తాళపత్ర గ్రంథాలు ఒకటేమిటి చాలా ఉన్నాయి.

ఇంకా చెప్పాలంటే తెలంగాణలో అన్నిరంగాల్లో సమగ్ర కృషి జరగలేదు. నేను రెండోసారి ఎక్సీటర్ విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు లండన్ లైబ్రరీలో వర్క్ చేసుకున్నాను. చాలా విషయాలు తెలిశాయి. అక్కడినుంచి పరిశోధనకు సంబంధించిన తెచుకున్న అనేక పుస్తకాలు, పరిశోధన పత్రాలు, నా పరిశోధనలకు, ఉపన్యాసాలకి ఎంతో ఉపయోగపడ్డాయి. అంతేగాక నాకు నాలుగు సంవత్సరాల కాలం పాటు విసిటింగ్ ప్రొఫెసర్ గా అవకాశం ఇచ్చారు. అలాగే ఇండియన్ నేషనల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్, బెంగళూరులో విసిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేశాను. ఈ అవకాశాలన్నీ కూడా నా విస్తృతమైన క్షేత్ర పరిశోధన వల్లనే నాకు లభించాయి.

ఇనుము, ఉక్కు పరిశోధన ప్రాజెక్టుని నా సొంత డబ్బులతోనే చేసినాను. కొంత ఫిరంగుల ప్రాజెక్టు చేశాను. కొంత ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీవారు ఇచ్చారు. తెలుగులో రెండు, ఇంగ్లీషులో మూడు పుస్తకాలు రాశాను. 'ఢిల్లీ ఇనుప స్తంభం కథ' గ్రంథాన్ని ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేశాను. 'తెలంగాణలో ఇనుము, ఉక్కు పరిశ్రమల ఆనవాల్లు' రాసాను. ఖడ్గలక్షణ శిరోమణి గ్రంథాన్ని ఇంగ్లీషులోకి అనువదించాను. ఆ తర్వాత 'సైన్స్ ఆఫ్ స్వోర్డ్' శాస్త్రీయ పద్ధతిలో కత్తి ఎలా తయారు చేస్తారు? అనే పుస్తకం రాశాను. ఇది సాలార్జంగ్ మ్యూజియంలోని ఆయుధాలను ఉటంకిస్తూ ఆ పుస్తకం పూర్తిచేసాను. నా ప్రధానమైన ప్రాజెక్టు ఉక్కు పరిశ్రమ మీద Wootz The Forggton Metal Craft Daccan. ప్రస్తుతం ఫిరంగుల మీద రెండు సంపుటాలు తయారైనాయి. త్వరలో ముద్రణకు వెళుతున్నాయి.

**మీ పరిశోధన తెలంగాణ ఉద్యమంలో ఎలాంటి పాత్రను పోషించింది?**

నా పరిశోధన ఉద్యమానికి ఏరకంగా దోహదం చేసిందనే విషయాన్ని ఖచ్చితంగా నేను చెప్పలేను. కానీ శ్రీకృష్ణ కమిషన్ వచ్చినప్పుడు నేను ప్రచురించిన తొలి పుస్తకాన్ని వారికి అందించాను. అంతేకాకుండా చాలా ప్రాంతాల్లో జరిగిన సభల్లో తెలంగాణ వైశిష్ట్యాన్ని వివరించినప్పుడు నా పరిశోధనల గురించి, ఈ ప్రాంతపు ఔన్నత్యాన్ని గురించి చెప్పాను. తెలంగాణ నేపథ్యంలో చేసిన ప్రధాన పరిశోధనలు ఇనుము, ఉక్కు పరిశ్రమ, ఆయుధ పరిశ్రమ, కోటల నిర్మాణం, గడీల నిర్మాణం గురించి పరిశోధన చేసాను. అంతేగాక ప్రాచీనకాలంలో ఉన్న వైద్యులు, మేధావులు వారు చేసిన ప్రత్యేకమైన కాంట్రిబ్యూషన్ గురించి తెలపడం జరిగింది. దిజ్ఞాగుడు, బావరి, కొండన్న మొదలైన బౌద్ధ మేధావులు ఈ ప్రాంతంలో బౌద్ధ, జైన మేధావులున్నారు. ఈ రెండు మతాలు ఈ ప్రాంతానికి విశేషమైన ప్రాచుర్యాన్ని కలుగజేస్తున్నాయి. ప్రధానంగా ఇక్కడి కోటల నిర్మాణం అతి ప్రాచీనకాలం నుండి ప్రారంభమైంది. అది ఎలా అభివృద్ధి చెందింది, ఎలా విస్తరించి ఉంది అనే విషయాలు రాబోయే నా పరిశోధన పత్రాల్లో వివరించబోతున్నాను. దక్కన్ ఫిరంగులు, ఫిరంగి నిర్మాణాలకు సంబంధించిన ఫౌండ్రీలు వాటి గురించి తెలపడం జరగబోతుంది.

**మీ జీవితంలో మరిచిపోలేని క్షేత్ర పర్యటన అనుభవం ఏంటంటే మీరు ఏం చెబుతారు?**

క్షేత్రపర్యటనలో అడవులు, గుట్టలు, కోటలు, కొండలు, నదులు మొదలైన ప్రదేశాల్లో విస్తృతంగా పర్యటించడం కొన్ని సాహసాలు కూడా చేయాల్సి వచ్చేది. ఫిరంగుల క్షేత్రపర్యటనకు వెళ్ళినప్పుడు మహారాష్ట్రలో ఒక వింత అనుభవం ఎదురైంది. మేము నాసిక్ వెళ్లాం. త్రయంబకేశ్వర దర్శనం చేసుకోకుండా సటనాకు వెళ్లి, అక్కడికి సమీపంలో ఉన్న మల్హేర్ కోటకు వెళ్ళాం. అక్కడ మార్గం సరిగా దొరక్క అడవిలో, కొండలమధ్య చిక్కుబడిపోయాం. నేను, రమేష్ (ప్రస్తుతం ఈ ఇంటర్వ్యూ చేస్తున్నతను) ఇద్దరమే ఉన్నాం. తర్వాత మాకు అక్కడ ఒక బిల్ ట్రైబ్ కి చెందిన గణేష్ అనే అబ్బాయి ఎదురైనాడు. ఆయన్ని హిందీలో కొన్ని ప్రశ్నలు అడిగి, మా సమస్య చెప్పి మాతో రమ్మన్నాం. ఆయనకు డబ్బులు ఇస్తామని చెప్పడంతో మాతో రావడానికి ఒప్పుకున్నాడు. అలా బయలుదేరి కోటకి చేరుకున్నాం. కోటంతా తిరిగి, అక్కడి కోనేటి నీరు తాగి, ఆ తర్వాత ఫిరంగుల గురించి అడిగినప్పుడు ఆయన చాలా ఎత్తుమీద ఆ డొంగరియా (ఎత్తైన కొండ) మీద ఉన్నాయని చెప్పాడు. అంత దూరం నేను నడవలేను. ఇక రమేష్ ని కెమెరా ఇచ్చి పంపించాను. మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరినవాళ్లు సాయంత్రం ఐదు అయినా రాలేదు. నాకు ఓవైపు భయం వేస్తుంది. అంతేగాక ఈ బిల్ ట్రైబ్ రమేష్ ని తీసుకువెళ్లి ఏమైనా చేసినాడా! లేదా ఏమైనా అయిందా! జారిపడ్డారా! అనేక ఆలోచనలు పరిపరివిధాల నన్ను బాధపెట్టాయి. పైగా అడవిమధ్యలో నేనూ ఒంటరిగా ఉన్నాను. దాంతో నాలో కలవరం మొదలైంది. ఇంతలో ఐదున్నర ప్రాంతంలో ఒక వ్యక్తి తన ఎద్దుల్ని తోలుకుంటూ వెళ్తున్నాడు. ఆయన్ని పిలిచి అయ్యా! ఇక్కడ నేను నాలుగు గంటలనుంచి ఒక్కడినే ఉన్నాను. అని చెప్పగానే ఆయన ఆశ్చర్యంతో నా దిక్కు చూసి మీతో ఎవరు లేరా అన్నాడు. గణేష్ అనే ఒక అబ్బాయి మా వాడిని తీసుకొని ఆ పై డొంగరియకు వెళ్ళాడు. అక్కడ ఒక తోపు ఉందని చెప్పాడు. దాని ఫోటో తీసుకురావడానికి మావాడు వెళ్లాడు ఇంతవరకు రాలేదు అని చెప్పాను. దానికి ఆయన బదులుగా ఇంకా టైం ఉంది సార్, గంట వరకు రావచ్చు అన్నాడు. అయితే మరి కొద్దిసేపు నాతో ఇక్కడ ఉండమని అన్నాను. ఆయన నా పశువులు ఉన్నాయి సార్ ఇంటికి వెళ్ళాలి, భయపడకుండా ఉండండి, వాళ్ళు తిరిగి వస్తారు అని చెప్పాడు. అప్పుడు ఆయనను బతిమాలి ఉండమని, డబ్బులు ఇస్తానని చెప్పాను. అప్పుడు నాతో కొంత మాట్లాడుతూ నిలబడ్డాడు. ఆరు గంటలయింది. చీకటి పడుతుంది. అప్పుడు ఇద్దరూ కలిసి వచ్చారు. ఇది ఒక భయంకరమైన అనుభవం.

మరో సంఘటన, మేము ముగ్గురం మోటార్ బైక్ మీద కవ్వాళ్ అడవుల్లో ఇనుప చిట్టెం కుప్పలని, ఆ అడవుల సౌందర్యాన్ని చూస్తూ, ఒక కుప్ప పైన ఆగి దాన్ని కొంచెం తవ్వాలని ప్రయత్నం చేసాం. అక్కడ కొన్ని చిట్టెము శాంపిల్స్ తీసుకొని అక్కడనుంచి బయలుదేరి ముందుకు పోదాం అనుకున్నంతలో ముగ్గురు, నలుగురు వ్యక్తులు సడన్‌గా ప్రత్యక్షమయ్యారు. వాళ్ల ఆకారం చూసి నక్సలైట్లు అనుకున్నాం. నిజంగా వాళ్ళు నక్సలైట్లే. ఇది 2006లో జరిగిన సంఘటన. వారు మమ్మల్ని నిలదీసి ఎవరు మీరు? ఎందుకు ఇక్కడ తిరుగుతున్నారు? ఏం పనిమీద వచ్చారు? అని అడగ్గా మా పైప్రాణాలు పైనే పోతున్నాయి. మేము అన్ని విషయాలు వారికి వివరించాము. కొద్దిసేపటికి సరే వెళ్ళండి అన్నారు. మేము కొంచెం దూరం బయలుదేరిన తర్వాత బ్రతికి బయటపడ్డాం అనుకున్నాం. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సాహసిక సంఘటనలు మాకు ఎదురయ్యాయి. అడవుల్లో తిరుగుతుంటే కొంతమంది మమ్మల్ని మూరు?లు అన్నారు. కొద్దిమంది మమ్మల్ని విజ్ఞులు అన్నారు. కొందరు తిట్టారు. అయినా మా పరిశోధన మార్గంలో ప్రయాణిస్తూనే ఉన్నాం.

**చివరగా ఒక ప్రశ్న తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణాకి చేయవలసిన కృషి ఏంటి?**

కచ్చితంగా తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం జరగాలి. ప్రధానంగా ప్రాచీన పాతరాతియుగం, మధ్యరాతియుగం, నవీన శిలాయుగం, తామ్రయుగం ఈ కాలాలకు సంబంధించిన అన్ని ఆనవాళ్లు తెలంగాణలో విస్తృతంగా ఉన్నాయి. ముఖ్యంగా రాతి పెయింటింగ్స్, పెట్రోగల్స్ తెలంగాణలో చాలా ప్రాంతాలలో లభిస్తున్నాయి. తెలంగాణ చరిత్రని సమగ్రంగా ఎవరు పరిశోధించలేదు. తెలంగాణలో ఉన్న కోటల గురించి, బురుజుల గురించి పరిశోధన సంపూర్ణంగా జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణలోని చరిత్రకారులు, విద్యావంతులను ఒక గ్రూపులుగా చేసి ఒక కమిటీ ద్వారా ఆయా జిల్లాలకు సంబంధించిన సమగ్రమైన చరిత్ర నిర్మాణానికి పూనుకొంటే బాగుంటుంది. ఇప్పటివరకు కొందరు బృందాలుగా, వ్యక్తిగతంగా ఏర్పడి పరిశోధనలు చేస్తున్నప్పటికీ అవి సమగ్ర చరిత్ర నిర్మాణం చేయడానికి దోహదం చేయడంలేదు. దీనికి ప్రభుత్వం తరపున నిర్ణయం తీసుకొని, సమగ్రమైన తెలంగాణ చరిత్ర నిర్మాణం చేయాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉంది.

★ **రచయిత: సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు**

# తెలంగాణలో గ్రంథమాలలు

డా. మల్లెగోడ గంగాప్రసాద్

నిజాం కాలంలో ప్రజలమీద ఎన్నో ఆంక్షలుండేవి. ముఖ్యంగా రచనా వ్యాసంగంమీద కఠినమైన నిబంధనలుండేవి. నాడు పత్రికలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ ఒక్క వార్తనో, వ్యాసమో వచ్చినా, ఆ పత్రికను రద్దుచేసే వరకు నానాహింసలు పెట్టి, అనేక శిక్షలు విధించేవారు. అటువంటి పరిస్థితులమధ్య కొంతమంది ధైర్యవంతులు, మేధావులు అనేక ఆలోచనలు చేసి గ్రంథమాల నిర్మాణానికి పునాదివేసారు. ఆచరణలో తీసుకువచ్చారు. గ్రంథమాలలద్వారా ప్రజలలో చైతన్యం కలిగించే అనేక పుస్తకాలను అచ్చువేసి ప్రజలకు చేరువ చేశారు. వారిలో పఠనాభిలాషను పెంపొందించే మార్గాలను అన్వేషించారు. అలా వారు భక్తి సాహిత్యాన్ని, ప్రాచీన కావ్యాలను ముద్రిస్తూనే కొత్త ప్రక్రియలైన నవల, కథానిక, గేయ ప్రక్రియలను కూడా ముద్రించారు. నర్మగర్భంగా ప్రజలలో చైతన్యం కలిగించే రచనలను ముద్రించి వారికి చేరవేసారు. అప్పటికి ఎన్నో ఆంక్షల మధ్య ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలను అచ్చువేసి అందించారు. అచ్చువేసిన వాటిలో ఏ కారణం లేకుండానే నిజాం రాజ్యం, అనేక పుస్తకాలను నిషేధించింది. అయినా గ్రంథమాలలు వెనకడుగు వేయకుండా పుస్తకాలను ముద్రిస్తూనే ఉండేవి. అయితే రాజ్యం ఊరికే ఉండకుండా కొన్ని గ్రంథమాలలను నిషేధించే కుట్రలకు తెర తీయబోయింది. అటువంటి వాటిని ముందే పసిగట్టిన నిర్వాహకులు ఆయా నిషేధాజ్ఞలు రాకుండా జాగ్రత్తపడ్డారు.

నిజాంరాజ్యంలో చదువు చెప్పేవారు, చదువుకునేవారు తగ్గిపోతున్న సమయంలో గ్రంథమాలలు అందించిన సేవ మరువలేనిది. ఆ రోజుల్లో సాహిత్యంతోపాటు పాఠ్యపుస్తకాలను, సైన్స్ పుస్తకాలను, ప్రపంచ చరిత్రను ప్రచురించి ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళాయి.

**విజ్ఞానచంద్రికా గ్రంథమాల –** తెలంగాణలో మొదట ఏర్పడిన గ్రంథమాల విజ్ఞానచంద్రికా గ్రంథమాల. ఇది 1906లో కొమర్రాజు లక్ష్మణరావు చొరవతో ఏర్పడింది. తొలితరం పరిశోధనారంగంలో కొమర్రాజు చేసిన కృషి అద్వితీయమైంది. పరిశోధనారంగంలో చేయవలసిన కృషిని, ఆవశ్యకతను గుర్తించిన ఆదిరాజు వీరభద్రరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి ప్రముఖులతో కలిసి, విజ్ఞానచంద్రికా గ్రంథమాలను నడిపించారు. ఈ సంస్థద్వారా ఎన్నో చారిత్రక విషయాలను, తాళపత్ర గ్రంథాలను వెలికితీసారు. అనేక పరిశోధనాత్మక వ్యాసాలను తీసుకువచ్చారు. స్వీయచరిత్రము ప్రథమ, ద్వితీయ భాగములు(కందుకూరి వీరేశలింగం), బౌద్ధ మహా యాగము(వేలూరు సత్యనారాయణ), రాయచూరు యుద్ధము (భోగరాజు నారాయణమూర్తి), అమెరికా సంయుక్త రాష్ట్రములు, ఫ్రెంచి స్వాతంత్ర్య విజయము (అయ్యదేవర కాళేశ్వరరావు), వృక్షశాస్త్రము (వి. శ్రీనివాసరావు), పాతాళభైరవి (ఎ.వి. నరసింహంపంతులు), అంటువ్యాధులు (ఆచంట లక్ష్మీపతి) వంటి అనేక పుస్తకాలను ఈ గంథమాల ముద్రించింది.

**విజ్ఞానవర్ధనీ గ్రంథావళీ –** విజ్ఞానవర్ధిని పరిషత్తువారు విజ్ఞానవర్ధనీ గ్రంథావళీ పేరుతో ఒక గ్రంథమాలను ఏర్పరిచారు. కేశవపంతులు నరసింహశాస్త్రిగారు దీనికి కార్యదర్శిగా వ్యవహరించారు. మంత్రి ప్రెగడ వెంకటేశ్వరరావు వైదికధర్మ గ్రంథమండలిని స్థాపించారు. ఇది హిందు సమాజంలో కులభేదాలను, మూఢనమ్మకాలను రూపుమాపడంకోసం కృషిచేసింది.

**విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల –** వరంగల్‌లో ఒద్దిరాజు కవులు చొరవతీసుకుని 1918 మార్చి 3న, విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాలను నెలకొల్పారు. వీరే 'విజ్ఞాన ప్రచారణీ ముద్రణాలయాన్ని కూడా (1919) ప్రారంభించారు. వారి రచనలు ముద్రిస్తూనే, ఇతర రచనలను కూడా ఈ గ్రంథమాలద్వారా ప్రచురించారు. పుస్తకప్రచురణలకోసం బెజవాడకి తరచూ వెళ్ళి రావలసిన కష్టాలను గ్రహించి, వీరే స్వయంగా ఇనుగుర్తిలో గ్రంథమాలను ఏర్పాటుచేశారు. ఇనుగుర్తి ఒక మారుమూల గ్రామం. కనీస సౌకర్యాలు కూడా లేవు. అయినా స్వగ్రామంనుంచే తమ రచనోద్యమాన్ని వీరు కొనసాగించారు. ఈ గ్రంథమాలద్వార శౌర్యశక్తి, వరాహముద్ర, బ్రాహ్మణ సాహసము, స్త్రీ సాహసం, రుద్రమదేవి, ముక్తలవ, నౌకాభంగం, (రవీంద్రుని 'రెక్'కి అనువాదం), మోహినీ విలాసం, ప్రేమ వివాహం, శశవిశాణము, కృష్ణస్థవ, శ్రీ స్థవ, శుకపక్షీయం, ఉత్సవానంద భాణమ్, వైభవ స్తవః విభక్త్యర్థం,

ధాతు నిఘంటువు, పాణిని అష్టాధ్యాయి, సిద్ధాంత కౌముదీ, వీరావేశము, పంచకూళ కషాయం, విషములు-చికిత్సలు, సప్తపది, ఉత్తర గురుపరంపర, ముదలాయిరం, వణ్ణ మాదంగళ్, సుశీలా మైనావతి. ఆర్తి ప్రబంధం, సప్తగాథావాఖ్య, తపతీసంహరణ ఉపాఖ్యానం, మత్కునోపాఖ్యానం వంటి గ్రంథాలను ముద్రించారు. ఆంగ్ల వ్యాకరణము (ది మాన్యువల్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్‌కు అనువాదం) వంటి శాస్త్రగ్రంథాలను కూడా ముద్రించారు. విజ్ఞానప్రచారణీ గ్రంథమాల మొదట ఇనుగుర్తిలో ప్రారంభమై, అనంతరకాలంలో కరీంనగర్ జిల్లా నెమలికొండకు తరలి వెళ్ళింది.

**అణాగ్రంథమాల** - తెలంగాణలో గ్రంథమాలలు దాదాపు 1930వ దశకంలో ఎక్కువగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ క్రమంలో ఏర్పడిన మొట్టమొదట గ్రంథమాల అణాగ్రంథమాల. కల్వల చంద్రసేన్ గుప్త(కె.సి.గుప్త), వెల్దుర్తి మాణిక్యరావులు, గుండవరపు హనుమంతరావుల ఆధ్వర్యంలో 1938లో 'అణా గ్రంథమాల' ఏర్పడింది. నాలుగు సంవత్సరాలలో దాదాపు 40 పుటల పరిమితిలో 100 గ్రంథాలను ప్రచురించాలనేది వీరి లక్ష్యం. వ్యాసరూపంలో ఉన్న ఈ చిన్నగ్రంథాలను ఒక అణాకే అందించటంవల్ల దీనికి 'అణాగ్రంథామాల' అని పేరు పెట్టారు. తెలుగు భాష ప్రచారం, రాజకీయపరమైన అవగాహన, వివిధ జీవన సమస్యలపై అవగాహన కలిగించడం, మహనీయుల జీవితచరిత్రను తెలియజేసే గ్రంథాలను ప్రచురించి, ప్రజలలో ఉద్యమస్ఫూర్తి కలిగించడంవంటి లక్ష్యాలతో ఈ సంస్థ కొనసాగింది. వీరు ముద్రించిన ప్రతి పుస్తకాన్ని పాఠకుడికి ఒక అణాకే అందించాలనేది ఈ గ్రంథమాల ఆశయం. బూర్గుల రామకృష్ణరావు, సురవరం ప్రతాపరెడ్డి, మందుముల నరసింహరావు ఈ సంస్థ వ్యవస్థాపకులను ప్రోత్సహించారు. ఈ సంస్థ విజయాన్ని కాంక్షించారు. దీనికి టి. హయగ్రీవాచార్యులు వరంగల్ ప్రతినిధిగా వ్యవహరించారు.

ఈ గ్రంథమాల పక్షాన వెల్దుర్తి మాణిక్యరావు సంపాదకుడిగా, కల్వల చంద్రసేన్ గుప్త వ్యవస్థాపకుడిగా దాదాపు యాభైపుస్తకాలు ప్రచురించారు. తక్కువ ధరకు చిన్నచిన్న పుస్తకాలను ప్రచురిస్తూ, ప్రజలకు అత్యంత చేరువయ్యింది ఈ సంస్థ. అప్పటి ప్రభుత్వం గెజిట్ తలపెట్టిన రాజకీయ సంస్కరణలను తెలుగులోకి అనువదించారు. మాడపాటి, ఈ పుస్తకానికి సుదీర్ఘమైన ముందుమాట రాశారు. ఈ పుస్తకం మొత్తం డెబ్బై పుటలు ఉంటుంది. ఈ సంస్థ రెండవ పుస్తకంగా రైతు పుస్తకాన్ని అచ్చువేశారు. పన్నులభారంతో రుణగ్రస్తులైన రైతుల దీనస్థితిని చిత్రిస్తూ, దీనిని వెల్దుర్తి మాణిక్యరావు రాసారు. ఈ పుస్తకాన్ని నిజాం సర్కార్ నిషేధించింది. అడవి బాపిరాజు రాసిన, అజంతా పుస్తకాన్ని కూడా ముద్రించారు. నిజాం జాగీర్ వ్యవస్థ గురించి సురవరం ప్రతాపరెడ్డి, ఉమ్మెత్తల కేశవరావులు రాసిన జాగీరులు గ్రంథాన్ని రెండు భాగాలుగా అచ్చువేశారు. జాగీరు ప్రజల దీనస్థితిని ఇందులో వివరించారు. ఇంకా కాంగ్రెసు చరిత్ర-జానపాటి సత్యనారాయణ, మొగలాయి కథలు-సురవరం ప్రతాపరెడ్డి, సోషలిజం-గొబ్బూరు రామచంద్రరావు, యం.యన్.రాయ్-గుండవరము హనుమంతరావు, నా కొడుకు-ధనికొండ హనుమంతరావు, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వినాయక దామోదర సావర్కర్, యం.యన్. రాయ్ జీవితచరిత్రలు-కె. రంగదాసు(నిజాం ప్రభుత్వం వీటిని నిషేధించింది. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు కేసువేసిన అణాగ్రంథమాల పోరాడి గెలిచింది), కాళోజీ కథలు (1943)-కాళోజీ నారాయణరావు, అణాకథలు (1949), సావర్కర్-కె.రంగదాసు, మణిమేఖల-పులవర్తి కమలావతీదేవి, మాలతీగుచ్ఛము-మాడపాటి హనుమంతరావు, అనువంశికము వాహకులు-డా. రమణరావు తదితర పుస్తకాలను ముద్రించారు. కొన్ని ఇతర భాష పుస్తకాలను కూడా ఈ సంస్థ ప్రచురించింది.

**దేశోద్ధారక గ్రంథమాల** - వట్టికోట ఆళ్వారుస్వామి, కాశీనాథుని నాగేశ్వరరావు పేరిట 1938లో సికింద్రాబాదులో 'దేశోద్ధారక గ్రంథమాల'ను నెలకొల్పాడు. దేశీయుల ఆకాంక్షలను, హక్కులను బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని ఉత్తమ గ్రంథాలను ప్రచురించే ఆశయంతో ఈ గ్రంథమాల స్థాపించబడింది. 1938లో ప్రారంభమై 1961వరకు 33 అత్యంత విలువైన గ్రంథాలను ప్రకటించింది. ఈ సంస్థ ఎక్కువగా తెలంగాణా రచయితల గ్రంథాలనే ప్రకటించి సాహిత్య చైతన్యవ్యాప్తికి తనదైన ముద్రవేసుకున్నది. వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం నిరంకుశ ప్రభుత్వంపై వ్యతిరేక పోరాటం చేయడంవల్ల మధ్యలో కొంతకాలం జైలు జీవితం గడపాల్సి వచ్చింది. దానివల్ల సంస్థ నడవడానికి కొంత అవాంతరం ఏర్పడింది. తరువాత 1951 నుంచి 1961లో తుదిశ్వాస వదిలేవరకూ ఎందరో రచయితల గ్రంథాలను వెలుగులోకి తెచ్చాడు. ఏ ఊరికి వెళ్ళినా, అముద్రిత ప్రతులను సేకరించి వెంటనే వాటి ప్రచురణకు పూనుకొనేవారు. 33 గ్రంథాలే కాకుండా కథలు, కవితలు, నవలలు, వ్యాసాలు మొదలైన ప్రక్రియలకు చెందిన మరో 25 గ్రంథాల ముద్రణ ప్రణాళిక కూడా సిద్ధంచేశారు. గ్రంథ ప్రచురణలో దేశోద్ధారక గ్రంథమాల

విశిష్టతను నిరూపించటానికి వీరు ముద్రించిన రచనలే సాక్ష్యం. సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'హైందవ ధర్మ వీరులు' పుస్తకాన్ని ఈ గ్రంథమాల తొలి ప్రచురణగా ముద్రించింది. రెండవ ప్రచురణగా సురవరంవారి మరో రచన– ప్రాథమిక స్వత్వములు గ్రంథాన్ని ప్రచురించింది. ఈ రెండు పుస్తకాలు అనేక పునర్ముద్రణలు పొందింది. మొదటిది హైందవ ధర్మవీరుల గాథలు, రెండవది ఆనాటి మౌలికమైన ప్రాథమిక హక్కులను వివరించాయి.

కమాల్ పాషా జీవితము (ఖండవల్లి బాలేందు శేఖరం), ఔంధు సంస్థానము (పులిగడ్డ వెంకటసుబ్బారావు), ప్రజలు–ప్రభుత్వం (జానపాటి సత్యనారాయణ, అనువాదం), కాంగ్రెసు%–% సంస్థానాలు, సంస్థాన సమస్యలు (భోగరాజు పట్టాభిసీతారామయ్య), నా భారతదేశయాత్ర–హెచ్. ఎస్. బెయిల్ ఫర్డ్(అనువాదం – కాళోజీ నారాయణరావు), గాంధి మహాత్ముడు (విష్ణుచక్రం), జైలు లోపల(కథల సంపుటి), ప్రజల మనిషి (వట్టికోట ఆళ్వారుస్వామి), నా గొడవ (కాళోజీ నారాయణరావు), ఉదయ గంటలు(అఖిలాంధ్ర కవులగేయసంపుటి), జీవనరంగం(ఏకాంక దృశ్యనాటికల సంకలనం), పగ(నాటిక)%–% పొట్లపల్లి రామారావు, మాయరోగం–నాటిక (పల్లా దుర్గయ్య), అనుమానము (దివాకర్ల వేంకటావధాని–నాటిక), పునర్నవం (దాశరథి కృష్ణమాచార్య), తెలంగాణ (వ్యాస సంకలనం) ప్రభాన(ప్రసంగవ్యాసాల సంకలనం), ఆత్మవేదన (గేయసంపుటి)–పొట్లపల్లి రామారావు, ఆహ్వానము (పద్య–గేయకవితాసంపుటి)–వానమామలై వరదాచార్యులు, పరిసరాలు (కథా సంకలనం), బ్రతుకు బాటలు (కథల సంపుటి)–హీరాలాల్ మోరియా గ్రంథాలను ముద్రించింది. కె. ఎల్. నరసింహారావు నాటికలు(కళాసౌధము), వానమామలై వరదాచార్యుల 'ఆహ్వానము' (గేయాలు), ఔంధు సంస్థానము(పులిగడ్డ వెంకట సుబ్బారావు), ప్రజలు ప్రభుత్వం(లియోటాల్‌స్టాయ్ రచనకు అనువాదం), నా భారతదేశమాత(హెచ్.ఎన్. బ్రెయిల్స్ ఫర్డ్ గ్రంథానికి కాళోజీ అనువాదం) వంటి గ్రంథాలను కూడా ముద్రించారు. తెలంగాణా సాహిత్యోద్యమంలో దేశోద్ధారక గ్రంథమాల చేసిన విశేషమైన కృషిని ఎప్పటికి మరిచిపోలేము.

**ఆంధ్ర చంద్రికా గ్రంథమాల** –మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి ఉత్సవ సందర్భంలో ప్రజలు బహూకరించిన 6400 రూపాయలతో వీరు ఆంధ్రచంద్రికా గ్రంథమాలను1945లో ఏర్పాటుచేశారు. ఈ గ్రంథమాల ముద్రించిన పుస్తకాలను విక్రయించగా వచ్చిన ధనాన్ని బ్యాంకులో జమచేసి ఆ మొత్తం ఇరవైవేలు కాగానే రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల(రెడ్డి కాలేజి) స్థాపనకోసం విరాళంగా ఇచ్చి గ్రంథమాలను ఆపివేశారు. ఈ గ్రంథమాల అనేక గ్రంథాలను ముద్రించింది. తెలంగాణలో ఆంధ్రోద్యమము–మాడపాటి హనుమంతరావు, ఆంధ్ర సాహిత్య చరిత్ర–ఖండవల్లి లక్ష్మీరంజనం, విస్మృత సామ్రాజ్యములు–ఖండవల్లి బాలేందు శేఖరం, ప్రాచీనాంధ్ర నగరాలు–ఆదిరాజు వీరభద్రరావు, వైజ్ఞానికుల జీవితములు–బి.వి. రమణరావు, 'పౌర ధర్మములు'–రాంపల్లి విశ్వేశ్వరరావు వంటి గ్రంథాలను ముద్రించారు.

**కాకతీయ గ్రంథమాల** – తూము వరదరాజులు వరంగల్‌లో కాకతీయ గ్రంథమాలను 1936లో స్థాపించారు. శేషాద్రి రమణకవుల సంపాదకత్వంలో ఈ గ్రంథమాల పుస్తకాలను ముద్రించింది. ఆంధ్రమంత్రుల చరిత్ర, ఆంధ్ర పద నిదానము, దాసబోధ, విక్రమోర్వశీయము, వసుంధర తదితర గ్రంథాలు ఈ సంస్థ ముద్రించింది.

**విశ్వేశ్వర గ్రంథమాల** – ఓరుగల్లులో విశ్వేశ్వరాలయాన్ని నిర్మించిన ఆకారపు నరసింగం గుప్త ఈ గ్రంథమాలను స్థాపించారు. శైవమత గ్రంథవ్యాప్తి ప్రధాన లక్ష్యంగా ఈ సంస్థ పనిచేసింది. సుమారు 20 శైవ మత సంబంధిత గ్రంథాలను వీరు ముద్రించారు. రాజ్యం ఎన్ని ఆటంకాలు విధించినా, చిత్తశుద్ధి, సంకల్పబలం ఉంటే ఏపనైనా విజయవంతంగా సాధించవచ్చని గ్రంథమాలల వ్యవస్థ నిరూపించింది.

పుస్తకాలు చదవడంవల్ల సమాజం అత్యంత వేగంగా నాగరికంగా ఎదుగుతుంది. ఎన్నో కొత్త విషయాలను, కొత్త మార్గాలను, కొత్త ఆలోచనలను పుస్తకపఠనం చేసే సమాజం ప్రవేశపెట్టుకుంటుంది. అటువంటి సమాజాన్ని తెలంగాణ మేధావులు వంద సంవత్సరాల క్రితమే కోరుకున్నారు. ఆ దిశగా అడుగులు వేశారు. ఎన్నో గ్రంథాలను ప్రజలకు చేరువ చేయడానికి పుస్తక ముద్రణను అనేక గ్రంథమాలలద్వారా ఒక సీరియస్ కార్యక్రమంగా పెట్టుకుని, సఫలీకృతులయ్యారు. తెలంగాణలోని గ్రంథమాలలు ముద్రించిన గ్రంథాలన్నీ పునర్ముద్రించుకోవలసి అవసరం ఇప్పటికీ ఉంది. ఇవి నా దృష్టికి వచ్చిన తెలంగాణలోని గ్రంథమాలల వివరాలు.

★ **రచయిత:** డిగ్రీ అధ్యాపకులు, MJPTBCWRD, మెదక్

# డా.ఎన్.గోపి కవిత్వంలో 'స్మృతి'

డా. సుంకర గోపాలయ్య

**సంక్షిప్తి** (abstract):

తెలుగు సాహిత్య ఉద్యమాలలో భావ కవిత్వ ఉద్యమం ఒకటి. భావ కవిత్వానికి సంబంధించిన శాఖల్లో స్మృతి కవిత ఒకటి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో స్మృతి కవిత ప్రవేశించింది. ఆంగ్లంలోని ఎలీజి అనే ప్రక్రియను తెలుగులో స్మృతి కవిత అని వ్యవహరిస్తున్నాం. స్మృతి కవిత పద్యాలు, గేయాలతో ప్రారంభమైనప్పటికీ, కవిత్వంలో విరివిగా వచ్చింది. మన అనుకున్న వారు, మనసుకు దగ్గరైన వారు లోకానికి మంచి చేసిన వారు వెళ్ళిపోతే కన్నీళ్లు కురుస్తాయి. దుఃఖం ఆగదు. ప్రాణం వదిలి వెళ్ళిన వారి జ్ఞాపకాలను మాటలను గుర్తు చేసుకుంటూ కుమిలిపోతాం. ప్రస్తుత వ్యాసంలో డాక్టర్ ఎన్. గోపి పదుల సంఖ్యలో రాసిన స్మృతి కవితల్ని విశ్లేషిస్తున్నాను. డాక్టర్ ఎన్. గోపి సుదీర్ఘకాలం నుంచి వచన కవిత్వం రాస్తున్నారు. ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. వారి కవిత్వంలో కుటుంబ సభ్యులు, మిత్రులు, ఆప్తులు, కవులు, కళాకారులు, నాయకులు వెళ్లిపోయినప్పుడు రాసిన స్మృతి కవితల్ని విశ్లేషిస్తున్నాను. స్మృతి కవిత భావ కవిత్వంలో విశిష్టమైన స్థానాన్ని పొందింది కానీ అభ్యుదయ, విప్లవ కవిత్వం ఉద్యమాలతో పాటు మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా స్మృతి ఎప్పటికప్పుడు ప్రత్యేకతను సంతరించుకుంటూ సాగుతోంది. ఆ కోణం దృష్ట్యా ఈ పరిశోధన పత్రాన్ని రాస్తున్నాను. వచన కవిత్వంలో స్మృతి అనే అంశం మీద పరిశోధన చేయాలనుకున్న వాళ్లకు ఈ పరిశోధన పత్రం ఉపయోగపడుతుంది.

**సాంకేతిక పదాలు** (Key words):

*వచనకవిత, స్మృతి కవిత్వం, ఎలీజి, కుటుంబ సభ్యులు, మిత్రులు, స్మృతి లక్షణాలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు, సజీవం, ఇతర స్మృతులు*

**పరిశోధనా పత్ర నేపథ్యం:**

ఎలీజి అనే పదం ఎలిగోస్ అనే గ్రీకు పదం నుంచి నిష్పన్నమైంది. ఎలిగోస్ అంటే శోకం అని అర్థం. గ్రీకు దేశంలో ఆత్మీయులు మరణించినప్పుడు జానపదులు కొన్ని గీతాలను పాడేవారు. ఈ గీతాలకు పిల్లన గ్రోవిని జత కలిపేవారు. ఈ గీతాలు ఎలిజియాక్ ఛందస్సులో ఉండేవి. ఎలీజి అనగానే వెంటనే స్మరణకు వచ్చేది థామస్ గ్రే రాసిన elegy stanza written in a countrys church yard. ఇది స్మశానాన్ని గురించి రాయబడిన గీతం. ఇది యావత్ ఆంగ్ల సాహిత్యంలోనే చెప్పుకోదగింది. అలాగే టెన్నిసన్ రచించిన ఇన్ మెమోరియల్ అనేది చిన్నతనంలోనే మరణించిన మిత్రుని జ్ఞాపకాలతో కన్నీటి పర్యంతమై హృదయ వేదనను ఆవిష్కరించిన ఎలీజి. కొన్ని ఎలీజి నిర్వచనాలను పరిశీలిద్దాం.

"The elegy is a lyric expressive of melancholy of grief,in particular,when commemorative of dead Friend". ఆప్తులైన వారెవరైనా వారి మరణాన్ని గురించిన సముదాయం ఎలిజి అవుతుంది అని అమెరికన్ విజ్ఞాన సర్వస్వం పేర్కొంది. ఎం.హెచ్ అబ్రహం ఎలీజిని ఇలా నిర్వచించాడు,

"in present critical usage however an elegy is a formal and sustained poem of lamenent for the death of a particular person". అనగా ఒక వ్యక్తి మరణంతో వెలువడే సాధారణమైన దుఃఖపూరిత పద్యం ఎలీజి.

తెలుగులో ఎలీజికి సోక గీతమని, శోక కావ్యమని పర్యాయపదాలు ఉన్నాయి. తాపీ ధర్మారావు తను రచించిన ఒక ఎలీజికి కారుణ్యము అని తెలుగులో నామకరణం చేశారు. మృతి కవితకు సమానార్థంగా స్మృతి గీతం, స్మృతి కావ్యం అనే పదాలు సముచితంగా ఉంటాయని డాక్టర్ సి.నారాయణరెడ్డి భావించారు. సాహిత్య పదాల డిక్షనరీలో స్మృతి గురించి, "ఆప్తుల మరణం ప్రముఖ వ్యక్తుల మరణం పట్ల కలిగిన బాధను శోకాన్ని వ్యక్తపరుస్తూ ఆత్మాశ్రయ ధోరణిలో రాసిన కవిత్వం" అనే నిర్వచనం ఉంది. అలాగే వచన కవిత్వంలో స్మృతి అనే అంశం మీద పరిశోధన చేసిన ఈ వ్యాసకర్త , "ఒక వ్యక్తి మరణించిన వెంటనే గాని తరువాత కాలంలో గాని వారు లేని లోటును, అనుబంధాల్లో ఏర్పడిన శూన్యాన్ని సాహనుభూతి చెందుతూ దుఃఖ భారాన్ని దింపుకోవడానికి రాసే కవిత స్మృతి కవిత" అని నిర్వచించారు.

స్మృతి కవిత పద్య, గేయ రూపంలో ప్రారంభమైంది.

డా. సి. నారాయణ రెడ్డి తెలుగులో స్మృతి సాహిత్యం అనే మాటను ప్రయోగించి స్మృతి కావ్యాల వర్గీకరణ కూడా చేశారు. వారు దేశనాయక స్మృతి, సతీస్మృతి,, సుతాధిక స్మృతి, ఆప్త స్మృతి అని స్మృతి కావ్యాల్ని నాలుగు వర్గాలుగా విభజన చేశారు. తెలుగులో నవ్య కవిత్వం ప్రారంభమయ్యాక స్మృతి కావ్యాలు ఎక్కువగా వెలబడ్డాయి. నాయిని సుబ్బారావు గారి మాతృ గీతాలు, విశ్వనాథ, వరలక్ష్మి త్రిశతి, దువ్వూరి రామిరెడ్డి భగ్న హృదయం మొదలైనవి ప్రసిద్ధి పొందాయి. బసవరాజు అప్పారావు గారి అమ్మాయి మరణించాక "కాపురమొచ్చిన కన్నె పాపాయి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాదు" అనే చరణం చాలా ప్రసిద్ధి పొందినది. వచన కవిత్వంలో శ్రీశ్రీ మిత్రులు కొంపెల్ల జనార్దన్ రావు చనిపోయిన తర్వాత "తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం" అంటూ రాసిన స్మృతి కవితను మొట్టమొదటిగా భావించవచ్చు. ఆ తర్వాత కాలంలో స్మృతి కవితలు విరివిగా వెలుపడ్డాయి. ప్రస్తుతం ఈ వ్యాసంలో డా. ఎన్. గోపి కవిత్వంలో ఉన్న స్మృతి కవితలను మాత్రమే విశ్లేషించుచున్నాను. ఆయన కవిత్వంలోని స్మృతి కవితల్ని ఈ పరిశోధనా పత్రం పరిశీలిస్తుంది.

## డాక్టర్ ఎన్. గోపి కవితలలో స్మృతి

### అ) కుటుంబ సభ్యులు:

ఒక వ్యక్తి మరణించిన వెంటనే గాని, తరువాత కాలంలో గాని వారు లేని లోటును అనుబంధాల్లో ఏర్పడిన శూన్యాన్ని సహానుభూతి చెందుతూ దుఃఖ భారాన్ని నింపుకోవడానికి రాసే కవిత స్మృతి కవిత. అయితే పశు పక్షాదులు మరణించినప్పుడు కూడా కొందరు కవులు స్మృతులు రాశారు. తన తల్లి లక్ష్మమ్మ గారి చితి దగ్గర కూర్చుని 'అమ్మ రుణం' అనే కవిత రాశానని ఆయనో పత్రికలో చెప్పారు.

**"అమ్మ కూడా చచ్చిపోతుంది/యౌవ్వన ప్రాదుర్భావ ప్రాంగణంలో విచ్చిన మృత్యు పుష్పాలు /గుట్టుగా కళ్ల మడతల్లోకి /వచ్చి చేరిన స్వార్థభాష్పాలు /అమ్మను కాస్త కాస్త చంపుతూ /ఇవాళ పూర్తిగా చంపేశాయి"** (అమ్మరుణం,అమ్మ.పుట.94) అంటూ అమ్మ చనిపోదని, కాలుతున్న కాష్టం నుంచి వెలుగుల ప్రసారం చేస్తూనే ఉంటుందని అమ్మని ఓ స్మృతి దీపంగా కవి భావిస్తారు. అయితే ఈ కవితలో రాసిన ముగింపు వాక్యం గొప్పది.

**"భ్రష్టుడా/అమ్మ రుణం తీరదు /అమ్మకు అమ్మవై పుడితే తప్ప"** – (అమ్మ,పుట.94) అంటూ అమ్మని చివర చూపు కూడా చూడలేని క్షణంలో తనలో కలిగిన భావావేశమే ఈ కవితని ఆయన పేర్కొంటారు. అమ్మ దూరమైనా సరే ఆమె నేర్పిన అక్షరాలు, ఆమె నుంచి నేర్చుకున్న లక్షణాలు తనను నడిపిస్తున్నాయని అంటారు. అలాగే తన తండ్రిని గుర్తు చేసుకుంటూ రాసిన కవిత 'నాయన యాది'. అందులో తన నాన్న ఊరు తిరిగి వ్యాపారం చేసి తమ జీవితాలను నిలిపిన వాడిగా చెప్పుకుంటారు.

"అనేక ఊర్లు తిరిగిన ఆయన పాదాల ముందు నా కవిత్వ పాదాలు ఎంత అని" తండ్రి ఔన్నత్యాన్ని, ఆయన శ్రమజీవన తత్వాన్ని చాటుతాడు. కవితను ముగిస్తూ "ఓ నాయన నీ జీవితమే నాకు దీవెన" అంటూ రెండే రెండు వాక్యాల్లో తన జీవితంలో తండ్రి స్థానాన్ని అక్షరీకరించారు.

కుటుంబ సభ్యుల మధ్య గొప్ప అనుభూతులుంటాయి. అనుభవాలుంటాయి. ఒకరి పట్ల ఒకరికి అవ్యాజమైన ప్రేమానురాగాలు ఉంటాయి. అందువలన ఏ కారణంగానైనా కుటుంబంలోని ఒక వ్యక్తిని కోల్పోవడం జరిగితే, మిగతా కుటుంబ సభ్యులకు అది పెద్ద లోటుగా పరిణమిస్తుంది. గతించిన వారి జ్ఞాపకాలు, కుటుంబానికి వారు చేసిన సేవ, బంధాల పట్ల ప్రేమ వంటివి కుటుంబ సభ్యులను పట్టి కుదుపుతాయి. వారు కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఆ దుఃఖాన్ని ఆ జ్ఞాపకాలను భరిస్తూనే కవిత్వం రాస్తారు. కవిత్వంలో వారిని సజీవంగా పదిల పరుస్తారు. ప్రాణానికి ప్రాణమైన తన కూతురు ఆయన ప్రపంచాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయిన సందర్భంలో 'మా అమ్మాయి' అనే శీర్షికతో కవిత రాశారు.

తన జీవితంలోకి కలలా వచ్చిన అమ్మాయి పీడ కలల వెళ్లిపోవడాన్ని తట్టుకోలేకపోయారు. అలలా వచ్చిన ఆ ప్రాణం పెను తుఫానుగా తాకి, గొడుగు లేని దుఃఖంలో తనను వదిలిపోవడాన్ని కవి జీర్ణించుకోలేకపోయారు. తనకెందుకో ఈ లోకం నచ్చలేదని, తన పాల నవ్వుల వెనక దీపాల కన్నుల లోతుల్లో ఒక అంతర్ముఖి ఉందని తెలుసుకోలేక పోయాననీ, జీవితంలో విజయాలే కాకుండా వైఫల్యాలు కూడా భాగమేనని, తన కూతురికి నేర్పించలేదని అందుకే, అనుభవించు నాన్న అని నిర్దాక్షిణ్యంగా శిక్షించి వెళ్ళిపోయిందని కవి కలత చెందాదు. మృత్యువు అని తెలియకుండానే ఆమె చావుతో అలుపు లేకుండా చివరి వరకు పోరాడింది. చావుని చంపాలని ప్రయత్నించి, చివరికి చావునే వరించింది. హృదయం ద్రవించిపోగా

**"క్షణక్షణాల ముళ్ళ మంచం మీద/ఆకాశాన్ని గుండెల మీద మోపి వెళ్లిపోయింది/తనకు తెలియదు/తన మరణం క్షణమైతే**

**మా మరణం క్షణక్షణం"** –( కాలాన్ని నిద్రపోనివ్వను,పుట. 25) అంటూ తన హృదయ వేదనను కవిత్వంగా వ్యక్తంచేస్తారు. తన కంటిముందే పుట్టి , పెరిగి తనలో జీవనోత్సాహాన్ని నింపిన కూతురు లోకాన్ని ఖాళీ చేశాక తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో అనుభవించిన వారికే తెలుస్తుంది. మరణించిన వారికి ఆ క్షణం మాత్రమే మరణం, కానీ ఆ జ్ఞాపకాల్లో నిత్యం జ్వలించే వారికి క్షణక్షణం మరణమే కదా! అందునా సొంత కూతురి మరణం. తలచుకుంటేనే గుండె సముద్రం అవుతుంది.

**మిత్రులు, ఆప్తుల స్మృతి:**

ఇక గోపి గారి స్మృతి కవితలలో తనతోపాటు కవిత్వం రాస్తున్న మిత్రులు, ఆప్తులు మరణించిన సందర్భాలలో రాసిన కవితలు చాలా ఉన్నాయి. మరణం లోకంలో ఖాళీలను ఏర్పరుస్తుంది.

**అయితే ఇవి పూరించలేని ఖాళీలు. /వాళ్ళందరు జీవన గమనానికి తెరచాపలు కట్టిన వాళ్ళు. / లక్ష్యానికి జెండాలు అందించిన వాళ్లు. / మనిషి అంటేనే బాహ్యాంతర లోకాల నిరంతర సంఘర్షణ/ అని గోపి గారు నమ్ముతారు. అందుకే ఒక కవితలో**

**"అటువంటివారు /మరణించినప్పుడు మాత్రం /మనం మరణించినట్టే ఉంటుంది"**– (మనిషిని కలిసినట్టుండాలి, పుట. 92)

అనే ఒక అద్భుతమైన వాక్యాన్ని రాయగలిగారు. కేవలం రెండే రెండు వాక్యాల్లో మనిషి మరణానికి మరో మనిషి తాదాత్మీకరణ చెందడాన్ని, చెందాల్సిన అవసరాన్ని కవి చెప్పారు. డా. సి. నారాయణరెడ్డి మరణించినప్పుడు రాసిన కవిత 'జనన మంత సుందర మరణం'. గోపి గారి ఎలీజిలలో ముఖ్యంగా శీర్షికలోనే ఆ వ్యక్తి స్ఫురణ, స్మరణ కనిపిస్తాయి. ఈ శీర్షికలో 'సుందర' అనే పదం ఒక్కసారిగా సినారె నవ్వుతున్న ముఖాన్ని మనకు గుర్తుకు తెస్తుంది. సినారె సాహిత్య సారాంశాన్ని చెబుతూ కవిత ప్రారంభమవుతుంది. ఆయన కవితలు మేఘాల భావోద్వేగాలు. ఆకాశమంత ఆత్మీయత కలిగిన వాడు ఆయన మరణం జననం మంత సుందరమైందని కవి చెబుతూ

**"కన్నీటి విలువ తెలిసినవాడు/ సామాజిక వేదనకు / మూలాలు గమనించినవాడు/ స్నేహమే దాహంగా బతికినవాడు /ప్రతిభా పద్మాలకు/ సూర్యరశ్మిని ప్రసరించినవాడు /ఉల్లోల పౌరష తరంగం /ఉద్ధీన హృదయ విహంగం /నా వ్యక్తిత్వం తలనిమిరిన వాడు /నాకు సర్వస్వం కాకుండా /ఎలా ఉంటాడు ?"** – (మనిషిని కలిసినట్టు ఉండాలి ,పుట. 45)అంటారు. పై వాక్యాలను గమనిస్తే చాలు కవికి నారాయణ రెడ్డి గారికి ఉన్న అనుబంధాన్ని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు.

కవులు సమాజ నిర్దేశకులు సమాజ వ్యాఖ్యాతలు. కవి చూపు వేరుగా ఉంటుంది. కొత్తగా ఉంటుంది. తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకుని వస్తారు. ఆ దిశగానే గోపి గారు అనేకమంది కవులు మరణించినప్పుడు వారి విశిష్ట వ్యక్తిత్వాలను స్మృతి కవితలుగా రికార్డ్ చేశారు. వారితో తనకున్న అనుబంధాన్ని, వారి రచనల పట్ల గౌరవాన్ని ప్రకటించి యదసీమల్లో వారిని తలుచుకున్నారు. గోపి రాసిన స్మృతి కవితల్లో ఆ కవి మార్గం, కవి వ్యక్తిత్వం సులభంగా తెలుస్తుంది. తేలిక మాటలతో చెబుతూనే భావాన్ని గంభీరంగా చెప్పడం ఆయన రాసిన స్మృతి కవితల్లోని ప్రత్యేక లక్షణంగా గమనించవచ్చు.

రాళ్లబండి కవితా ప్రసాద్ గురించి రాస్తూ...

**"జ్ఞాపకాల బొక్కెనలు /కన్నీళ్లు తోడేస్తున్నాయి, /కవితా నీ మరణం /ఎప్పటికీ తీరని /చిట్ట చివరి సమస్యా పూరణం"** – (ఆకాశంలో మట్టి, పుట. 89) అని అంటారు. గుడిహాళం రఘునాథం గురించి చెప్తూ "తక్కువ రాసినా, చక్కని కవిత్వం రాశాడు.

**కలం చిలకరిస్తే చాలు /ఆల్కెమీ జాలువారేది"** –(రాతి కెరటాలు, పుట. (51) అని అంటాడు. ఆచార్య తిరుమలని గుర్తు చేసుకుంటూ..

**"రాయకుండా/ బతకలేని నువ్వు / రాయకుండా మరణించడమేంటి"** –(అక్షరాల్లో దగ్ధమై, పుట. 148) అని దుఃఖంతో కూడిన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తారు. దాశరథి రంగాచార్యులను గుర్తు చేసుకుంటూ

**"మాక్సిం గోర్కి /మరోసారి మరణించాడు"**–(ఆకాశంలో మట్టి, పుట్ట.106) అని అంటాడు. ప్రముఖ కథకులు, నవలా రచయిత, సంపాదకులు పతంజలిని గుర్తు చేసుకుంటూ "పతంజలి పెన్ను ముట్టుకుంటే అతన్ని ముట్టుకున్నట్టే ఉంది. అతని వేళ్ళు నా వేళ్ళలోకి ప్రవహిస్తున్న అనుభూతి" అంటూ రాసుకున్నారు.

పుట్ల హేమలత మరణించిన సందర్భంలో ఆమె జ్ఞాపకాల చలి వెన్నుని వణికించిందని, మనసు మబ్బు పడిందని, సోదరి మరణం పచ్చని చెట్టు ఎండిపోవడంగా

భావించారు. తన మిత్రుడు అనువాదకుడు పోలి విజయ రాఘవరెడ్డి వెళ్ళిపోయినప్పుడు అతను వదిలిన ఖాళీని, వెలితిని గుర్తు చేసుకుంటూ "పుస్తకాలు, అక్షరాలు, వార్తా పత్రికలు, నిఘంటువులు దిగులు పడ్డాయ"ని చెబుతాడు. సిరిసిల్ల సాహితీ మిత్రుడు రుద్ర రవి చనిపోయినప్పుడు 'ఎవరికీ చెప్పకుండా' అనే స్మృతి కవిత రాశారు.

**"నీ చావును శపిస్తున్నాను / చావు /ఏ సమస్యకు పరిష్కారం కాదు /నీ మరణ వార్త విని /రాత్రంతా నిద్ర పట్టలేదు/ తెల్లారి మెలకువకు /అర్థం కనబడలేదు/పుండులా ఉన్న /నా హృదయం పైన/బండలా పడింది నీ మరణం/నీకివ్వడానికి నా దగ్గర ఇంకేమున్నాయి /తీసుకో ఈ మిగిలిన కన్నీళ్లు!"**–(చుట్టకుదురు, పుట. 56) అంటూ శోకతప్తమవుతారు. కవి తలుచుకుంటే చావును కూడా శపించగలడని అనడం కొత్తగా ఉంది. మరాఠీ కవి నిరంజన్ ను కూడా తలుచుకున్నారు. తన 'జలగీతా'న్ని మరాఠీ లోకి అనువదించినందుకు "నా కన్నీటి జలగీతమే నివాళిగా అర్పిస్తున్నా"నని ఆర్ద్రంగా పలికారు.

**సహానుభూతి:**

ఇంకా వీరి కవితల్లో మరో కోణం తన కవి మిత్రుల సహచరులు చనిపోయినప్పుడు కూడా సహానుభూతితో కొన్ని కవితలు రాశారు. ఎండ్లూరి సుధాకర్ భార్య పుట్ల హేమలత మరణించినప్పుడు అతని ఓదారుస్తూ "అతని దుఃఖం వీధుల్లోకి దూకిన జలపాతం గాయపడ్డ నీళ్లే కన్నీళ్లు" అంటూ రాశారు. దేవి ప్రియ అర్ధాంగి రాజ్యలక్ష్మి చనిపోయినప్పుడు

**"కొన్నాళ్ళకు/ దుఃఖం కూడా అలసిపోతుంది /చనిపోయిన వారు మళ్లీ జీవించడం మొదలవుతుంది/ఒక్కరు కాదు అనేకులుగా"** –(పురివిప్పిన ఊపిరి, పుట 84) అంటూ బాధను కవిత్వీకరిస్తారు.

ఇలా ఆయన రాసిన స్మృతి కవితల్లో జీవితాన్ని, మరణాన్ని అర్థం చేసుకున్న తీరు వాటిని తాత్వికంగా చూడటం లాంటి విషయాలు గమనించవచ్చు. ప్రముఖ చిత్రకారుడు బాపు మరణించినప్పుడు

**"తెలుగు వాకిళ్లలో / ముగ్గు లాంటివాడు /అతను మాట్లాడడు బొమ్మలే మాట్లాడతాయి"** – (పురివిప్పిన ఊపిరి, పుట. 99) అని చెప్పడం ద్వారా ఆర్టిస్ట్ గా బాపు స్థానాన్ని తెలుగు వాకిట్లో ముగ్గు అని వ్యక్తీకరించడం ద్వారా పాటకుల గుండెల్లో ముగ్గు వేసే వాక్యాలు గోపి రాయగలిగారు.

**సామాజిక ఉద్యమకారుల స్మృతి:**

ఆయన ఇంకా సామాజిక ఉద్యమకారులు, హక్కుల కార్యకర్తలు మరణించినప్పుడు కూడా తన కలం ద్వారా కన్నీళ్లు కార్చారు. తన వాక్యాలను పంపి వాళ్ళ ఆత్మీయుల భుజాల మీద ఓదార్పులా వాలారు. భరోసా ఇచ్చారు. స్మృతి కవితల్లో ఉన్న గొప్ప లక్షణం తనతో రక్తసంబంధం లేకపోయినా, కుటుంబ సభ్యులు కాకపోయినా సరే, వాళ్ల పోరాటాల ద్వారా, ఆలోచనద్వారా, నైపుణ్యం ద్వారా ముద్ర వేసిన వ్యక్తులను కూడా గోపి తలుచుకున్నారు. బాలగోపాల్ మరణించినప్పుడు

**"అడిగేవాడు ఒకడుండేవాడు /ఇప్పుడు లేడు /అతిని కడిగేసేవాడు ఒకడుండేవాడు/ ఇక రాడు"** –(మా ఊరు మహాకావ్యం, పుట. 48)

చాలా తక్కువ అక్షరాలను మాత్రమే వాడుతూ, చనిపోయిన వ్యక్తి తాలూకు ముద్రలను గుర్తు చేస్తూ గోపి గారి స్మృతి కవితలు సాగుతాయి. కుల నిర్మూలన సంఘ ఉద్యమకారుడు డి.జి రామారావును 'సజీవి' అంటూ 'ఆయన నవ్వుతుంటే కులం పెంకలు చిట్లుతున్నట్టు' ఉండేది అనడం ద్వారా సారాంశాన్ని మొత్తం చెప్పినట్టుగానే మనకు తెలుస్తుంది. తన మిత్రుడు ఎలిమినేటి మాధవరెడ్డి లేమిని కూడా స్మృతి కవితగా మలిచారు.

**నాయక స్మృతి:**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతో మంది నాయకుల్ని మనం ఆదర్శంగా తీసుకుంటాం. వారు కొత్త బాటను వేస్తారు ప్రపంచానికి దిక్సూచిగా మారుతారు. సామ్రాజ్యవాద శక్తులని ఎదిరిస్తారు. అలాంటి వారిలో యాసర్ అరాఫత్, సద్దాం హుస్సేన్ కూడా ఉన్నారు. పాలస్తీనా అధ్యక్షుడుగా పనిచేసిన యాసర్ అరాఫత్ స్మృతిలో గోపి అరాఫత్ కి యాద్ మే అనే కవిత రాశారు. అందులో అరాఫత్ వ్యక్తిత్వాన్ని, శాంతి కాముకతను, విరాట్ స్వరూపాన్ని, పోరాటపటమను సంపూర్ణంగా చిత్రీకరించారు.

**"అరాఫత్ /ఆకాశమంత వ్యాపించిన అరబ్బు మబ్బువి నువ్వు /కురిసేది నిప్పులనే/ భూగోళం మీద మొలిచిన/ఒకే ఒక్క చూపుడు వేలు వృక్షానివి నువ్వు /ముష్కరులు సృష్టించిన /చలి తుఫానులో/ఈ శతాబ్దం నిండాపరుచుకున్న ఎండవు నువ్వు/ రాలిపోతున్న ఆకులను /మళ్లీ చెట్లకి అతికించే వసంతానివి నువ్వు/ఆరు రుతువుల్ని/ఒకే పోరాట ఋతువుగా మలచిన విశాల ఆకాంక్షవు నువ్వు"**–(అక్షరాల్లో దగ్ధమై, పుట. (9,10) అని

అరాఫత్ ని ఆవిష్కరించారు. పాలస్తీనా ఆకాశంలో అరాఫత్ ని సూర్యుడుగా ప్రకటించారు. ఒక పోరాట ఋతువుగా మన ముందు ఉంచారు. సద్దాం హుస్సేన్ గురించి కవిత రాస్తూ **"నీ గొంతును ముద్దాడిన ఉరితాడుదే అదృష్టం అంటే /నీ విగ్రహాన్ని /తాళ్లతో కూల్చేశారు /అయితే ఏంటీ /ఇప్పుడు ప్రపంచమంత ప్రతిమ నీదీ"** – (దీపం ఒక ఏకాంతం, పుట .105) అని హుస్సేన్ ధైర్యాన్ని తెలిపారు.

**ఇతర స్మృతులు:**

తెలంగాణ శకుంతల మరణించినప్పుడు "తెలంగాణ మృత్తిక, సార్థకమైన నీ జీవిక" అంటాడు. ఉదయ్ కిరణ్ అనే హీరో మరణించినప్పుడు, అక్కినేని వెళ్లిపోయినప్పుడు కూడా వారిని తలచుకున్నారు. ప్రపంచంలోని పర్వతాలన్నీ అధిరోహించిన మల్లి మస్తాన్ బాబుని గుర్తు చేసుకుంటూ 'ఒక్కడే' అని నివాళి కవితను ప్రకటించారు. మల్లి మస్తాన్ బాబుని "మట్టి ఎత్తును ఆకాశము దాకా పెంచిన విశ్వ మానవుడు మన తెలుగు బిడ్డ" అంటూ కీర్తించారు. మరణం మస్తాన్ బాబుని చేరడం ద్వారా మరోసారి జీవించిందని చెప్పడంలో మస్తాన్ బాబు జీవితం, ఆయన మరణం ఎంత గొప్పవో తెలిపారు.

**డా. ఎన్. గోపి కవితల ఆధారంగా స్మృతి కవిత లక్షణాలు:**

గోపి గారి కవిత్వంలో దొరుకుతున్న స్మృతి కవితలలో ఈ క్రింది లక్షణాలు మనం గమనించవచ్చు.

**1. మానవ సంబంధాల పలవరింత**

**2. వ్యక్తి ఆరాధన**

**3. సామాజికత**

**4. స్వీయ ఓదార్పు**

**5. భావోద్వేగాల వ్యక్తీకరణ**

**6. రాజకీయ ఆశయాల కొనసాగింపు**

**7. సాహానుభూతి**

**8. సున్నితత్వం**

**9. వ్యక్తిగత జ్ఞాపకాల కలబోత**

**10. కరుణ రసాత్మకత.**

**ముగింపు:**

డా. ఎన్. గోపి ఒక ఊట బావి. కవితల నీటి బుగ్గ. ఆయన రాసిన స్మృతి కవితలు మన గుండెలను తడతాయి. తడుపుతాయి. మరణించిన వారి పట్ల వారు ఎంత ప్రేమతో, బాధతో వారిని గుర్తు చేసుకుంటూ రాశారో, అదే దుఃఖం, భావం, బాధ, జ్ఞాపకాలు మనకు కూడా కలుగుతాయి. దుఃఖపు పొరల్లో దాగున్న కన్నీటిని రాయగల నేర్పు వారి కవిత్వానికి ఉంది. ఆయన స్మృతి కవితలు మీద ఎం.ఫిల్ కూడా చేయవచ్చు. వాటిని ఒక పరిశోధనాంశంగా స్వీకరించవచ్చు.

**ఆధార గ్రంధాలు:**

**కవితా సంపుటాలు :**

1. గోపి, ఎన్. అక్షరాల్లో దగ్ధమై – జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్ ,2005

2. ------ ఆకాశంలో మట్టి. అభవ్ ప్రచురణలు, హైదరాబాద్. 2016

3. ------ ఎవరి దుఃఖము అది. అభవ్ ప్రచురణలు హైదరాబాద్. 2018

4. ------ కాలాన్ని నిద్రపోనివ్వను. చైతన్య ప్రచురణలు, హైదరాబాద్. 2001

5. ------ క్రియ ఒక జీవన లయ. అభవ్ ప్రచురణలు హైదరాబాద్. 2023

6. ------ చుట్టకుదురు. చైతన్య ప్రచురణలు, హైద్రాబాద్. 2000

7. ----- దీపం ఒక ఏకాంతం. జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్. 2007

8. ----- పురి విప్పిన ఊపిరి. అభవ్ ప్రచురణలు హైదరాబాద్. 2017

9. ------ మనిషిని కలిసినట్టు ఉండాలి. అథర్వ్ అభవ్ ప్రచురణలు హైదరాబాద్. 2021

10. ------ మా ఊరు మహాకావ్యం. అభవ్ ప్రచురణలు హైదరాబాద్. 2010

11. ------ రాతి కెరటాలు. అభవ్ ప్రచురణలు, హైదరాబాద్. 2011

**పరిశోధన గ్రంధాలు:**

1. గోపాలయ్య, ఎస్. వచన కవిత్వంలో స్మృతి, అగస్త్య ప్రచురణలు, రాచపాలెం, 2023

2. చంద్రమౌళి, ఎలవర్తి. తెలుగులో స్మృతికవిత్వం, ఎలవర్తి ప్రచురణలు, తిరుపతి ,1983

3. నళిని, ఎన్. ఎస్. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, నవోదయ బుక్ హౌస్ ,హైదరాబాద్ 2009

4. నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు, ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్: నవంబర్ 2011

★ రచయిత: తెలుగు శాఖాధిపతి, డి. ఆర్. జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

# గూడ అంజయ్య కథలు-విశ్లేషణ

● గరిశందుల సరిత

## పరిచయం

గూడ అంజయ్య ఓ సాహిత్య 'కుసుమం'. పాటలు రాసేకవిగా అందరికీ తెలిసినవాడు. 1.11.1954న లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య లింగాపూర్ గ్రామంలో, ఉన్నత విద్య లక్షెట్టిపేటలో, ఇంటర్మీడియట్ హైదరాబాదు చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసాడు. అనంతరం డీ ఫార్మసీ చేసాడు. ఎమర్జెన్సీలో రాజకీయ ఖైదీగా జైలు శిక్షను అనుభవించిన అంజయ్య ఎమర్జెన్సీ తర్వాత విడుదలయ్యాడు. ఎన్నో విలువైన జీవితానుభవాలు, మేధావులతో, పుస్తకాల పరిచయంతో ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనగలనన్న ధీమాను స్వంతం చేసుకున్నాడు. 1978లో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఫార్మసిస్టుగా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ జీవితంలో ఉంటూనే తెలంగాణ రాష్ట్ర పోరాటంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై కలం పట్టి అనేక పాటలు రాసారు.

నీళ్ళు దోచి, నిధుల దోచి రాజన్న ఓ రాజన్న

వాడు నింద ముంచి రాజ్యమేలే రాజన్న ఓ రాజన్న

లాంటి పాటలు రాశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ కలసినప్పటి నుండి 2014 వరకు జరిగిన మోసాలపై అనేక పాటలు రాసారు. 'ఊరు మనదిరా' పాటతో 1972లో 18 ఏళ్ళ వయసులో ప్రారంభమైన అంజయ్య పాటల ప్రస్థానం ఆయన జీవితాంతం కొనసాగింది. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మార్క్సిస్టు దృక్పథంతో, ప్రజాపోరాట ఇతివృత్తంగా తీసే సినిమాలకు పాటలు రాసారు. దండోరా, చీకటి సూర్యులు వంటి సినిమాల్లో కూడా నటించారు.

గూడ అంజయ్య వివిధ సంస్థలను స్థాపించి సాంస్కృతిక సేవ చేశారు. మిత్రులతో కలిసి 1971లోనే అరుణోదయ అనే కళాసాంస్కృతిక సంస్థను స్థాపించారు. 1987లో కళాస్రవంతి అనే సాంస్కృతిక సంస్థను స్థాపించాడు. వీటి ద్వారా అనేక పాటలు రాసి గ్రామ గ్రామానికి తిరిగి కళాకారుల ద్వారా జానపద బాణీలలో ప్రదర్శనలు ఇచ్చేవారు. 1986-87 ప్రాంతంలో హైదరాబాద్‌లో జరిగిన భారతీయ దళిత సాహిత్య సమావేశాల ప్రభావం అంజయ్యపై ఉంది. 1992లో ఏర్పాటయిన దళిత రచయితల మేధావుల ఐక్యవేదిక ఎంతో ప్రాముఖ్యత వహించిన సంస్థ. అంజయ్య, మాస్టార్జీ, కాలువ మల్లయ్య, రామలక్ష్మణ్ వంటి వారు ద.ర.క.మే. కార్యక్రమాలను ఉధృతం చేసారు. 2003లో పాట కవుల వేదికను స్థాపించారు. వ్యవస్థాపక సభ్యునిగా కళా సాంస్కృతిక రంగాలలో విశిష్టమైన సేవలు చేసారు. తమ కోసం కాకుండా పరులకోసం, కళకోసం, సాహిత్యం కోసం జీవించడంలో ఉన్న ఆనందాన్ని అనుభవించిన కవి గూడ అంజయ్య.

గూడ అంజయ్య విప్లవ సాహిత్యోద్యమకారునిగా, తెలంగాణోద్యమకారునిగా, అస్తిత్వోద్యమ, దళితోద్యమకారుడిగా, సాంస్కృతికోద్యమకారుడిగా పనిచేసిన బహుకార్య నిర్వాగ్నుడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటూ మనిషిని మనిషిగా చూసే వ్యవస్థ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమజీవి. బాల్యంలో అంజయ్యకు జరిగిన అవమానాలు, తనను దళితుడిగా భావించిన వారు దూరంగా ఉంచడం, తరగతి గదిలో అగ్రవర్ణాల వారిని ఒకవైపు దళితులను ఒకవైపు కూర్చోబెట్టిన సంఘటనలు తన మనసును చిదిమివేసాయి. అగ్రవర్ణాల వారి ఇంటి ముందు నుంచి వెళ్తుంటే చెప్పులు వేసుకొని నడవద్దు. మంచి వస్త్రాలు ధరించవద్దు. వాటికి ఇస్త్రీ వద్దు - ఇలాంటి ఆంక్షలు. మేమెందుకు బతుకుతున్నాం? అసలు ఎందుకిలా బతకాలి? ఎందుకు భయపడాలి? ఇలా ఎన్నో సంఘర్షణలు అంజయ్యకు ఎదురయ్యాయి. అప్పటి తెలంగాణ గ్రామాల స్థితి ఉద్యమాలు, దళితుడిగా స్వానుభవాలు, ఎమర్జెన్సీ అనుభవాలు జీవిత నేపథ్యం అనివార్యంగా అంజయ్యను కవిని, రచయితను చేసాయి. అంజయ్య వ్యక్తిగత జీవితం, ఉద్యోగ జీవితం కంటే కవిగా, వాగ్గేయకారుడిగానే దేశమంతటికి తెలుసు.

### కథా రచయితగా అంజయ్య

కల్పనా సాహిత్యంలోనూ అంజయ్యకు ప్రవేశం ఉంది. కాల్పనిక సాహిత్యాన్ని ఇంగ్లీషులో ఫిక్షన్ అంటారు. అంటే కల్పింపబడిన సాహిత్యం. కథ, నవల కాల్పనిక సాహిత్యమే అయినా పద్యాలు ప్రబంధాల్లా రాజుల మెప్పుకోసం రాసిన కల్పనలు కావు. కవులు చదివి వినిపించి అర్థం విడమర్చి చెబితేనే అర్థమయ్యే ప్రకృష్ట బంధాలు కావు. రాజులు రాణుల సకలాతీత శక్తుల గురించి చెప్పేవీ కావు ఈ ప్రక్రియలకు

వాస్తవికతే ప్రాణం.

అంజయ్య కథలు మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు ఆ రాజుల ప్రేమ పురాణం. ఆ ముట్టడికైన ఖర్చులు – తారీఖులు, దస్తావేజులు కావు ***(శ్రీశ్రీ. మహాప్రస్థానం, దేశచరిత్రలు)*** తెలంగాణ జీవన వేదనలు తెలంగాణ సామాజిక, సాంఘిక, చరిత్రలు. సామాజికోద్యమ మాగ్నాకార్టాలు తెలంగాణలో 1970 ప్రాంతం నుంచి జరిగిన విప్లవోద్యమాలు, తెలంగాణ భాషా సొగసులు, ప్రజాజీవితాలు ఈ కథల్లో చూడవచ్చు. రాసినవి ఐదు కథలే అయినా అవి ఆణిముత్యాలు. గూడ అంజయ్య కథలు అనే పేరుతో అచ్చేసిన కథల సంపుటిలోని ఐదు కథలు తెలంగాణ దళితుల బతుకు వెతలను, మండుతున్న తెలంగాణ అగ్ని గోళాన్ని పాఠకుల కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తాయి. ఈ సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న దళితులు ఎక్కువ మంది భూపోరాటాల పట్ల ఎందుకు ఆకర్షితులయ్యారో గూడ అంజయ్య కథలు చదివితే తెలుస్తుంది.

ఇతని కథల్లోని ఏ ఒక్క పాత్ర కల్పితం కాదు. మన చుట్టు కనబడే సజీవ పాత్రలే. తెలంగాణ పల్లెల్లో పీడితులు అనుభవిస్తున్న దళిత పాత్రలే దళిత కథాసాహిత్యానికి గొప్ప చేర్పు. అంజయ్య కథల్లో వర్గ పోరును, వర్ణపోరు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కులం నిచ్చెనమెట్ల సమాజంలో అట్టడుగున ఉన్న దళితుల బతుకు వెతలను, అవమానాలను, దుఃఖాన్ని తిరుగుబాటు తత్వాన్ని ఈ కథల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

అంజయ్య 'దళిత కథలు' సంపుటికి ముందుమాట రాస్తూ బి.యస్. రాములు "కాలాన్ని చరిత్రగా నిక్షిప్తం చేసినవి గూడ అంజయ్య కథలు అంటారు. నడుస్తున్న కాలాన్ని కథలో నిక్షిప్తం చేస్తూ, కళాఖండాలుగా మార్చడం అందరి వల్లకాదు. జీవితాన్ని కాచి వడబోసిన వారికే సాధ్యమవుతుంది." ***(అంజయ్య గూడ, దళిత కథలు, ముందుమాట, పుట : iii)*** అంజయ్య కథల్లోని జీవితం యాభైయేళ్ళ నాటిదైనా ఇప్పటికి చదవాలనిపించే తీరులో చిత్రించడం ఈ కథల విశిష్టత. ఇందులోని ఒక్కొక్క కథ ఒక సుదీర్ఘ జీవితాన్ని లాంగ్ షాట్‌లో నిక్షిప్తం చేసుకున్న డాక్యుమెంటరీ. ఇప్పటిదాకా ఎవరూ స్పృశించని జీవితాలను కథలుగా మలిచి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు బి.యస్.రాములు.

ఇందులోని కథలు ప్రజల దైన్యాన్ని అమాయకత్వాన్ని ప్రజల సంస్కృతిని దృశ్యీకరణ శిల్పంతో సంభాషణాచాతుర్యంతో చక్కగా చిత్రించిన కథలు. ఈ కథలు చదువుతుంటే చదివినట్టుగా ఉండదు. వారి జీవితాలు మన కళ్ళముందు దృశ్యాలుగా సాక్షాత్కరిస్తాయి. ఇందులో పాత్రలు నిజజీవితంలో మన ముందుకు నడిచివస్తాయి. విషయం హృదయానికి హత్తుకుంటుంది. 'లబ్బలబ్బ మొత్తుకుంటున్న తొంటి పోషాలు' అని ఇనాం శెలుక కథలో ఉన్న మాటలు పోషాలు మొత్తుకోలు ధ్వనిని చెవుల్లో ప్రతిధ్వనించేట్టు చేస్తుంది. అంజయ్య కథలు చదవడానికి, వినడానికి అనువుగా ఉండి విశేష ప్రభావం కలిగిస్తాయి. కథల్లో తీసుకొన్నది పల్లె జీవితం, శ్రామిక జీవితం కాబట్టి ఆ పల్లీయుల వాతావరణాన్ని బాగా ఉపయోగించు కోవడం వల్ల అంజయ్య కథలకు చదివించే గుణం అబ్బింది. అమ్మక్క కథ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో జరిగిపోయిన సంఘటనలను కళ్ళకు కట్టిస్తుంది. పల్లెల్లో రైతులు పంటలు లేక స్వాభిమానం చంపుకుని చెప్రాసీలు మారిన పరిణామాల్ని దయనీయంగా 'గౌరడు' కథలో చిత్రించాడు. తెలంగాణ ప్రజలు విప్లవం కోసం ఎందుకు ముందుకు కదిలారో అంజయ్య కథలు స్పష్టం చేస్తాయి.

'ఊరు మనదిరా' పాటలో తరతరాలుగా, యుగయుగాలుగా ఎవరికి కావాల్సిన ఊరు ఎవరికి దక్కిందో చెబితే అంజయ్య కథల ద్వారా ఆ ఊరును రూపొందించిన సర్వ సంపదల సృష్టికర్తలైన దళితుల బాధాతప్త హృదయాలను ఆవిష్కరించాడు.

'కులం అతిభయంకరమైన భూతం, మనిషి మధ్య అడ్డుగోడలు సృష్టిస్తుంది. దీన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి. మనుషులందరూ సమానమనే భావన రావాలి. అందరికీ సామాజిక న్యాయం జరగాలి అన్నదే గూడ అంజయ్య కథల అర్థం పరమార్థం. వీటిని కథలనే కన్నా తెలంగాణ పల్లె ప్రజల ముఖ్యంగా దళితుల వ్యథలని చెప్పొచ్చు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో అట్టడుగు వర్గాలను దొరలు ఏ విధంగా అణచి వేసింది అంజయ్య కథల్లో కళ్ళకు కట్టినట్లు చెప్పారు. ఇనాం శెలుక కథలో అప్పటి ముస్లిం సర్దారులు దళితులైన మాల మాదిగలను ఎలా మార్చారో దృశ్యమానం చేశారు. భీరుపూరి కథలో కూడా దొర సాహించిన దౌష్ట్యం గుండెల్ని పిండేసేదిగా ఉంటుంది.

గూడ అంజయ్య కథలు చదువుతుంటే మన గతం జ్ఞాపకం వస్తుంది. తెలంగాణ గ్రామాల్లో విహరిస్తున్నట్టని పిస్తుంది. తెలంగాణ ప్రజల అమాయకత్వం, దుర్భర పేదరికం కళ్ళముందు కదలాడుతుంది. వాగ్గేయకారుడు కథలు రాయడమేంటని మనకు అనిపించవచ్చు. కాని అతనిలోని రచయిత మౌనంగా ఉండలేకపోయాడు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అణగదొక్కబడుతున్న దళిత వర్గపు ఆర్తనాదాలు, పీడితజనుల గోస వెలివేయ బడుతున్న ప్రజల అవస్థల్ని ఈ కథల్లో చిత్రించాడు. ఈ కథలో

దళితుల మానసిక పరిస్థితి, దొరల ఫ్యూడల్ పద్ధతులు, డబ్బు సంపాదనకై విదేశాలకెళ్ళానే ఆశలు, ఉద్యోగమిస్తానని మోసగించే బ్రోకర్ల మోసాలు, ఊరు చిల్లరదేవుళ్ళు, పట్వారీ పోలీసు పటేలు లాంటి వాళ్ళు మోసాలు దురహంకారాలు ఎన్నో ఎన్నెన్నో ఈ కథలో పాఠకుల హృదయాలు ద్రవించేలా చిత్రించాడు.

తెలంగాణలో 1970 ప్రాంతం నుండి 2000 వరకు వచ్చిన నక్సలైట్, అంబేద్కర్, మాదిగ దండోరా ఉద్యమాల ప్రభావం ఈ కథలపై ఉంది. నైజాం పాలనా కాలంలో తెలంగాణలో జరిగిన మత మార్పిడులను, మతం మారితే జీవితం మారుతుందన్న భ్రమలను చిత్రించిన కథలూ ఉన్నాయి.

**దళిత కథల సంపుటిలో ఉన్న ఐదు కథలు**

**ఇనాం శెలుక**

**'పొద్దు వొడిసి బారెడెక్కింది**

**ఊరవుతల మామిడి తోట్లకెళ్ళి**

**గొడ్డు మాంసం బిర్యాని**

**గుమగుమ వాసనొత్తంది'** అనే వాక్యాలతో కథ మొదలవుతుంది. ***(అంజయ్య గూడ, దళిత కథలు పుట:1)***

ఈ గొడ్డు మాంసం బిర్యానీ వండటం ఎందుకు ?

దళితులు ఇస్లాం మతం తీసుకొని పండుగ చేసుకునే సందర్భం కాబట్టి.

భూమిని ఆశగా చూపి మాల మాదిగలను ముస్లిం మతంలోకి మార్చి గుండ్లు గీయించి, మూతి మీసాలు కొరిగించి మొలతాడును కత్తిరించి మామిడి శెలకలో నిలబెట్టిన తీరు హృదయాన్ని కలచివేస్తుంది. తీరా అన్నింటికి సిద్ధపడ్డ మాలమాదిగలకు ఇనాం శెలుక దక్కదు. వాళ్ళను ముస్లిం మతంలోకి మార్చిన కరీంసాబ్‌కు మాత్రం ఇనాం శెలుక దక్కుతుంది. కథలో ఆటబొమ్మలుగా మారిన మాలమాదిగల బతుకులు దళితుల దుర్భర స్థితిని దృష్టిని ఆకర్షించడానికి పుక్కిడికి దొరికిన దళితులను వాడుకున్నారు. కాని అగ్రవర్ణాల వారిని వాడుకోలేకపోయారు. అటు అగ్రవర్ణాలు, ఇటు ముస్లిం సర్కారుకు మధ్యలో దళితుల జీవాలు 'అడకత్తెరలో పోక' మాదిరి ఇరుక్కున్నాయి. ఈ దేశంలో మతం మారినా దళితుల బతుకులు మారవన్న సందేశాన్నిస్తుందీ కథ. భూమికోసం ఆశపడి మతమార్పిడికి సిద్ధపడ్డ దళితుల మానసిక సంఘర్షణలను హృద్యంగా చూపించారు.

**భీరుపూరి :** మూడు తరాల దళితుల బానిస బతుకును హృద్యంగా చిత్రించిన కథ భీరుపూరి. ముత్తయ్య కొడుకు మల్లయ్య, మల్లయ్య కొడుకు భీరుపూరి. ముత్తయ్య గోపాలరావు దొర దగ్గర తీసుకున్న అప్పుకు జీతం ఉంటాడు మల్లయ్య. ఎంత కష్టం చేసిన అప్పు మాత్రం తీరదు. ఒక రోజు జ్వరం వచ్చి పనికి పోని మల్లయ్యను దొర గోపాలరావు గుంజుకువచ్చి వంగబెట్టి వీపుమీద బండపెట్టిస్తాడు. కొడుకు భీరుపూరి, భార్య రాయపోసు, గూడెంలో ఉన్న వాళ్ళంతా దొరను వేడుకున్నాక అప్పుడు మల్లయ్య వీపు మీద బండ తీయిస్తాడు. అదే బాధలో మూలుగుతూ చనిపోతాడు మల్లయ్య. చనిపోయిన మూడు రోజులకే భీరుపూరిని దొర దగ్గర పనికి రావాలని ఒత్తిడి చేస్తాడు గోపాలరావు. భీరుపూరిని చదివించాలనే కోరిక ఉంటుంది మల్లయ్యకు. అందుకని తల్లి రాయపోసు భీరుపూరిని జీతం ఉంచను అని ఊరు విడిచి వెళ్ళిపోతుంది. కొన్నాళ్ళకు భీరుపూరి మతిలేనివాడుగా మారుతాడు. దొరల దౌర్జన్యాలను వేధింపులను, దెబ్బలను చూసిన అనుభవించిన భీరుపూరి భూపోరాటాలతో ఆకర్షితుడవుతాడు. చైతన్యవంతుడవుతాడు. గదిలో వేసి కొడితే పిల్లి అయినా సరే పులిలా తిరగబడుతుందన్న మాటలకు ఈ కథ చక్కని ఉదాహరణ.

కులం పరంగా పేదలను నిందించడం, భౌతికంగా మానసికంగా వారిని అణచివేయడం. ఈ కథలో ముఖ్యాంశాలు తరతరాల బానిసత్వాన్ని కోరిన అగ్రవర్ణాల దురహంకారాన్ని ఎదిరించడం కూడా కనిపిస్తుందీ కథలో.

**అమ్మక్క:**

పితృస్వామ్య వ్యవస్థలో, పురుషాధిక్య సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న గోసను చెప్పే అమ్మక్క కథ మహిళా చైతన్యానికి ప్రతీక. పాలు, పెరుగు అమ్ముకుంటూ జీవించే 90 సంవత్సరాల వృద్ధురాలు లసుమవ్వ కాలం పోకడలను రాజవ్వ అనే 70 సంవత్సరాల వృద్ధురాలితో జరిపిన సంభాషణలో నుంచి పుట్టింది అమ్మక్క కథ. మహిళల తెగువను చూపించే కథను లసుమవ్వ రాజవ్వకు చెప్తున్న తీరు మా ఊళ్ళో ఏమైందంటే అని మొదలు పెడుతుంది. లస్మవ్వ మల్లవ్వ కొడుకు కొమురయ్య దుబాయ్ వెళ్తాడు. కొమురయ్య భార్య అమ్మక్క అత్తతో ఉంటూ పాలు అమ్ముతూ ఉంటుంది. పాలు అమ్మి వచ్చే దారిలో ఏర్పాటయిన పోలీసు క్యాంపులో కన్నాలాల్ అనే పోలీసు అధికారి అమ్మక్కను బనాయించడం చేస్తుంటాడు. ఏం చేయలేక అత్తకు చెప్తుంది అమ్మక్క. కోడల్ని కూతురిలా చూసుకునే మల్లవ్వ ధైర్యాన్నిచ్చి పోలీసుకు బుద్ధి చెప్పే పథకానికి నడుం కడుతారు. పాలమ్మే దారిలో అమ్మక్కను చూస్తున్న కన్నలాల్‌ని మాటల్లో దింపి రాత్రికి ఆరుబయట మంచంపై

పడుకుంటాను రమ్మని చెప్తుంది. పథకం ప్రకారం మంచంపై దుప్పటి లాగిన కన్నులాల్‌కి మల్లవ్వ కనిపించి దొంగ దొంగ అని అరుస్తూ కళ్ళల్లో కారం కొడ్తుంది. కన్నాలాల్ మంట మంట అని అరిస్తే చుట్టుముట్టిన వారందరు పట్టుకొని కొడ్తారు. పరుగెత్తుకుంటూ వెళ్ళి బావిలో పడ్తాడు. మరుసటి రోజు పాపిరెడ్డి అనే పోలీసు పటేలు ప్రజల ఒత్తిడికి వల్ల కన్నులాల్‌ని సస్పెండ్ చేస్తాడు. జరిగిన కథంతా అమ్మక్క పాపిరెడ్డికి చెబుతుంది. తెగువతో, ధైర్యంతో అమలు పరిచిన పథకం మహిళలందరి కళ్ళు తెరిపించినట్టయింది. అప్పుడు అమ్మక్క ఉద్యమ నాయకురాలు అవుతుంది.

కన్న తల్లిని, ఉన్న ఊరును బలవంతంగా వదిలి, బ్రతుకు తెరువుకోసం పొట్ట చేతపట్టుకొని వలసపోతున్న బలహీన వర్గాలలోని ఓడిపోయిన జీవితాల దీనావస్థని పోలీసుల బెదిరింపుల్ని దృష్టిలో పెట్టుకొని అందించిన కథా వస్తువు అమ్మక్క కథలో కనిపిస్తుంది. పురుషాధిక్య సమాజంలో తెలివితో ధైర్యంగా బతికే అత్తకోడళ్ళ కథ.

**గౌరడు :**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంపులో కిషన్‌లాల్ అనే పాకీపనివాడు అనారోగ్యంతో పనికి రాలేకపోతాడు. వినాయకరావు సలహాతో బ్యాంకు సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం క్యాంపులో సర్కారు ఉద్యోగం ఉందని దండోరా వేయిస్తాడు. ఆ ఉద్యోగ ఎంపికకోసం చదువుకున్న నిరుద్యోగులు, పూజారి కాంతయ్య పంతులు కూడా హాజరవుతారు. తర్వాత మంత్రిగారి బంధువును అని ఇంకొకతను ఇంటర్వ్యూకు వస్తాడు.

తామిచ్చేది పాకీ ఉద్యోగమని తెలిస్తే వచ్చిన జనాలు రెచ్చిపోతారని చేసేదేమి లేక ఎట్టిమాదిగ 'గౌరడి'ని పిలిపియ్యండి అంటాడు సుబ్రహ్మణ్యం. క్యాంపుకు వచ్చిన గౌరడితో అసలు విషయం చెబుతారు. చేసేదేమి లేక గౌరడు చీపురు తీసుకొని పాకీపనిలో చేరిపోతాడు. చెప్రాసీ నౌకరి ఇప్పియ్యండంటూ గౌరడు సుబ్రహ్మణ్యం చుట్టూ 'కాళ్ళు కాలిన' పిల్లిలా తిరుగుతుంటాడు. సర్కారీ నౌకరి అవుతుందన్న ఆశతో ఉంటాడు. సుబ్రహ్మణ్యం క్యాంపు నుండి వెళ్ళిపోయే ముందు 'దొర నౌకరి' అంటూ కదులుతున్న జీపు వెంట పరుగెడుతాడు. జీపులో కూర్చున్న సుబ్రహ్మణ్యం రూపాయి బిళ్ళ గౌరడి మీదికి విసురుతాడు. అది మట్టిలో పడిపోతుంది. జీపువెంట పరుగెత్తి పరుగెత్తి ఎడమకాలు చెప్పు తీసుకొని పోరా. 'ఆనాటి నుంచి ఈనాటి వరకు అందరూ మా నెత్తురు తాగిన తోడెళ్ళు' మీరు అంటూ ఎప్పుడో ఓ సారి మా రోజులు మాకు వస్తాయి అని బాధపడుతాడు. జరుగుతున్న వ్యవహారం చూసి 'పాకీ' ఉద్యోగం అని తెలియగానే కాంతయ్య పంతులు నాలుక కరుసుకుంటాడు. ఇది కథ. ఉద్యోగం ఇప్పిస్తామని ఆశచూపి అమాయక ప్రజల జీవితాలతో ఎలా ఆడుకుంటున్నారనే విషయాన్ని చెప్తుంది 'గౌరడు' కథ.

**జప్తి :**

ఈ కథలో లసుమయ్య బిడ్డ పెండ్లి చేయాలని పొలంలో పంటను జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉంటాడు. భూమి లేనోళ్ళందరు గవర్నమెంటు భూమిని పట్వారీ అనుమతితో సాగుచేసుకుంటూ వెళ్తారు. సాలుకు ఇతని మాట్లాడుకొని తీసుకుంటారు. కౌలు కట్టకపోతే ఇంట్లో ఉన్నదంతా తీసుకెళ్తారు. పొలంకాడ ఉన్న లసుమయ్యకు భార్య లసుమవ్వ భోజనం తీసుకొని వస్తుంది. ఊరులో దండోరా వేసిన విషయం చెబుతూ తాసీలు కట్టకపోతే పట్వారీ బండ బూతులు తిడుతాడు. మూడేండ్ల నుండి వర్షాల్లేవు, పంటలు లేవు ఈయేడయినా వానలు పడి అంతో ఇంతో పంట పండేటట్టు ఉంది అంటుంది. కచ్చీరు దగ్గరికి పటేలు పిలిపించినప్పుడు లసుమయ్య వస్తాడు. లసుమయ్య ఏడ్చుకుంటూ వెళ్తాడు. ఇది జప్తి కథ. రైతుల కష్టాన్ని పెత్తందారులు ఎలాదోచుకొని తింటారనేది ఇందులోని కథావస్తువు. దొరలు పట్వారీల దురహంకారంతో లసుమయ్య ఏ విధంగా నలిగిపోయాడనే విషయాన్ని చెప్తుందీ కథ.

**ముగింపు :**

చెట్టును నరికే గొడ్డలిలోని గొడ్డలి కామ ఆ చెట్టు నుంచి వచ్చిందే అయినా చెట్టు నరకడానికి ఉపయోగపడుతుంది. అలాగే తమ దగ్గర పాలేర్లుగా, సుంకర్లుగా, కాపలాదారులుగా ఉన్న వారితోనే అట్టడుగు వర్గాలను కొట్టించడం దొరలు చేసే పని ఈ కథల్లో భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణలో జరిగిన పోరాటాల ప్రభావముంది. అణగారిన జాతుల పట్ల ఆర్తి ఉంది. పేద ప్రజలు విముక్తి కావాలన్న కాంక్ష ఉంది. కులనిర్మూలన జరిగితేనే ఈ దేశ పీడిత కులాల విముక్తి సాధ్యమన్న ఆశాభావముంది. వర్ణ, వర్గ పోరాటాల అవసరముందన్న కాంక్ష ఉంది. తెలంగాణ గ్రామీణ జీవన సంఘర్షణ నుంచి ప్రతి జీవన సౌరభముంది. సబ్బండ కులాలు ఆత్మగౌరవంతో సమున్నతంగా తలెత్తుకొని నిలబడాలన్న కాంక్ష ఉంది. పీడన, దోపిడిలేని సమసమాజ స్వాప్నికత ఉంది. ప్రతి కథకు సామాజిక ప్రయోజనముంది. ఉద్యమ స్ఫూర్తి ఉంది. ప్రతి కథా ఆనందం. కాకుండా ప్రయోజనం నేపథ్యంగా రాబడిందే.

★ రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు

# పల్లెల్ల పండుగ లొల్లి

రవి కుర్మకోరె

***1990**లనాటి తెలంగాణ జీవితాల్ని, తెలంగాణ జీవద్భాషలో ఉప్పల నరసింహం, తెలిదేవర భానుమూర్తి మొదలైనవారు కాలమ్స్‌గా రాసారు. ఇది **2024** సంవత్సరం. ఈలోగా తెలంగాణ సమాజంలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. మనుషుల జీవితాల్లోకి కొత్త ఆలోచనలు, సంస్కృతులు ప్రవేశించాయి. ఈ మారిన సందర్భంలో మళ్లా ఒకసారి తెలంగాణ సమాజాన్ని బొమ్మకట్టే పనిని చేయాలని నడుస్తున్న తెలంగాణ సంపాదకవర్గం భావించింది. తెలంగాణలోని నిసర్గమైన జీవిత శకలాల్ని, సంభాషణా చతురతను పాఠకులకు పరిచయం చేయడం ఈ కాలమ్ ఉద్దేశం. ఈ క్రమంలో ఇది మొదటి కాలమ్. ఔత్సాహిక యువ రచయిత రవి, కుర్మకోరె ఈ పనిని ఎంతో ఇష్టంగా నెత్తికెత్తుకున్నాడు. ఆయనకు స్వాగతం చెబుదాం. తెలంగాణ జీవితాల్ని, జీవద్భాషలో విందాం.*

ఏమే బీరయ బావా! గీ సెరువు కట్టమీద వన్నవేందే?

మరేంజేయమంటవోయ్.. ఏమన్న మావుల నరకన్నా!

నీ యవ్వ నీ పని బాగుందివా... పరాకత్ కట్టమీద కాళ్లుజాపుకొని పుర్సత్‌గ వన్నవ్.

ఇయ్యల్లనే గాదోయ్... రెండు దినాలసంది ఈన్నే ఉంటున్నమ్,

ఈన్నే తింటున్నమ్, ఈన్నే పంటున్నమ్

అగో.. అదేం కతరో! ఏందే ఏమన్న కోతుల కావాలా? పందుల కావలా?

అయినా! గిప్పుడు కావలి గాసెటందుకు సేన్ల పంటలేం లెవ్వుగదనే..!

ఏ కావలి పాడుగాను... కావలిగాదు, మన్నుగాదు.

గా లొల్లివడక ఈడచ్చి ఉంటున్నమ్.




ఏం లొల్లే? పాలోల్లతోని మల్లేమయిన పంచాదయిందా.?

నీ యవ్వ! ఇన్రానోడచ్చి ఇల్లు కాలవెట్టిండట.! గట్లుంది నీ కత.

ఊర్లనే ఉండుకుంట పాలోల్లతోని పంచాదంటవేందిర బామ్మర్ది!

పురాగ ఊరవతల బతుకుతున్నట్టు జేస్తవ్.!

నేన్యాడుంటినే ఊర్ల...

మీ సెల్లెకు పానం బాగలేక పద్దినాలసంది పట్నంలే పానశరం పడవడితిమి.

అరే బామ్మర్ది! గదా సంగతి... గీ సుద్ది నాకు దెల్వకపాయెరా?

దెలిసింటే గీ ముచ్చటనకపోతుంటినోయ్..

ఏ దాందేముంది బావా!

గోసిల గాశరం బెట్టుకొని ఎన్ని దేశాల్దిర్గినా, ఎన్ని ఏశాలేసినా! ఎక్కడి పాసు గక్కడే!

అవుగని ఎందో లొల్లంటున్నవ్! ఏమన్న పార్టీల లొల్లిన బావా?

ఈ పార్టిలకు అగ్గిదగుల... గీ పార్టిలచ్చినుంచే ఊర్లకు గత్తరజుట్టుకుంది.

వయసుమీది పోరగాండ్లు ఓ అవ్వంటలేరు! ఓ అయ్యంటలేరు! ఓ పెద్దంటలేరు, ఓ చిన్నంటలేరు.

అవునే! గీ కతైతే నువ్వద్దనుకో... మన జమాన్ల గిట్ల బతికినామే.!

ముత్యమంత పోరనికి సద్దిగట్టి గోజలకాడికో, జన్వర్లకాడికో తోలెటోల్లు.

సెప్పినట్టు ఇననోనికి సెవులువిండి, నాల్గు జడికిస్తే సెడ్డిలకెల్లి పంచితం రాలేది.

మరీ... గిట్లగిట్ల బతికింటే ఏనాడో బొందలగడ్డజేర్చి బోకెబోర్లేసెటోల్లు.

నీ యవ్వ.! అన్ని జెప్తున్నవ్గని అసలు కతనే దాయవడ్తివి.

పాలగోకును దాసి పలిగిన పాలు వోసినట్టు జెయ్యవడ్తివి.

ఏ కతనోయ్ బామ్మర్ది! లొల్లి సంగతా! నీ లొల్లికున్నెవడేతు...

ఏం జెప్పమంటవ్ 'కడుపుజింపుకుంటే కాళ్లమీదవడ్తది'.

నడూర్ల ఇల్లుందని నవ్వినట్టు బత్కుదామంటే!

పానాలకే పాయిదలేకుంట అయితదన్కోలేదోయ్...

ఏమైందే నీకు దొబ్బిర్రా.! ఆకిట్ల గూసుంటే అరిలోకమంత కనవడ్తది.

నాలెక్క కోనాడకట్టుకు ఇల్లుంటే!

నా లొల్లి ఊరికి దెల్వదు, ఊరి లొల్లి నాకు దెల్వదాయె.

నీ లొల్లికున్నవడేతు! లొల్లిదెల్సుకొని లోపటవెట్టుకుంటవా.?

గా లొల్లి వడకనే గీడచ్చి పడ్డంరంటే! ఈన్కి లొల్లిదెల్తులేదని నా దగ్గర నీల్గుతుండు.

ఏ... సక్కగ జెప్పు. ఏమో ఎకసెక్కాలు వడవడ్తివి. తిరుగోలే నువు దిరిగి భూమి దిరుగుతుందనవడ్తివి.

అదేరా బామ్మర్ది గా గన్పతులకాడి లొల్లిరా.!

గన్పతులకాడి లొల్లేందే.? పోరగాండ్లేమన్న లొల్లీలువెట్టుకుండ్రా? తన్నుకుండ్రా?

వాళ్లకు గత్తర్రాను... వాల్లు తన్నుకుంటార్రా! నడిమిట్లవొయినోనియి బొక్కలిర్గదంతరు.

మరేం ఆపతొచ్చెనే మరి... లంకంత కొంపవెట్టుకొని గీడవడి తన్లాడుతున్నవ్.

ఏం జెప్పమంటవ్రా! ఎన్కటికిట్లున్నాదిరా గన్పతి పండుగ? గన్పతి పండుగంటే ఊరందరి పొత్తుల నడూర్లొకటి వెడ్దురు. గట్టుకుదొరికే తీరొక్క పువ్వుల్దెచ్చి గన్పతికెక్కించెటోల్లు. తొమ్మిది రోజులు అరొక్క పువ్వుల్తోని పూజల్జేసి సంబురంగ సాగనంపటోల్లు. అదే పెద్ద మోచ్చమాయె.

నువ్వనేదిగూడ రైటేగని బావా! ఏమనెటట్టున్నదే మందిగూడ శానికొచ్చిర్రు.

ఇప్పుడేమో సెడ్డిదొడ్డని పోరగండ్లుగూడా యూతులని ఆడకొక్క గన్పతి వెడ్తున్నరు.

ఓ పువ్వులేదు, ఫలం లేదు. అన్ని గొన్కచ్చుడేనాయె.

చెక్కుచెక్కుమనే లైట్లువెట్టనా! సోందు బాక్సులు వెట్టనా! తప్పతాగి దుంకనా!

అదే గన్పతి పండుగన్కుంటుండ్రు.

ఇప్పుడేమో దొమ్మరి పాటలు, దొమ్మరి దుంకుండ్లు.

ఆడ్డి దుంకుడే, మొగడు దుంకుడే ఇగ యాడికెల్లి అయ్తది సంసారం.

గాళ్లు సోందు బాక్సులు బెట్టుకుంటే నీకేమయితుందే?

అరె నాకేమయితుందా? కాటికి కాళ్లుజాపుకొని గూసుండే ముసలి, ముతక బతుకొద్దురా?

గా సోందు బాక్సుల లొల్లికి కడుపులున్న కార్జాలు, దొబ్బ అదులుతున్నయ్.. ఆయింత గిట్లనే సోందు వెట్టెనా! పూరవిసికి నోరుదెరిసినట్టు నోరుదెరుస్తరు.

అయినా బావా! సర్కారు ఖానూన్తో నడిస్తే గీ కతలెందుకుంటయే?

సర్కారెంతకంట జూస్తదిరా? అయ్య అవ్వ బుగులుండాలే! పోరగాండ్లకు.

ఆయ్యవ్వల మాటోడింటిండే! లీడర్లమాటింటుండ్రు. వాడు వోసే ఎంగిలి కూడుకు ఎంతకైన తలాడిస్తుండ్రు.

పోరగాండ్లేమి జేస్తరే? గీ నడుమంత్రపు ఏశగాండ్లు ఒగన్ని వట్టక ఒగడు గన్పతులు కొనిచ్చుడు సురుజేసిండ్రు.

కుక్కలకు బిస్కెట్లేసినట్టు ఊర్లర్ల వయసులున్న పోరగాండ్లను రెచ్చగొడ్తుర్రు. ఒగనికిమించి ఒగడు గన్పతులు కొనిస్తుర్రు.

ఎన్కటిలెక్కల నడుస్తుందవే బావా! నరలోకం పోగంతకచ్చింది. ఇంట్ల తవ్వెడు బియ్యం లేనోడుగూడ బజార్ల పెద్ద పెద్ద పయంగాలు నర్కుతడు.

గీ బైరూపుల ఏశగాల్లతోనే ఊర్లు అగంగావట్టెగదరా? పచ్చని ఊర్లగ్గూడా అగ్గివెడ్తుర్రు.


★ **రచయిత:** తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# యూనివర్సిటీ ‘రామచిలుకల’కు గుణపాఠ్యాంశం ‘అకడమిక్ అన్‌టచ్‌బిలిటీ’

డా. చంద్రయ్య శివన్న

“Untouchability is the practice of discriminating various individuals and groups based on their cast and the jobs done by them. Untouchability is practiced for a very long time. It works on the Indian caste system hierarchy. The untouchables usually bear inhuman treatment because they belong to the lower caste” (https://www.google.com) అని విశ్వవిజ్ఞాన వేదికైన గూగుల్ Untouchabilityకి ఇచ్చిన నిర్వచనం. పై నిర్వచనంలో రెండో వాక్యం దగ్గరే అసలైన పేచీ అంతా. బహూశా ఈ నిర్వచనాన్ని రాసినవాళ్ళు కూడా అంటరానితనాన్ని అనుభవించినవారు కాదనేది సుస్పష్టం. ‘ప్రపంచీకరణయుగంలో అన్‌టచ్‌బులిటీ ఏమిటండీ! నాన్సెన్స్’ అని కొట్టిపారేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఇక్కడే అసలైన సమస్య, ఘర్షణ, ఆలోచన ప్రారంభమయ్యేది. పై నిర్వచనంలో చివరి వాక్యంలో చెప్పిన లోయర్ కాస్ట్‌లో పుట్టి, ఆ ఇన్‌హ్యూమానిటీని అనుభవిస్తే కానీ, వాట్సప్‌తరంలోని అన్‌టచ్‌బులిటీ పొందిన రూపపరిణామం, దాని తీవ్రత, అర్థంకాదంటూ అనేక పుటల్లోని అంటరాని అక్షరాలు మొత్తుకుంటున్నాయి. స్వీయానుభవాలను చెబుతున్నాయి. సామూహిక అనుభవాలను రికార్డు చేస్తున్నాయి. ఆ అక్షరాలు, ‘ఇది ఒక అప్రకటిత సాంఘిక తిరస్కరణ, సాంస్కృతిక బహిష్కరణ’ అంటూ బహిరంగంగా ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లోనూ ఈ అమానవీయ ఆచరణ ద్రవస్థితిలో ఎలా అమలవుతున్నదో ప్రొఫెసర్ చింతకింది కాశీం రాసిన ‘అకడమిక్ అన్‌టచ్‌బులిటీ’ వ్యాస సంపుటి వివరిస్తుంది. ఈ పుస్తకమంతా పై నిర్వచనంలోని రెండవ వాక్యాన్ని పరాస్తం చేయడానికి ఆధారాలు చూపుతున్నట్టుగా సాగుతుంది.

ప్రొఫెసర్ చింతకింది కాశీం, ఈ గ్రంథంలో ‘అన్‌టచ్‌బులిటీ’ అనే మాటను భారతీయ సమాజంలోని సాంఘిక దురాచారమైన ‘అస్పృశ్యత, అంటరానితనం’ అనే అర్థంలో మాత్రమే వాడలేదు. అన్ని విద్యాస్థాయిల్లో చదువుకుంటోన్న ఎస్సీ, ఎస్టీ, బి.సి. విద్యార్థులు క్రమక్రమంగా విద్యకు ‘అంటరానివాళ్ళు’గా ఎలా మార్చబడుతున్నారు అని చెప్పే విస్తృతార్థంలో ప్రయోగించాడు. ఈ పుస్తకం చదవనివారూ, పుస్తకం శీర్షికను, ప్రొఫెసర్ చింతకింది కాశీం పేరును మాత్రమే చూసినవారూ ఇదేదో దళిత విద్యార్థులకు, వారి విద్యా హక్కులకు సంబంధించిన విషయంగా అర్థం చేసుకునే అవకాశమే ఎక్కువ. నిజానికి ఈ పుస్తకాన్ని కొంతమంది అలాగే ప్రచారంలో పెట్టారు కూడా. ఈ సందర్భంగా నాకు గుర్తొస్తున్న నా చిన్ననాటి అనుభవాన్ని మీతో పంచుకోవాలనిపిస్తోంది. డా. బి.ఆర్. అంబేడ్కర్ దళితులకోసం మాత్రమే కృషిచేసాడని చాలామంది చెప్పేవారు. ఇంకా వివరంగా ఆయన మాలమాదిగల మనిషి అని కూడా చెప్పేవారు. చిన్నతనంలో నేనూ అలాగే అనుకున్నాను. గాంధీ చిత్రపటాన్ని మాత్రమే పెట్టి, డా. బి. ఆర్. అంబేడ్కర్ చిత్రపటం లేకుండా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న దుస్థితి నేడు మరింత ఎక్కువైంది. కొంతమంది అతిథుల ప్రసంగాల్లో ఎక్కడా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అనే విషయం ప్రస్తావనకు రాదు. రాకుండా జాగ్రత్తపడుతారు. ‘అకడమిక్ అన్‌టచ్‌బులిటీ’ పుస్తకంలో ప్రొఫెసర్ చింతకింది కాశీం తన దళిత జీవిత అనుభవాలను మాత్రమే రాసుకున్నట్టుగా చెబుతారు కొంతమంది స్వార్థలోలురు. అంబేడ్కర్‌ను చదివిన తరువాత రిజర్వేషన్లను అన్ని కులాలవారికి అందివ్వడానికి అంబేడ్కర్ చేసిన కృషి ఏంటో అర్థమైనట్టుగా, ప్రొఫెసర్ చింతకింది కాశీం రాసిన ఈ పుస్తకం చదివితేకానీ ఎస్సీ, ఎస్టీ, బి.సి. విద్యార్థుల అభివృద్ధికోసం ఎంత తపిస్తున్నాడో, రాస్తున్నాడో, ప్రసంగిస్తున్నాడో అర్థంకాదు. అంబేద్కర్, ఇతర మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపన పేరుతో నేడు జరుగుతున్న అనేక సభల్లో ప్రొఫెసర్ కాశీం స్వరం వినబడాల్సిందే. దళిత ఆచార్యుడిగా తన ఇరవయ్యేళ్ళ అనుభవంలో ఎదుర్కొన్న అవమానకర సంఘటనలను, విద్యారంగంలో చోటుచేసుకుంటోన్న దుష్పరిణామాలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యపట్ల



చూపుతున్న నిర్లక్ష్యాన్ని పట్టిచూపే 20 వ్యాసాల సంపుటి ఇది. 175 పుటల ఈ పుస్తకం, జనవరి 2020లో ముద్రితమైంది. వెల 120 రూపాయలు.

ఈ పుస్తకంలో రచయిత, సాంఘిక దురాచారమైన అస్పృశ్యత విద్యాత్మక తలం(Academic space)లో ద్రవస్థితిలో అమలవుతోన్న తీరును స్వీయ అనుభవాల్లోంచి వివరించారు. తన ఇరవై అయిదేళ్ళ విద్యాత్మక జీవితంలో విద్యార్థిగా, అధ్యాపకునిగా ఎదురొన్న అవమానాల, తిరస్కరణల, బహిష్కరణల సంపుటి ఇది. గ్రామాల్లో బహిరంగంగా అమలైన అంటారానితనం హైటెక్ నగరంలో రూపం మార్చుకొని వ్యక్తమవుతూ, గాయపర్చిన సన్నివేశాల కనబడని నెత్తుటి సంపుటి ఇది. "అంటరానితనాన్ని అనుభవిస్తే తప్ప అది చేసే గాయాన్ని ఏ పదాలతో వ్యక్తంచేయలేం. దాని క్రూరత్వం, ద్రవీభవంగా ఉంటుంది." అని పుస్తకానికి రాసుకున్న 'అంటరాని వాక్యం'లో రచయిత అంటాడు. ఈ పుస్తకంలో రచయితకు ఎదురైన అనేక అవమానాలను నేపథ్యంగా తీసుకొని, దానికి గల తాత్త్వికతను, వికాసాన్ని కూలంకషంగా చర్చిస్తాడు. వ్యాసాన్ని అధ్యయనం చేయడం మొదలుపెట్టిన పాఠకునికి ఇదేదో రచయిత స్వవిషయంగా అనిపిస్తుంది. తరువాత రచయిత ఎంచుకున్న సమస్యలోని తాత్త్విక నేపథ్యాన్ని, రాజకీయ వ్యక్తీకరణను విశ్లేషించే పద్ధతి పాఠకున్ని ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఈ రచనాశైలిని పట్టిచూపే వ్యాసాలనేకం ఈ సంపుటిలో ఉన్నాయి. 'ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి', ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి', 'జ్యుడిషియల్ అన్‌టచ్‌బులిటి', 'అకడమిక్ అన్‌టచ్‌బులిటి', 'రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు– అగ్రకులతత్వం' మొదలైన వ్యాసాల్లో ఈ పద్ధతిని చూడవచ్చు.

'అకడమిక్ అన్‌టచ్‌బులిటి' అనే వ్యాసంలో రచయిత తాను అధ్యాపకత్వంలోకి ప్రవేశించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు పాచ్య కళాశాల మొదలుకొని, నిజాం కళాశాలలో అమలవుతోన్న అంటరానితనాన్నిగూర్చి వ్యాఖ్యానించాడు. నిజాం కళాశాలలోనే ఒక దళిత మహిళ శాఖాధ్యక్షురాలైతే ఓర్వలేని అగ్రకుల బ్రాహ్మణ్యాన్ని సందర్భానువశంగా పాఠకులకు వివరిస్తాడు. వీటన్నింటికీ స్వీయానుభవాలు, సహానుభవాలే గీటురాయి. 'చదువురానివాళ్ళే రిజర్వేషన్‌లో ఉద్యోగాలు సంపాదిస్తారు, వీరికి ప్రోజ్ (గద్యభాగం) చెప్పడంతప్ప మరేదీరాద'నే అగ్రకులతత్వాన్ని ప్రదర్శించిన విధానాన్ని మనతో పంచుకుంటాడు. నిజాం కళాశాలలో సహాయ ఆచార్యులుగా ఉద్యోగం వచ్చినప్పుడు నెలరోజులపాటు తనకంటూ ప్రత్యేకంగా కుర్చీ ఏర్పాటుచేయలేని అగ్రకులనీతి వికృతరూపాన్ని మనకు పరిచయం చేస్తాడు.

'ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి' వ్యాసంలో, కేంద్ర ప్రభుత్వం, మూడు సంవత్సరాలుగా(వ్యాసం రాసే సమయానికి) దళిత పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్‌లు విడుదల చేయడం లేదనే విషయాన్ని బలంగా నిరూపించారు. 'ఇంటలెక్చువల్ అన్‌టచ్‌బులిటి' అనే మరో వ్యాసంలో తాను పనిచేస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'అగ్రకులాధిపత్యం' ఎంత బలంగా ఉందో టీచర్స్ అసోసియేషన్–2019 ఎన్నికల్లో ఎదురైన అనుభవం ద్వారా వివరిస్తాడు. కులం గురించి మాత్రమే చెప్పకుండా అగ్రకులాధిపత్యాన్ని కాపాడుతూ వస్తోన్న ఔటా(ఉస్మానియా టీచర్స్ అసోసియేషన్) నాయకత్వాన్ని, వారికి తాత్త్విక వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్న సంఘ్‌పరివార్‌ను వారిరువురూ కలిసి విశ్వవిద్యాలయ అకడమిక్ ప్రమాణాలను ధ్వంసంచేసిన క్రమాన్ని సవివరంగా విశ్లేషిస్తాడు రచయిత. ఈ విశ్లేషణ పద్ధతే ఆయన రచనను సామూహికం చేయగల అద్భుత పరికరం. మొత్తంగా ఈ వ్యాసాలన్ని దళిత కులానికి చెందిన గాయపడ్డ విశ్వవిద్యాలయ ఆచార్యుని 'విద్యాత్మక స్వీయ చరిత్ర'(autobiography academics)గా అనిపిస్తాయి. ఈ వ్యాసాలు, స్వీయానుభవాలకు సమాంతరంగా ఇరవై ఐదేళ్ళుగా పెనవేసుకొని పెరిగిన విద్యావ్యవస్థను, దాని ఉత్థాన, పతనాలను తెలియజేస్తాయి.

ప్రస్తుత సమీక్ష రెండవ పేరాలో ప్రస్తావించినట్టు, ఈ పుస్తకం 'అన్‌టచ్‌బులిటీ' అనే పదాన్ని ఎస్సీ, ఎస్టీ, బి.సి. విద్యార్థులు, విద్యకు అంటరానివారవుతున్నారు అనే అర్థంలో కూడా ప్రయోగించబడింది. ఈ వ్యాఖ్యకు ఉదాహరణలుగా 'మా క్యాంపస్‌లో అన్‌టచ్‌బులిటీ లేదు', 'యూనివర్సల్ అన్‌టచ్‌బులిటీ', 'బీసీలకు సంపూర్ణ విద్య– పూలే ఆలోచనలు', 'సంక్షేమ గురుకులాలు క్షేమంగానే ఉన్నాయా?', 'విదేశీ విశ్వవిద్యాలయాలు ఎందుకు, ఎవరికోసం?" అనే వ్యాసాలతో పాటు మరికొన్నింటిని చూవవచ్చు. 1990లనుంచే విశ్వవిద్యాలయాల్లోకి అడుగుపెట్టడం ప్రారంభమైన ఎస్సీ, ఎస్టీ, బి.సి. వర్గాల విద్యార్థులు చదువు'కొన'లేని పరిస్థితిని పాలకులు కల్పిస్తున్న తీరును గణాంకాల సహాయంతో విశ్లేషించారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ద్వారాలు తెరవడం, దేశీయ పెట్టుబడిదారులు విద్యారంగంలోకి ప్రవేశించి, విద్యా కార్పొరేటీకరణకు తెరలేపడం, కేంద్ర ప్రభుత్వం యు.జి.సి. రద్దు ఆలోచన చేయడం, విశ్వవిద్యాలయాల ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానాన్ని అగ్రవర్ణాలవారికి అనుకూలంగా మార్చడం, జాతీయ విద్యావిధానంలో తెచ్చిన మార్పులు, విశ్వవిద్యాలయాల్లో అగ్రకులాలవారిని లేదా అగ్రకుల మనస్తత్వం గలవారిని నియమించడం, ఎమ్.హెచ్.ఆర్.డి.లో సమూల మార్పులు, విశ్వవిద్యాలయాల్లో

శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం, పాఠశాల విద్యనుంచి సంపూర్తిగా ప్రభుత్వాలు తప్పుకోవడం మొదలైన ఎన్నో ప్రజావ్యతిరేక విద్యారంగ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బి.సి. విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని సప్రమాణంగా నిరూపించాడు. ఈ రకమైన విద్యావిధానాలు కిందికులాల విద్యార్థులపై, వారి భవిష్యత్తుపై ఎక్కువగా ప్రభావాన్ని చూపుతాయని తన విద్యారంగ అనుభవంలోంచి మనతో రచయిత సంభాషిస్తాడు.

ఈ పుస్తకంలో 'విద్య: అంబేద్కర్ ప్రాసంగికత', 'విద్యార్థి చలనాలు–పాలకుల స్పందన', 'ఎడ్యుకేషన్ ఈజ్ ది పవర్‌ఫుల్ వెపన్', 'నాకు అమ్మానాన్న లేరు' వంటి వ్యాసాలు విద్యారంగంలోని అనేక పార్శ్వాలను మనకు పరిచయం చేస్తాయి. 'నాకు అమ్మానాన్న లేరు' అనే వ్యాసంలో రచయిత, విక్టోరియా మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ చెప్పడానికి వెళ్ళినప్పటి అనుభవాన్ని ఎంతో హృద్యంగా మనతో పంచుకుంటారు. ఆ స్కూల్లో అనాథలకు విద్యాబోధన జరుగుతున్న విధానాన్ని చెబుతూనే, అటువంటి ఉన్నత ఆశయాలతో నడుస్తున్న పాఠశాల భూములు క్రమక్రమంగా అన్యాక్రాంతమైన విధానాన్ని, పాలకుల నిర్లక్ష్యాన్ని విమర్శిస్తాడు. ఈ రచయిత ఎక్కడకు వెళ్ళినా విద్యారంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను చాలా నిశితంగా పరిశీలించే స్వభావంవల్ల తన ప్రతి అనుభవాన్ని వ్యాసంగా మలచటాన్ని ఈ పుస్తకంలో మనం గమనించవచ్చు.

ఈ రచయిత వ్యాస రచనాశైలి, పాఠకున్ని వ్యాసంలోకి లాక్కుపోతుంది. వ్యాసాన్ని ప్రారంభించే విషయం, రచనాశైలి, ప్రయోగించే భాష ఈ మూడూ పఠితకు సులభగ్రాహ్యంగా ఉంటాయి. కథన పద్ధతిలో ప్రారంభమైన వ్యాసం, నిర్వహణలో వ్యాస విషయ(content of the essay)సంబంధిత పూర్వాపరాలను, దాని తాత్త్విక కోణాన్ని, తద్విషయమైన పాలకుల ప్రతిస్పందనలను ఒక క్రమపద్ధతిలోగానీ, కలగాపులగంగా కానీ చెబుతాడు. తర్వాత వ్యాసాన్ని పఠితలో ఒక పోరాటస్ఫూర్తిని నింపుతూ ముగిస్తాడు. ఇది స్థూలంగా ఈ రచయిత ఎంచుకున్న వ్యాస నిర్మాణం. రచనాభాష కూడా చాల సరళంగా మొదలై, విషయం చిక్కనవుతున్నకొలదీ గాంభీర్యతను, తాత్త్వికతను, సాంకేతికతను అందిపుచ్చుకొని, మరలా సరళమైన భాషలోనే ముగుస్తుంది. "...కనుక ఎస్సీ, ఎస్టీ, బి.సి. ప్రజలు తమకు రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన అవకాశాలకోసం పోరాడుతూనే, సంపదపై హక్కుకోసం జరిగే పోరాటాలలో భాగం కావాలి. ఈ వర్గాలు తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ విముక్తికోసం చేస్తున్న పోరాటాలకు అగ్రకులంలో ఉండే పేదలు మద్దతుగా నిలబడి అగ్రకుల దోపిడీ పాలకులను ఓడించడంలోనే అందరి విముక్తి ఉంది" (కాశీం, చింతకింది. 2020:126-127) అంటూ బాధిత పక్షాల్లో పోరాటస్ఫూర్తిని నింపుతూ వ్యాసాన్ని ముగిస్తాడు. ఇలా ముగించే పద్ధతి ఈ పుస్తకంలోని 20 వ్యాసాల్లోనూ సమానంగా కనిపించే లక్షణం.

రచయిత వ్యాసాన్ని కథనంతో చాలా సాదాసీదాగా ప్రారంభిస్తాడని చెప్పుకున్నాం. స్వానుభవంతో మొదలై సామూహికానుభవాలను కలుపుకొని, వాటికి చట్టబద్ధమైన ఆకరాల(sources)ను, ఆయా చట్టాల నిర్మాణాలను, వాటికి కారణమైన సామాజిక సంఘటనలను ప్రస్తావిస్తూ చెప్పదలుచుకున్న విషయానికి పాఠకులనుంచి ఒప్పుకోలును, సమర్థతను సాధిస్తాడు. విషయ మద్దతుకోసం గణాంకాలను ఆధారంగా చూపిస్తూ, సాధికారికంగా చెప్పే నేర్పు, ఈ పుస్తక రచయితలో కనిపిస్తుంది. ఈయన శైలి పాఠాలను బోధిస్తున్నట్టుగా మౌఖిక లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఈ పుస్తకంలోని ఏ వ్యాసాన్ని తీసుకున్నా మనకు ఈ లక్షణం దర్శనమిస్తుంటుంది. ఈ పుస్తకంలో "1990లో నేను మహబూబ్‌నగర్ జిల్లా లింగాల మండలంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. చాలా నియమనిబంధనలతో చదువు చెప్పేవాళ్ళు. పాఠశాల దాటి బయటికి వెళ్ళే అవకాశం దొరికితే మాకొక సంబురం" (కాశీం, చింతకింది. 2020:97)అంటూ వ్యాసాన్ని సాదాసీదాగా, కథనశైలిలో ప్రారంభించి, భారతదేశ ప్రధాన సమస్య అయిన కులవ్యవస్థ, రిజర్వేషన్ల పుట్టుక- చరిత్ర, అంబేద్కర్–రిజర్వేషన్లు, రిజర్వేషన్ల అమలు, రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు, అగ్రకులతత్వం ఇలా గంభీరమైన విషయాల్లోకి పఠితలను చేయిపట్టుకొని ఒక్కొక్క అడుగు వేయిస్తాడు. సంక్లిష్టమైన విషయాలను కూడా ఒక్కొక్క పొర విప్పుకుంటూ కన్నతల్లి నీతిబోధ చేస్తున్నదానివలె చెప్పడం ప్రొఫెసర్ చింతకింది కాశీం ప్రత్యేకత. ఈ రచయిత మౌలికంగా గొప్ప ప్రసంగకర్త. ఆయన ప్రసంగాలను వినడానికి ప్రజలు గంటలతరబడి వేచిచూస్తారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారికి ఈ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కనుక, ఈ మౌఖిక లక్షణంవల్లనేనేమో ఈయనకు ప్రత్యేక రచనాశైలి అలవడింది. ఇదే ఆయన కలానికి, గళానికి బలం.

అందరూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ గురించి మాట్లాడుకుంటోన్న ఈరోజుల్లో విద్యకు ఆవలగా ఇంకా అనేక సమూహాలున్నాయి. ఆ సమూహాలకు చైతన్యం రావాలంటే, వారికి విద్యను అందించడం ఒకటే మార్గం. ఆ ఖాళీని గుర్తించిన 'చూపున్న' వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయని భరోసా ఇస్తూ సెలవు.

★ రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల

# వరంగల్ జిల్లా జానపద గేయకథల అధ్యయనం

డా. ధారవత్ సంతోష్‌కుమార్

**పరిశోధన శీర్షిక** (title of the research)

తెలుగు సాహిత్యంలో స్థానిక సాహిత్యాన్ని పునరుజ్జీవింప చేసే ప్రయత్నం విస్తృతంగా జరుగుతున్నది. జిల్లాల వారీగా, మండలాల వారీగా, ప్రాంతాలవారీగా, ఆయా చోట్ల ప్రాధాన్యం ఉన్న సాహిత్యాన్ని సేకరించి వివిధ వర్గాలుగా క్రోడీకరించి వెలువరిస్తున్నారు. ఇది జానపద సాహిత్య పరిశోధనకు వాస్తవికమైనది.

నేను వరంగల్ జిల్లా స్థిరనివాసి కావడం వల్ల, వరంగల్ జిల్లా జానపదుల సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు మరియు కట్టుబాట్లు, జాతరలు, కథలు, గేయకథలు మొదలగు అంశాలను గూర్చి పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించి నేను ఎమ్.ఫిల్ కాల పరిమితి దృష్ట్యా "తొర్రూరు మండల జానపద కథలు–పరిశీలన" అనే అంశాన్ని ఎన్నుకుని క్షేత్ర పర్యటన ద్వారా మండలం మొత్తం తిరిగి జానపద మౌఖిక కథలను సేకరించి, సేకరించిన కథలను విశ్లేషించి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఫిల్ పట్టాను 2014 లో తీసుకున్నాను. ఈ జానపద మౌఖిక కథలను సేకరించే క్రమంలో నాకు గేయకథలు కూడా లభించాయి. అందువల్ల క్షేత్ర పర్యటన ద్వారా వరంగల్ జిల్లా మొత్తం తిరిగి జానపద గేయ కథలను సేకరించాల్సిన అవసరం ఉందని భావించి "వరంగల్ జిల్లా జానపద గేయకథల అధ్యయనం" అనే పరిశోధనాంశాన్ని ఎన్నుకొని, పరిశోధన చేశాను. దీన్ని డా. డి. విజయకుమారి పర్యవేక్షణలో తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2018 లో సమర్పిచాను.

**పరిశోధనాంశ పరిధి** (Scope of Research )

నేను ఈ పరిశోధన కేవలం వరంగల్ జిల్లాలోని జానపద మౌఖిక గేయకథలకు పరమితమైయ్యాను. క్షేత్ర పర్యటనలో నేను సేకరించిన గేయకథలననుసరించి పరిశోధనను కోనసాగించాను. క్షేత్ర పర్యటనలో వివిధ గ్రామాలు తిరిగి యాభై ఎనిమిది(58) మౌఖిక జానపద గేయకథలను సేకరించాను. సేకరించిన వాటి తాలూకా వివరాలను, వ్యవహర్తల


warañgal zillā jānapada gēyakathala adhyayanaṁ

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)

Researcher
DARAVATH SANTHOSH KUMAR
14HTPH05

Supervisor
Dr. D. VIJAYA KUMARI

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500 046
Telangana, India
November - 2018

వివరాలను, గ్రామాల, మండల మొదలైన సమాచారమును సిద్ధాంత గ్రంథంలో పొందుపర్చాను.

**పూర్వ పరిశోధనల సమీక్ష** (Review of Literature)

ఈ పరిశోధన గ్రంథ రచనను నేను క్షేత్ర పర్యటనలో సేకరించిన మౌఖిక జానపద గేయకథలను మాత్రమే పరిశీలించాను. ఈ సిద్ధాంత గ్రంథ రచనకు డా. బిరుదురాజు రామరాజు గారి "తెలుగు జానపద గేయసాహిత్యము" అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. నాయని కృష్ణకుమారి గారి "తెలుగు జానపద గేయగాథలు" అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. తంగిరాల వెంకట సుబ్బారావు గారి "తెలుగు వీరగాథా కవిత్వం" అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.డా. రావిప్రేమలత గారి "తెలుగు జానపద సాహిత్యం–పురాగాథలు" అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. ఎం.శత్రుఘ్నరెడ్డి గారి "నల్లగొండ జిల్లా జానపద గేయగాథలు" అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, అలాగే "కరీంనగర్ జిల్లా కథాగేయాలు" అనే అంశం పై ఐ. స్వామిరెడ్డి పరిశోధన గ్రంథం మొదలైనవి.

**పరిశోధన ఉద్దేశం,లక్ష్యం** (Aims and Objectives)

జానపద సాహిత్యంలో పరిశోధనలు గేయ, కథ, జాతీయాలు, సామెతలు, పొడుపు కథలు ఇత్యాది అంశాలపై ఎక్కువగా జరిగాయి. ఇప్పటివరకూ గేయ కథలపై కొన్ని జిల్లాల పరిధులకు లోబడి పరిశోధనలు జరిగాయి. కాబట్టి వరంగల్ జిల్లా జానపద గేయకథలను సేకరించి లిఖితబద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ గేయకథలలోని సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సామాజిక మొదలైన అంశాల గురించి విశ్లేషించి భవిష్యత్తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేడు ఆధునిక సమాజం పాశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు వేస్తోంది. జానపద సాహిత్యం కనుమరుగై పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. కనుక నా వంతు బాధ్యతగా గేయకథలకు పరిమితమై పరిశోధన కొనసాగించాను.

**పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక**

(Methodology And Conceptual Framework)

వరంగల్ జిల్లా జానపద గేయకథలలో నేను క్షేత్ర పర్యటనలో సేకరించిన మౌఖిక జానపద గేయకథల ఆధారంగా మాత్రమే ఈ పరిశోధన కొనసాగింది. ఇది ఈ గ్రంథ పరిమితి. నాకు లభించిన మౌఖిక జానపద గేయకథలను డా. తంగిరాల వెంకట సుబ్బారావు గారు విభజించిన రీతిలో విశ్లేషించాను. ఎనిమిది గేయకథ చక్రాలు (Ballad cycle) వీటి నిడిది మూడు గంటల నుండి మూడు గంటల నలభై నిమిషాల వరకు ఉన్నాయి. పది గేయ కథలు( Ballads) వీటి నిడిది ఒక గంట నుండి గంట ముప్పై నిమిషాల వరకు ఉన్నాయి. అలాగే నలభై లఘు గేయ కథలు (Balladlings) ఇవి ఒక నిముషం నుండి నలభై నిమిషాల వరకు నిడిది ఉన్నాయి.

**అధ్యాయ విభజన** (Chapter Division)

నాకు లభించిన జానపద గేయకథల ఆధారంగా, జానపదుల యొక్క మనస్తత్వమును సమగ్రంగా, శాస్త్రీయంగా పరిశీలించిన పిమ్మట ఈ పరిశోధన గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించుకున్నాను. అవి :

1. వరంగల్ జిల్లా చారిత్రక, భౌగోళిక స్వరూపం
2. జానపద సాహిత్యం–గేయకథలు
3. వరంగల్ జిల్లా జానపద గేయకథలు–సామాజిక, సాంస్కృతికాంశాలు
4. వరంగల్ జిల్లా జానపదగేయకథలు–చారిత్రక, దేవతా సంబంధాంశాలు
5. వరంగల్ జిల్లా జానపద గేయకథలు–స్త్రీ జీవన చిత్రణ
6. వరంగల్ జిల్లా జానపద గేయకథలు–భాషాంశాలు

**పరిశోధన ఫలితాలు** (Rwsearch Findings)

1. జానపద గేయకథలలో సామాజికాంశాలు ప్రతిబింబిస్తుంటాయి. బాల్యవివాహాలు, అగ్రవర్ణాల ఆధిపత్యం, పేదవారి స్థితి, ఎన్నికల ప్రస్థావన, జూదం ఆడటం, కరువు మొదలగు అంశాలలో మానవ ఆలోచనలను రేకెత్తించే అంశాలు అనేకం ఉన్నాయి.

2. సమాజంలో జాంబవుల ప్రస్తావన ఉన్నట్లు నేను సేకరించిన మల్లయ్య దేవుని గేయకథ ద్వారా తెలుసుకోవచ్చు.

3. అగ్రవర్ణాలను ఎదిరించిన స్త్రీలు చాలా మంది ఉన్నారు. బయమ్మ గేయకథలో బయమ్మ అగ్రవర్ణాలను ఎదిరించిన స్త్రీమూర్తిగా కనిపిస్తుంది. బయమ్మ వలె వరంగల్ జిల్లాలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ వంటి స్త్రీలు అనేక మంది ఉన్నారు. గేయకథ వాస్తవ సంఘటన ఆధారంగా పుడుతుందనే విషయం ఇక్కడ నిరూపితమైంది.

4. వరంగల్ జిల్లా మాండలిక పదాలలో బహువచన ప్రత్యయం అయిన '–లు' ను చాకలి, మంగలి వంటి జాతి వాచక పదాలకు ప్రత్యక్షంగా చేర్చడం కనిపించదు. అలాంటి సందర్భంలో 'ఓ' అనే ఔప విభక్తి ప్రత్యయాన్ని చేర్చి ఉచ్చరించడం గమనించాను. ఉదాహరణకు వడ్రంగిం+ఓ ల్లు=వడ్రంగోల్లు, చాకలి+ఓ+ల్లు=చాకలోల్లు.

**భావి పరిశోధకులకు సూచనలు**

(Suggestions For Upcoming Researchers )

జిల్లాలో మౌఖిక జానపద గేయాలు, కథలు, గేయకథలు, జాతీయాలు, సామెతలు, పొడుపుకథలు చాలా దొరుకుతాయి. వాటిని కూడా సేకరించి, భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత భావి పరిశోధకులపై ఉంది.

**పరిశోధకుని వివరాలు:** డా. ధారవత్ సంతోష్ కుమార్, గ్రామం, మండలం: తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా, చరవాణి:9704450273, santhu.daravath@gmail.com

★ రచయిత: తెలుగు ఉపాధ్యాయుడు

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007